# క్రాంతి

## లోపలి పేజీల్లో...


రైతాంగ ఆత్మహత్యలు ........ 17

పార్టీ కమిటీల పని పద్ధతులు .... మధ్య పేజీ

ప్రత్యేక ఆర్థిక మండలాలు... ........ 24

చితికిపోతున్న చేనేత... ........ 30

కా. సంజీవ్ జీవిత చరిత్ర ........ 33

స్వేచ్ఛా గీతం చే గెవారా ........ 34

పి.ఎల్.జి.ఎ. ప్రతిఘటన ........ 37



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 33 సంచిక: 4 జూలై - ఆగస్టు 2009 వెల: ఐదు రూపాయలు


**జూలై 28-ఆగస్టు3 అమరుల సంస్మరణ వారాన్ని విజయవంతం చేద్దాం**

# ఆంధ్ర ప్రదేశ్ విప్లవోద్యమంలో నేలకొరిగిన మన గొప్ప నాయకులను స్మరించుకుందాం!



భారత విప్లవోద్యమ చరిత్రలో జూలై 28కి ఎంతో ప్రాముఖ్యత వుంది. ఈ దేశాన్ని దోపిడీ పీడనల నుండి విముక్తి చేయడం కోసం తమ నులి వెచ్చని నెత్తురుని ధారపోసిన విప్లవవీరులను స్మరించుకునే ఉద్విగ్న భరితమైన దినం. తమ ప్రియతమ అమరులు వేసిన త్యాగాల దారిలో ముందుకు నడుస్తామనీ, అమరులు కన్న కలలను నిజం చేస్తామని విప్లవ ప్రజానీకం ప్రతిజ్ఞ చేసే ఉత్తేజ భరితమైన దినం.

రివిజనిజం నడ్డి విరిచి నక్సల్బరీ పోరుతో భారత విప్లవోద్యమానికి సరైన పంథాను నిర్దేశించిన కామ్రేడ్ చారుమజుందార్ కన్నుమూసిన రోజు జూలై 28. ఈ రోజునే చారుబాబు వారసత్వాన్ని సగర్వంగా స్వీకరించి, ఆయన చూపిన మార్గంలో దృఢంగా నడిచి నేలరాలిన అమర వీరులందరినీ స్మరించుకుంటున్నాం. ప్రారంభంలో ఈ ఒక్కరోజునే సంస్మరణ దినంగా పాటించేవాళ్లం. క్రమంగా జూలై 28 నుండి ఆగస్టు 3 వరకూ అమరవీరుల సంస్మరణ వారంగా పాటిస్తున్నాం.

ఈ సంస్మరణ వారం సందర్భంగా విముక్తి దారిలో ప్రాణ త్యాగం చేసిన భారత విప్లవ వీరులందరికీ పేరు పేరునా జోహార్లర్పిద్దాం. అలాగే ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా ప్రాణాలర్పించిన ప్రపంచవ్యాప్త విప్లవవీరులందరికీ జోహార్లర్పిద్దాం.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమం బాగా దెబ్బతిన్నది. నిర్బంధం తీవ్ర స్థాయిలో వుంది. కనుక మునుపటిలా ప్రజలు పెద్ద ఎత్తున కదిలి, బహిరంగ సభలు జరిపి తమ ప్రియతమ అమరులను స్మరించుకునే అవకాశం చాలా చోట్ల లేదు. నాలుగుగోడల మధ్య నలుగురైదుగురు కూడి రహస్యంగా స్మరించుకోవాల్సిన పరిస్థితి. అలా కూడా సాధ్యం కాకుంటే ఎవరికి వాళ్లు వంటరిగానే తమ మదిలోనే అమరులను స్మరించుకొని నిశ్శబ్దంగా జారే కన్నీళ్లను కత్తులుగా మార్చుకుంటామని ప్రతిజ్ఞ చేయాల్సిన పరిస్థితి.

ఇటువంటి ఒక కఠిన సందర్భంలో ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమంలో కీలక పాత్రను పోషించిన కొంతమంది అమరుల జీవిత చరిత్రలను తడుముకుందాం. ఇలా తడుముకోవడమంటే అస్తమించిన సూర్యుడు నూతన కాంతులతో తప్పక ఉదయిస్తాడని చాటడం. కమ్ముకున్న కారు మేఘాలను కాంతిరేఖలు చీల్చి చెండాడుతాయని ప్రకటించడం.

అమరులైన ప్రతి ఒక్కరి జీవితమూ విలువైన అధ్యాయమే. ప్రతి ఒక్కరి కృషి ఉద్యమ చరిత్రలో నిలిచిపోయేదే. ప్రతి ఒక్కరికి శిరసు వంచి వినమ్రంగా జోహార్లర్పించవల్సిందే. కానీ ఇక్కడ ఆంధ్ర ప్రదేశ్ ఉద్యమానికి కార్యదర్శులుగా బాధ్యత వహించి ఉద్యమంలోని కొన్ని కీలకమైన మలుపులకు ప్రాతినిధ్యం వహించిన కామ్రేడ్స్, ఆంధ్రప్రదేశ్ ఉద్యమం నుండి కేంద్ర కమిటీలోకి ఎదిగి అమరులైన కామ్రేడ్స్, అలాగే కొందరు సీనియర్ మహిళా కామ్రేడ్స్ జీవిత చరిత్రలను తడుముదాం. ఆంధ్రప్రదేశ్ ఉద్యమం అంటే మునుపటి ఆంధ్రప్రదేశ్ ఉద్యమం, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్(ఎ.పి.), ఉత్తర తెలంగాణా(ఎన్.టి.), ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు(ఎ.ఒ.బి.) జోన్లుగా అభివృద్ధి చెందిన వుద్యమం అని అర్థం.

## ఈ విప్లవాగ్నులెచటివని అడిగితే శ్రీకాకుళం వైపు చూడమని చెప్పాలి...

దేశంలోనే నక్సల్బరీ పంథాలో మొదటగా ప్రయాణించిన శ్రీకాకుళ పోరాటానికి భారత నూతన ప్రజాస్వామిక విప్లవ చరిత్రలో విశిష్ట స్థానం వుంది. ఈ పోరాటానికి నాయకత్వం వహించిన కామ్రేడ్స్ సత్యం, కైలాసం, పంచాది క్రిష్ణమూర్తి, తామాడ గణపతి, పాణిగ్రాహి, పంచాది నిర్మల, అంకమ్మ, సరస్వతి తదితరులు చారుబాబుకు సగర్వమైన వారసులయ్యారు. వీర తెలంగాణా సాయుధ పోరాటానికి వెన్నుపోటు పొడిచిన రివిజనిస్టులు, ప్రజల చైతన్యాన్ని పార్లమెంటు చట్రంలోకి కుదించే కుట్రకు పాల్పడుతున్న సమయంలో పోరుబాటపై దృఢమైన విశ్వాసంతో ఈ కామ్రేడ్స్ సిక్కోలులో నిప్పును రాజేశారు. ఈ జిల్లాలోని అటవీప్రాంతమైన పార్వతీపురం, పాలకొండ, పాతపట్నం; మైదాన ప్రాంతాలైన టెక్కలి, సోంపేటలలో భూస్వాములు, వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా ఆదివాసీ, పేదరైతుల చైతన్యాన్ని రగిలించారు. 1960లో కామ్రేడ్ సత్యం అధ్యక్షుడిగా, కామ్రేడ్ కైలాసం కార్యదర్శిగా ఆదివాసీ రైతు సంఘం ఏర్పడింది. ఈ సంఘం నిర్వహించిన పోరాటంలో వెయ్యి ఎకరాలకు పైగా భూమిని కల్గిన నీలకంఠాపురం భూస్వామి పగడాల నాయుడువంటి ఎందరో భూస్వాముల భూములు పేద రైతాంగానికి స్వాధీనమయ్యాయి. దారుణంగా ఉండిన కూలీ రేట్లు పెరిగాయి. రెవెన్యూ, ఫారెస్టు అధికార్ల దోపిడీ, దుర్మార్గాలకూ, లంచగొండి తనానికీ అడ్డుకట్ట పడింది. దొంగ తూకం షావుకార్ల, వడ్డీ వ్యాపారుల నడ్డి విరిగింది. వెట్టిచాకిరీ నిర్మూలించబడింది. కూలీరేట్ల సాధన కోసం సమ్మెల వంటి పోరాట రూపాలు విజయవంతమయ్యాయి.

ఇలా సాగుతున్న పోరాటానికి నాడు ప్రారంభమైన నక్సల్బరీ పోరాటం సరైన దిశను చూపించింది. 1968 మేలో ఏర్పడిన అఖిల భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ కమిటీ (ఎ.ఐ.సి.సి.సి.ఆర్.) నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా రాజ్యాధికార స్వాధీన పోరాట కర్తవ్యాన్ని అందించింది. దాన్ని సత్యం తదితర శ్రీకాకుళ పోరాట నాయకులు స్వీకరించారు. నాడు ఏర్పడిన ఎ.ఐ.సి.సి.సి.ఆర్.ను శ్రీకాకుళ పోరాట నాయకులు నిజమైన విప్లవకారుల సమన్వయ కమిటీగా గుర్తించారు. ఆనాటి రాష్ట్ర కమిటీ ఎ.ఐ.సి.సి.సి.ఆర్.లో చేరకపోతే రాష్ట్ర కమిటీ నుండి విడిపోయి తాము దానిలో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. ఆనాడు వీరికున్న రాజకీయ స్పష్టతకు తార్కాణమిది. అయితే నాడు రాష్ట్ర కమిటీగా వున్న తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వర రావు, చంద్ర పుల్లారెడ్డిలు ఎ.ఐ.సి.సి.సి.ఆర్.లో చేరినప్పటికీ తమ మితవాద పంథా విడువని కారణంగా బహిష్కరణకు గురయ్యారు. శ్రీకాకుళ పోరాట నాయకులు కూడా వారి మితవాద ధోరణులపై పోరాడారు.

ఎ.ఐ.సి.సి.సి.ఆర్. నిర్దేశించినట్టు పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం జిల్లాలో రైతాంగ గెరిల్లా దళాలు ఏర్పడ్డాయి. రివిజనిజాన్ని చావుదెబ్బ కొడ్తూ 1968 నవంబర్ 25న గరుఢ భద్ర భూస్వామి మద్ది కామేశం ఖతంతో శ్రీకాకుళ సాయుధపోరాటం ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా ఎన్నో గెరిల్లా చర్యలు జరిగాయి. అయితే ఏ చర్య కూడా దళ చర్యగా వుండలేదు. ప్రతి చర్యలోనూ అయిదు వందలు నుండి వెయ్యి మంది ప్రజలు పాల్గొనేవారు. గెరిల్లా చర్యల్లో విస్తృతమైన ప్రజానీకం పాల్గొనడం అనేది శ్రీకాకుళం పోరాటం మొత్తంగా కనబడుతుంది. ఇలా దేశవ్యాప్తంగా ఉత్తేజ పరిచిన వీరోచిత గెరిల్లా పోరాటాన్ని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పాశవిక నిర్బంధం ప్రయోగించి అణచివేసింది. ఈ పోరాటానికి నాయకత్వం వహించిన వారినీ, ఎందరో సాధారణ కార్యకర్తలనూ క్రూరంగా హత్య చేసింది. ఈ పోరాటం అణచివేతకు గురైనప్పటికీ ఆ పోరాట చైతన్యం మాసిపోలేదు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిన ఆ చైతన్యం ఆ తర్వాత కాలంలో జగిత్యాల జైత్రయాత్రగా ముందుకొచ్చింది. అంతేకాదు నాటి పోరువీరులూ ప్రజల స్మృతుల్లో శాశ్వతంగా నిలిచిపోయారు. అలా నిలిచిపోయిన వారిలో కొందరు ముఖ్యుల గురించి చెప్పుకుందాం.

**ఎర్ర జెండా ఇంత ఎరుపేమిటని యడుగ**

**సత్యము రక్తముతో తడిసెనని చెప్పాలి...**

## కామ్రేడ్ వెంపటాపు సత్యం



సత్యం మాస్టారిగా ప్రసిద్ధి చెందిన కామ్రేడ్ వెంపటాపు సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా బొబ్బిలి తాలూకా బూర్జువలస గ్రామంలో పేదరైతు కుటుంబంలో పుట్టాడు. ఆయన గుమ్మ గ్రామంలో 8వ తరగతి వరకూ చదివాడు. ఆ తర్వాత 1956-57లో పార్వతీపురం ఏజెన్సీలోని గొయ్యిపాక గ్రామంలో ఉపాధ్యాయ వృత్తి ప్రారంభించాడు. అక్కడే ఆదివాసీ ప్రజానీకం గురవుతున్న దోపిడీని మరింతగా అర్థం చేసుకున్నాడు. 1958లో కొండబారిడి గ్రామంలో ఒక పాఠశాలను ప్రారంభించాడు. పేద ప్రజలకు పోరు పాఠాలు నేర్పుతూ కొండబారిడి మాస్టారుగా ప్రజల తల్లో నాలుక అయ్యాడు. క్రమంగా ఆదివాసీలను సంఘటితం చేస్తూ ఆ ప్రాంతపు భూస్వాములకూ, షావుకార్లకూ, వడ్డీ వ్యాపారులకు కంట్లో నలుసయ్యాడు. 1960లో కామ్రేడ్ సత్యంకు కమ్యూనిస్టు పార్టీ, సభ్యత్వం ఇచ్చి జిల్లా కమిటీ సభ్యుడిగా తీసుకుంది. అదే సంవత్సరం మొండెంఖల్ గ్రామంలో మొట్టమొదటి ఆదివాసీ రైతాంగ మహాసభ జరిగింది. కామ్రేడ్ సత్యం అధ్యక్షుడిగా, కైలాసం కార్యదర్శిగా ఆదివాసీ రైతాంగ సంఘం ఏర్పడింది. ఈ సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు మరింత ఉధృతమయ్యాయి.

1961లో కామ్రేడ్ సత్యం మాస్టారు ఉద్యోగానికి రాజీనామా చేసి ఉద్యమాన్ని విస్తరింప చేశాడు. పాలకొండ, సీతంపేట, సాలూరు ప్రాంతాలకు ఉద్యమం విస్తరించింది. చైతన్యయుతమైన పోరాటంతో ఈ అటవీ ప్రాంతాలన్నీ మైదాన ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచాయి.

ఒకవైపు పోరాటాలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహిస్తూ మరోవైపు రివిజనిజంతో రాజీలేని పోరాటం చేశాడు. ఎ.ఐ.సి.సి.సి.ఆర్. ఆదేశాలను అనుసరించి గెరిల్లా దళాలను నిర్మించి ఈ గెరిల్లా దళాలకు స్వయంగా తుపాకీ కాల్చడం, రక్షణ తీసుకోవడం మొదలైన విషయాల్లో శిక్షణనిచ్చాడు. ఆ తర్వాత అనేక మంది భూస్వాములపై చేసిన దాడులకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించాడు. తన నాయకత్వంలో గెరిల్లాదళాలు పోలీసులపై, పోలీసు క్యాంపులపై ఎన్నో దాడులు చేశాయి. ఉద్యమ అణచివేతకు ప్రభుత్వం పంపిన సి.ఆర్.పి. బలగాలతో వీరోచితంగా తలపడ్డాయి.

ఈ ప్రతిఘటనను విజయవంతం చేయడం కోసం కామ్రేడ్ సత్యం నూతన ఎత్తుగడలను రూపొందించాడు. ప్రతిఘటన చర్యల్లో ప్రజల పాత్రను పెంచడంలో, ప్రజా పంథాను అమలు చేయడంలో కామ్రేడ్ సత్యం మాస్టారు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నారు. కామ్రేడ్ సత్యం మాస్టారు మంచి ఉపన్యాసకులు. ప్రజలకు అర్థమయ్యే భాషలో రాజకీయాలను చెప్తూ వారిని ఉగ్రూతలూగించేవారు.

ఇలా శ్రీకాకుళ పోరాటం ఉధృతంగా సాగుతున్న సమయంలోనే కామ్రేడ్ చారు మజుందార్ నాయకత్వంలో 1969 ఏప్రిల్ 22న సి.పి.ఐ. (ఎం.ఎల్.) ఏర్పడింది. కామ్రేడ్ సత్యం మాస్టారు కేంద్రకమిటీ సభ్యుడయ్యాడు.

ఇలా తన చైతన్యవంతమైన ఆచరణ ద్వారా శ్రీకాకుళాన్ని నక్సల్బరీ దారిలో నడిపించి భారతదేశ విప్లవానికి విలువైన అనుభవాలను అందించిన కామ్రేడ్ సత్యం మాస్టారు, 1970 జూలై 10న గుండెవాడ కొండమీద పోలీసులతో జరిగిన పోరులో కామ్రేడ్ కైలాసంతో పాటు అమరుడయ్యారు. వీరి అమరత్వం సిక్కోలు ఉద్యమానికి పెనువిఘాతంలా తాకింది.

**సత్యంకు అండ ఆదివాసీలకు గుండె...**

## కామ్రేడ్ ఆదిబట్ల కైలాసం



కామ్రేడ్ కైలాసం కామ్రేడ్ సత్యం మాస్టారుకు ప్రియమైన స్నేహితుడు. ఆయనతో కల్సి శ్రీకాకుళ ఉద్యమానికి నేతృత్వం వహించాడు. ఆయనతో పాటే సి.పి.ఐ.(ఎం.ఎల్.) కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఆయనతో పాటే అమరత్వం చెంది ప్రజల గుండెల్లో నిలిచిపోయాడు.

కామ్రేడ్ కైలాసం శ్రీకాకుళం జిల్లా పార్వతీపురం తాలూకా కొరివలస గ్రామంలో ఒక భూస్వామ్య కుటుంబంలో పుట్టాడు. 8వ తరగతి వరకూ చదివి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాడు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ ప్రజల పక్షాన నిలిచిన కామ్రేడ్ కైలాసం దున్నేవారికే భూమి నినాదంతో 1954లో తన తండ్రి, ఆయన అన్నదమ్ముల భూముల స్వాధీనానికే రైతు కూలీలను కదిలించి పోరాటం చేపట్టి రక్త సంబంధం కంటే వర్గ సంబంధం గొప్పదనే సత్యాన్ని చాటాడు.

ఆ భూములపై పోరాటం చేస్తూనే పెదమేరంగిని కేంద్రంగా

చేసుకొని రైతులకు రాజకీయాలను బోధించి, సంఘ నిర్మాణం చేశాడు. తన నాయకత్వంలో అనేక పోరాటాలు జరిగి భూస్వాముల అధీనంలోని భూములు పేద రైతుల పరం అయ్యాయి.

1955లో ఉపాధ్యాయ వృత్తిని వదిలేసి పూర్తిగా పోరుకే అంకితమయ్యాడు. 1959లో సత్యం మాస్టారు సలహాల కోసం కైలాసం దగ్గరికి వచ్చారు. అలా ఇద్దరూ మంచి స్నేహితులై చివరిదాక పోరుబాటలో కలిసే ప్రయాణించారు. సత్యం మాస్టారును ప్రజలు గురువుగా భావిస్తే, కైలాసంను పెద్ద గురువుగా భావించేవారు. ఆదివాసీ రైతాంగ సంఘానికి ఇద్దరూ అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరించారు. కామ్రేడ్ కైలాసం మాటంటే సత్యం మాస్టారికి మంచి గురి.

కామ్రేడ్ కైలాసం పార్వతీపురం,బొబ్బిలి తాలూకాల్లో పోరాట బాధ్యతలను స్వీకరించాడు. భూస్వాముల ఆస్తుల స్వాధీన పోరాటాల్లో గెరిల్లాలకూ, రైతులకూ ప్రత్యక్షంగా నాయకత్వం అందించాడు. ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా రాజీ లేని పోరాటం చేసి,నక్సల్బరీ రాజకీయాలను దృఢంగా ఎత్తిపట్టాడు. 1969లో పోలీసులు కామ్రేడ్ కైలాసంను అరెస్టు చేశారు. బాయ్‌నెట్లతో పొడిచి ఎన్ని చిత్రహింసలు పెట్టినా ఆయన పోలీసులకు తలవంచలేదు. జైలును రాజకీయ పాఠశాలగా మలిచాడు. 1969లో పోలీసుల కళ్లు గప్పి విశాఖ జైలు నుంచి తప్పించుకున్నాడు. బయటకు రాగానే తిరిగి పోరాటానికి నాయకత్వం వహించాడు. రైతాంగం మధ్య అత్యంత నిరాడంబరంగా జీవిస్తూ, వ్యక్తిగత జీవితంలోనూ ఎన్నో ఆదర్శాలను నెలకొల్పిన ఉత్తమ కమ్యూనిస్టు నేత కామ్రేడ్ కైలాసం.

1970 జూలై 10న పోలీసులతో పోరాడుతూ కామ్రేడ్ సత్యం మాస్టారితో పాటు అమరుడయ్యాడు. అమరుడయ్యేనాటికి ఆయన వయసు 45 సంవత్సరాలు.

## శ్రీకాకుళ మైదానాలను మండించిన

## కామ్రేడ్ పంచాది క్రిష్ణమూర్తి

కామ్రేడ్ పంచాది క్రిష్ణమూర్తి సత్యం, కైలాసంలతో పోల్చదగిన నాయకుడు. ఆయనది శ్రీకాకుళం జిల్లాలోని జెలమూ గ్రామం. వారిది పేద రైతు కుటుంబం. అయినప్పటికీ ఉన్నత విద్యను అభ్యసించాడు. 1956లో కమ్యూనిస్టు ఉద్యమంవైపు ఆకర్షితుడయ్యాడు. 1960లో జిల్లా యువజన సంఘానికి కార్యదర్శి అయ్యాడు. వుద్యోగం చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు వత్తిడి చేశారు. కానీ ఆయన తన జీవితాన్ని పేదప్రజలకే



అంకితం చేశాడు. మొదట సోంపేట ప్రాంతంలో ఆ తర్వాత ఉద్యమాల గడ్డ అయిన బొడ్డపాడును కేంద్రంగా చేసుకొని ఉద్దానం ప్రాంతంలో రైతాంగ ఉద్యమాన్ని నిర్మించాడు. తెగింపు సంఘాలు పెట్టి యువతీ యువకులను పోరాటోన్ముఖులను చేశాడు. కామ్రేడ్స్ సత్యం, కైలాసంలు అటవీ వుద్యమంపై కేంద్రీకరిస్తే కామ్రేడ్ పంచాది, మైదాన ఉద్యమంపై కేంద్రీకరించాడు. ఈ మైదాన ప్రాంతాల అనుభవం బెంగాల్, బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల కార్యకర్తలను ఉత్తేజ పరిచింది.

రివిజనిజంపై నిశితంగా పోరాడ్డంలోనూ, నక్సల్బరీ రాజకీయాలను ఎత్తిపట్టడంలోనూ ఆయన పాత్ర చరిత్రలో చెరిగిపోనిది. తనతో పాటు తన సహచరి నిర్మలను కూడా వుద్యమంలోకి తీసుకువచ్చి, ఆమెను ఒక రాజకీయ కార్యకర్తగా మలచడంలోనూ ఆయన పాత్ర ఆదర్శనీయమైనది.

కామ్రేడ్ చారు మజుందారును కల్సి వస్తున్న క్రిష్ణమూర్తిని మరో కామ్రేడ్‌తో పాటు 1969 మే 27న కంచిలి రైల్వేస్టేషన్‌లో పట్టుకొని క్రూరంగా కాల్చి చంపారు.

## మనువు శిరసున నర్తించిన వీరనారి

## కామ్రేడ్ పంచాది నిర్మల



శ్రీకాకుళం జిల్లా పాలకొండ తాలూకా కావలి గ్రామంలో ఒక నిరుపేద కుటుంబంలో కామ్రేడ్ నిర్మల పుట్టింది. సహచరుడు క్రిష్ణమూర్తి ప్రోత్సాహంతో రైతాంగ రాజకీయ పోరులో అడుగుపెట్టింది. బొడ్డపాడులో వుంటూ రైతాంగ మహిళలకు రాజకీయాలను బోధించేది.ఆ ప్రాంతంలోని ప్రజాకంఠకుడైన బడా భూస్వామికి వ్యతిరేకంగా మహిళలను ప్రతిఘటింపజేయడంలో ప్రముఖ పాత్ర వహించింది.

జిల్లాలో సాయుధ రైతాంగ దళాలు ఏర్పడగానే చంటి బిడ్డను చంకనేసుకొని ఆ దళాల్లో చేరింది. ఆ తర్వాత పసిబిడ్డ దళంలో వుంటే దళం ఉనికికి ప్రమాదమని గుర్తించి బిడ్డను బంధువుల వద్దకు పంపి, కన్నప్రేమను చంపుకొని వర్గ ప్రేమను చాటి చెప్పింది.


తన జీవిత సహచరుడి అమరత్వం ఆమెలో పెనుతుఫానును రేపింది. ఆ విషాదాన్ని శత్రువుపై తీవ్ర కసిగా మార్చుకొని నూతన ఉత్తేజంతో పోరాటంలో ముందుకు సాగింది. దళ నాయకురాలై వర్గ శత్రు నిర్మూలనకు కదం తొక్కింది. భూస్వాముల, పోలీసుల గుండెల్లో ప్రకంపనలు పుట్టించింది. ఆమె ప్రేరణతో ఎందరో పేదరైతు స్త్రీలు దళాల్లో చేరారు.

1969 డిసెంబర్ 22న రంగమేటియా కొండల్లో కామ్రేడ్ నిర్మలను పాణిగ్రాహి తదితర ఆరుగురి కామ్రేడ్స్‌తో పాటు పాశవికంగా కాల్చి చంపారు.

కామ్రేడ్ పాణిగ్రాహి శ్రీకాకుళపోరులో పెన్నూ, గన్నూ పట్టిన వీరయోధుడు. జముకుల కథ ద్వారా ఎన్నో వీరగాథలను ప్రజల కళ్లకు కట్టినట్టుగా వినిపించి వాళ్లను పోరాటాల్లోకి నడిపించిన సాంస్కృతిక సైనికుడు. రాష్ట్రంలోనే కాక ఒరిస్సా తదితర ఇతర ప్రాంతాల్లోనూ కళా ప్రదర్శనల ద్వారా శ్రీకాకుళ పోరాటాన్ని ప్రచారం చేసి మద్దతును కూడ గట్టాడు. అందుకే కామ్రేడ్ నిర్మల తదితరులతో పాటు ఆయనను కూడా ప్రభుత్వం హత్య చేసింది.

వీరితో పాటు చాగంటి భాస్కర రావు, దేవినేని మల్లికార్జునుడు, తామాడ గణపతి, చినబాబు, అంకమ్మ, సరస్వతి వంటి ఎందరో కామ్రేడ్స్ వీరోచితంగా పోరాడి సిక్కోలు వీరులుగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

## సిక్కోలు ఓటమి నుంచి పాఠాలు తీసి పోరును ముందుకు నడిపించిన కొండపల్లి సీతారామయ్య



శ్రీకాకుళ ఓటమి వల్ల విప్లవోద్యమం సెట్‌బ్యాక్‌కు గురైంది. ఈ సెట్‌బ్యాక్‌ను ఆసరా చేసుకొని రివిజనిజం శక్తిని పుంజుకుంది. నక్సల్బరీ పంథాపై చారుబాబు నాయకత్వంపై రివిజనిస్టులు దాడిని మొదలుపెట్టారు. ఉద్యమం ఇంకా సెట్‌బ్యాక్‌కు గురికాకుండానే అప్పటికి రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా వ్యవహరిస్తుండిన పైలా వాసుదేవరావు, కుట్రదారుడైన సత్యనారాయణ సింగ్ శిబిరంలో దొడ్డిదారిన చేరిపోయాడు. దీనితో అప్పటికి మిగిలిన ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు పార్టీ పంథాను ముందుకు తీసికెళ్లాలనీ, పోరాటాన్ని కొనసాగించాలనీ నిర్ణయించారు. ఈ ముగ్గురే ఒక కమిటీగా వ్యవహరించారు. ఈ కమిటీకి కొండపల్లి సీతారామయ్య (కె.ఎస్.) కార్యదర్శిగా ఎంపికయ్యాడు. క్రిష్ణా జిల్లాలో పుట్టిన కె.ఎస్. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో తన కార్యాచరణను మొదలుపెట్టాడు. పార్టీ చీలినపుడు ఆయన సి.పి.ఎం. పక్షం వహించాడు. ఆ తర్వాత సి.పి.ఐ., సి.పి.ఎం.ల నడుమ మౌలికమైన తేడా ఏమీ లేదని గుర్తించి తెలంగాణను కార్యక్షేత్రంగా చేసుకొని రాష్ట్రంలో సి.పి.ఐ.(ఎం.ఎల్.)కు పునాదులు వేసిన వారిలో ఒకరిగా నిలిచాడు. సంక్లిష్టమైన పరిస్థితిలో కార్యదర్శి బాధ్యతలు చేపట్టిన కె.ఎస్. పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడానికి గొప్ప కృషి చేశాడు. రివిజనిజంతో పోరాడి విచ్ఛిన్నకుల కుట్ర నుండి నక్సల్బరీ పంథాను కాపాడ్డంలో ప్రధాన పాత్ర వహించాడు. 1974లో ఆయన సారథ్యంలోనే గతాన్ని ఆత్మవిమర్శనా పూర్వకంగా సమీక్షించారు. అందులో వ్యూహం సరైనదని ఎత్తి పడుతూనే, ఎత్తుగడల పరమైన లోపాలను దిద్దుకోవాల్సిన, ప్రజాయుద్ధాన్ని, ప్రజా పంథాను సరైన మార్గంలో నడపాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఆత్మ విమర్శనా రిపోర్ట్‌గా పేరుపొందిన ఈ సమీక్ష 1980లో కేంద్ర కమిటీ అధికారిక డాక్యుమెంటు అయింది. 1976 డిసెంబర్ 29 నుండి 1977 జనవరి 1 వరకు చారిత్రాత్మక తెలంగాణా రీజనల్ కాన్ఫరెన్స్ జరిగింది. సాయుధ పోరాటాన్ని నిర్వహించడానికి ప్రజలను సంసిద్ధం చేయడం, రహస్య ప్రజా సంఘాలను నిర్మించడం, అటవీ ప్రాంతాల్లోకి విస్తరించి ఆదివాసీ ప్రజలను సంఘటిత పరచడం, రహస్యపార్టీని నిర్మించడం వంటి ముఖ్యమైన నిర్ణయాలను ఈ కాన్ఫరెన్స్ తీసుకుంది. అలా ఈ కాన్ఫరెన్స్‌లో జగిత్యాల జైత్రయాత్రకు రంగం సిద్ధమైంది. ఆ వెంటనే కె.ఎస్. కార్యదర్శిగా అయిదుగురితో కూడిన రాష్ట్ర కమిటీని కూడా ఏర్పరుచుకున్నారు. ఇంతలో దేశంలో ఎమర్జెన్సీ ఎత్తివేయబడింది. ఈ నేపథ్యంలో 1977 ఆగస్ట్‌లో రాష్ట్రకమిటీ సమావేశమైంది. సాయుధ పోరాటాన్ని తీవ్రతరం చేయడానికై ప్రజా పునాదిని బలోపేతం చేసుకోవాలని, అందుకు తాత్కాలికంగా సాయుధ పోరాటాన్ని విరమించాలని, ఈ సమావేశంలో తీర్మానం చేశారు. ఆగస్ట్ తీర్మానంగా ప్రసిద్ధి పొందిన ఈ తీర్మానం కొందరు గిట్టని వాళ్లు ప్రచారం చేసినట్టుగా వాస్తవ పోరాట విరమణ కాదనీ, సాయుధ పోరాటాన్ని పురోగమింప చేయడానికి తీసుకున్న ఎత్తుగడ అని ఆ తర్వాతి చరిత్ర నిరూపించింది. కేంద్ర ఆర్గనైజింగ్ కమిటీ నిష్క్రియాపరంగా వున్న సమయంలో రాష్ట్రంలో సాధించిన ఈ పురోగమనాన్ని ముందడుగు విశేషంగా చెప్పుకోవాల్సిన విషయం. 1980లో కేంద్ర కమిటీని పునరుద్ధరించడంలో కూడా రాష్ట్ర కమిటీ కృషి ప్రధానమైనది.

సాధించిన ఈ విజయాలు, ఈ కృషి అంతటిలోనూ కె.ఎస్. పాత్ర విశేషంగా ఎన్నదగినది.

సి.పి.ఐ.(ఎం.ఎల్.) ముక్కలు చెక్కలై అతివాద, మితవాద, అవకాశవాదాలు చోటుచేసుకున్న కాలంలో భారతదేశ విప్లవోద్యమానికి నాయకత్వం వహించడానికిగాను నక్సల్బరీ పంథాను, చారు వారసత్వాన్ని కొనసాగించడం కోసం సి.పి.ఐ.(ఎం.ఎల్.) (పీపుల్స్‌వార్)ను స్థాపించి కేంద్రకమిటీ కార్యదర్శి అయ్యాడు. మిగతా రాష్ట్ర ఉద్యమాలను సంలీనం చేయడానికి కృషిచేశాడు. పార్టీయూనిటీ, ఎం.సి.సి.లతో ఐక్యతకు కృషి చేశాడు. ప్రజాసంఘాలు అవసరం లేదనే అతివాద పంథాను సవరించడంలోనూ, రాష్ట్రంలో బలమైన ప్రజాసంఘాలను నిర్మించడంలోనూ ఆయన పాత్ర ముఖ్యమైనది. పార్టీని సైద్ధాంతికంగా, రాజకీయంగా, ఆర్గనైజేషనల్‌గా పటిష్టపరచడానికి విశేషమైన కృషి చేశాడు. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసికెళ్లడానికి అవసరమైన సైద్ధాంతిక జ్ఞానాన్ని అందించడం కోసం వ్యవసాయ విప్లవం అనే సైద్ధాంతిక రచనను చేశాడు. జగిత్యాల వుద్యమాన్ని గెరిల్లాజోన్ ఉద్యమంగా అభివృద్ధి చేయడానికి పథక రచన చేశాడు. సత్యమూర్తి వంటి అవకాశవాదులు లేవనెత్తిన సంక్షోభం నుండి పార్టీని బయటపడవేశాడు.

రాజకీయాలను బోధించి ఎందరో కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దడంలో ప్రధాన పాత్ర పోషించాడు.

అయితే భారత విప్లవోద్యమంలో విశేష కృషి చేసిన కె.ఎస్. చివరివరకూ అదే ఒరవడిలో తన పాత్రను కొనసాగించలేకపోయాడు. పార్కిన్‌సన్స్ వ్యాధికి గురయ్యాడు. చివరిదశలో బండయ్య వంటి కుట్రదారులతో చేతులు కల్పి పార్టీని చీల్చడానికి ప్రయత్నించి పార్టీ చేత బహిష్కరించబడ్డాడు. భారత విప్లవోద్యమంలో సుదీర్ఘకాలం పాటు కీలకపాత్ర వహించి, చివరి దశలో ఇంతగా దిగజారడం ఒక పెద్ద విషాదం. అందుకే కె.ఎస్.ను సి.పి.ఐ.(మావోయిస్టు) అమరుడుగా గుర్తించడం లేదు.

కామ్రేడ్ అప్పలసూరి 1978లో పార్టీకి రాజీనామా చేసి వెళ్లినప్పటికీ శ్రీకాకుళం జిల్లాలో స్వతంత్రంగా గ్రామీణ పేదల సంఘాన్ని ఏర్పరిచి ఉద్యమాన్ని కొనసాగించాడు. రైతాంగంలోనూ, కార్మికుల్లోనూ పనిచేసి సి.పి.ఐ.(ఎం.ఎల్.) (పార్టీయూనిటీ) సంబంధాల్లోకి వెళ్లి కేంద్ర కమిటీ సభ్యుడయ్యాడు. 1998లో పీపుల్స్‌వార్, పార్టీ యూనిటీలు విలీనమై ఐక్య పార్టీగా ఏర్పడ్డాయి. ఆ తర్వాత కొద్ది కాలానికి కామ్రేడ్ అప్పలసూరి అస్వస్థతతో అమరుడయ్యాడు.

## ప్రజాయుద్ధ రాజకీయాలతో భావాలను పదునెక్కించిన కామ్రేడ్ ఐ.వి. సాంబశివరావు (ప్రకాష్ మాస్టర్)



ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమం చరిత్రకు అందించిన అద్భుతమైన ఆణిముత్యం కామ్రేడ్ ప్రకాష్ మాస్టర్ (ఐ.వి. సాంబశివరావు). కామ్రేడ్ ప్రకాష్ మాస్టర్ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు. పార్టీకి విశేషమైన సేవలు అందించిన కార్మికవర్గ మేధావి.

ఆయన శ్రీకాకుళం జిల్లా పిరిడి గ్రామంలో 1937 ఫిబ్రవరి 11న పుట్టారు. విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ నుండి రాజకీయ శాస్త్ర పట్టభద్రులై కొంత కాలంపాటు ఢిల్లీ, హైద్రాబాద్‌లలో పరిశోధక విభాగాలలో పనిచేశారు. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల ప్రభావంతో ఉత్తేజితులై విరసం ఏర్పాటుకు చురుకైన పాత్ర వహించారు.

విజయవాడ లయోలా కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తూ 1974లో విరసంకు క్రియాశీలక కార్యదర్శిగా పనిచేశారు. 1974 నవంబర్‌లో వృత్తి విప్లవకారుడిగా మారి రహస్య జీవితాన్ని ప్రారంభించారు. నాటి నుండి క్యాన్సర్ వ్యాధితో అమరత్వం చెందే వరకూ తన ఆనుపానులు శత్రువుకు చిక్కనివ్వలేదు.

నక్సల్బరీ, శ్రీకాకుళాలు దెబ్బతిన్న తర్వాత తిరిగి నక్సల్బరీ పంథాలో ప్రజలను సన్నద్ధులను చేయడానికి కృషి చేసిన అతి కొద్దిమందిలో ఆయన ఒకరు. దేశ వ్యాప్తంగా చెల్లాచెదురైన విప్లవ శక్తులను సమీకరించడంలో కె.ఎస్.కు ఎదురైన భాషా సమస్యను తీర్చడానికి కామ్రేడ్ ప్రకాష్ మాస్టర్ అనువాదకులుగా పనిచేశారు. 1976లో సి.ఒ.సి. దెబ్బతిన్న తర్వాత మిగితా రాష్ట్రాలతో సంబంధాలను సమన్వయించడంలో కామ్రేడ్ ప్రకాష్ మాస్టర్ కృషి గొప్పది. తెలంగాణా రీజనల్ కాన్ఫరెన్స్‌ను విజయవంతం చేసిన నాయకులలో ఆయన ఒకరు. అదే సంవత్సరం అయిదుగురితో ఏర్పడిన రాష్ట్ర కమిటీలో ఆయన సభ్యులయ్యారు. 1977-78 కాలంలో ఆయన చేసిన కృషి చాలా గొప్పది. అప్పటికి నాయకులుగా వున్న కె.ఎస్., సత్యమూర్తిలు జైల్లో వుండడం వల్ల సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమించాలనే తీర్మానాన్ని రాష్ట్రంలోని అన్ని మూలలకూ తీసికెళ్లి పార్టీ శ్రేణులకు అర్థం చేయించడంలో ఎనలేని కృషి చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కరీంనగర్,

ఆదిలాబాద్ పోరాటాల్లో చురుకైన పాత్ర వహించారు. గెరిల్లా జోన్ పర్‌స్పెక్టివ్‌ను అమలు చేయడంలో తన వంతు పాత్రను నిర్వర్తించారు. తమిళనాడు పార్టీతో జరిగిన చర్చల్లో కె.ఎస్.తో పాటు పాల్గొని 1980లో పీపుల్స్‌వార్‌ను స్థాపించడంలో ఆయన పాత్ర ప్రముఖమైంది. పీపుల్స్‌వార్ మొదటి కేంద్ర కమిటీలోకి ఎన్నికయ్యారు. 1991లో కె.ఎస్. తదితరులు సంక్షోభం సృష్టించినపుడు కె.ఎస్.తో వున్న దీర్ఘకాలిక సాన్నిహిత్యాన్ని వదులుకొని పార్టీ వైపు దృఢంగా నిలబడ్డారు.

ఎమర్జెన్సీ చీకటిరోజుల్లో ప్రజలకు రాజకీయాలను అందించడం కోసం 'ఎర్రజెండా'ను నడిపి విశేషమైన కృషి చేశారు. 1992 నుండి అమరత్వం వరకూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ అధికార పత్రిక 'క్రాంతి'ని, సిద్ధాంత పత్రిక 'ఎర్రజెండా'ను నడపడంలో ప్రముఖ పాత్ర వహించారు. కేంద్రకమిటీ అధికార పత్రిక వ్యాన్‌గార్డ్ సంపాదకవర్గంలోనూ పనిచేశారు. కామ్రేడ్ ప్రకాష్ మాస్టర్ గొప్ప అనువాదకులు. 1994లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి వర్గంలోకి ఎన్నికయ్యారు. 1995లో జరిగిన అఖిల భారత ప్రత్యేక మహాసభలో కేంద్రకమిటీకి మొదటి ప్రత్యామ్నాయ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఇంకా మరెన్నో విధాలుగా పార్టీకి తన సేవలనందించిన కామ్రేడ్ ప్రకాష్ మాస్టర్ తీవ్ర అనారోగ్యంతో 1997 ఫిబ్రవరి 28న అమరులయ్యారు.

## జగిత్యాల జైత్రయాత్ర చరిత్రకిచ్చిన అమూల్య కానుక

## కామ్రేడ్ నల్లా ఆదిరెడ్డి (శ్యాం)



1984 నుండి రాష్ట్ర వుద్యమానికి కామ్రేడ్ శ్యాం (నల్లా ఆదిరెడ్డి) సారథ్యం వహించాడు. కామ్రేడ్ శ్యాం(45) జగిత్యాల జైత్రయాత్ర నుండి ఎగిసిన పోరుకెరటం. జగిత్యాలకు జన్మనిచ్చిన కరీంనగర్ జిల్లాలోని కొత్తగట్టు గ్రామంలో ఆయన పుట్టాడు. నక్సల్బరీ, శ్రీకాకుళాల ప్రేరణతో విప్లవాల బాట పట్టిన విద్యార్థుల్లో ఆయన ఒకరు. 1974-75లో రాడికల్ విద్యార్థి సంఘం (ఆర్.ఎస్.యు.)లో భాగమయ్యాడు. క్రమంగా కరీంనగర్ విద్యార్థి శక్తిగా ఎదిగాడు. ఎమర్జెన్సీ కాలంలో డిగ్రీ చదువును మధ్యలోనే వదిలేసి పూర్తికాలం కార్యకర్తగా రహస్య జీవితంలోకి వచ్చాడు. కరీంనగర్- ఆదిలాబాద్ జిల్లాల్లో పనిచేసి జగిత్యాల జైత్రయాత్రకు దారులు వేసినవారిలో ఒకరిగా నిలిచాడు.

రివిజనిస్టు రాజకీయాలను ఎండగట్టి ఉద్యమాన్ని ముందుకు తీస్కెళ్లడానికి కృషి చేశాడు. అలాగే ఆనాడు ప్రజాసంఘాలు అవసరం లేదనే అతివాద పంథాను వ్యతిరేకించి ప్రజాసంఘాలను నిర్మించే కృషిలో చురుగ్గా పాల్గొన్నాడు. విద్యార్థి, రైతాంగ పోరాటాల్లో, నిర్మాణంలో విశేషమైన అనుభవాన్ని గడించిన ఆయన సింగరేణి ఉద్యమానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించి కార్మికరంగంలోనూ విశేషమైన కృషి చేశాడు.

1978లో కరీంనగర్-ఆదిలాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శి అయ్యాడు. ఈ రెండు జిల్లాలు విడిపోయిన తర్వాత ఆదిలాబాద్ మొదటి జిల్లా కమిటీకి కార్యదర్శి అయ్యాడు. 1980లో రాష్ట్ర కమిటీ సభ్యుడై, 1984లో రాష్ట్ర కమిటీ కార్యదర్శి అయ్యాడు. 1984 నాటికి ఉద్యమం గణనీయంగా అభివృద్ధి చెందింది. గెరిల్లా జోన్స్ నిర్మాణ సన్నాహక కృషిని సమీక్షించి, నూతన కర్తవ్యాలను ఎంచుకోవాల్సిన సమయంలో, ఉద్యమ స్థాయికి అనుగుణంగా నాయకత్వం అభివృద్ధి కావాల్సిన అవసరాన్ని గుర్తించి కామ్రేడ్ శ్యాం అందుకు తీవ్రంగా కృషి చేశాడు. పరిస్థితులకు అనుగుణంగా తాను ఎదిగి ఉద్యమాన్ని ఎదిగించాడు. అలా అభివృద్ధి చెంది 90లో కేంద్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడయ్యాడు.

పార్టీ ఎదుర్కొన్న రెండు సంక్షోభాలనూ ఓడించి పార్టీని నిలబెట్టడానికి విశేషమైన కృషి చేసిన ముఖ్యుల్లో కామ్రేడ్ శ్యాం ఒకరు. కె.ఎస్. పార్టీ నుండి బహిష్కృతుడైన తర్వాత కొత్తతరం నాయకత్వం త్వరలోనే చేతులెత్తేస్తుందనే ఎద్దేవాను తిప్పికొడుతూ సైద్ధాంతికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందిన నాయకత్వ టీంలో కామ్రేడ్ శ్యాం ఒకరు. 1995లో జరిగిన అఖిల భారత ప్రత్యేక కాన్ఫరెన్స్‌లో కేంద్ర కమిటీకి ఎన్నికయి కార్యదర్శివర్గంలో సభ్యుడయ్యాడు.

90వ దశకం మధ్యకాలంలో వివిధ పోస్టు మాడర్న్ ధోరణులు, అస్తిత్వ ఉద్యమాలు తలెత్తి మార్క్సిజానికి కాలం చెల్లిపోయిందనీ, మార్క్సిజంలో ఖాళీలు వున్నాయనీ, మహిళా, కుల సమస్యలను విప్లవోద్యమం పట్టించుకోలేదనే వాదనలు బయలు దేరాయి. ఈ వాదనలను తిప్పికొట్టి మార్క్సిజాన్ని ఎత్తిపడుతూ కామ్రేడ్ శ్యాం రచనలు చేశాడు. ప్రత్యేక తెలంగాణా సమస్యను అధ్యయనం చేసి అవసరమైన ఎత్తుగడలను రూపొందించడానికి కేంద్ర కమిటీ ఏర్పరిచిన టీంకు నేతృత్వం వహించాడు. 98లో ఉదారవాద మేధావులతో కామ్రేడ్ మహేష్‌తో కల్సి చర్చలు జరిపి వారి అవగాహనలోని లోపాలను ఎత్తి చూపాడు. అదే సమయంలో

వుద్యమం నుండి జరుగుతున్న లోపాలను అంగీకరించి సరిదిద్దుకుంటామని వారికి హామీనిచ్చాడు. జరుగుతున్న తప్పులను పార్టీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లడానికి ఆ వెంటనే ఒక సర్క్యులర్ రూపొందించాడు.


ఉత్తర తెలంగాణా ఉద్యమాన్ని గెరిల్లాజోన్ ఉద్యమంగా ఎదిగించడంలో కామ్రేడ్ శ్యాం పాత్ర కీలకమైనది. 94లో ఎ.పి. నుండి ఉత్తర తెలంగాణ విడివడి ఉన్నతమైన గెరిల్లా జోన్ వుద్యమంగా రూపొందిన తర్వాత కేంద్ర కమిటీ సెక్రటేరియట్ సభ్యుడిగా కొంతకాలం పాటు ఎన్.టి. వుద్యమానికీ, మరి కొంతకాలం పాటు ఎ.పి. ఉద్యమానికీ మార్గదర్శకత్వం అందించాడు.

ఆనాడు రాష్ట్రాన్ని చంద్రబాబు ప్రపంచబ్యాంకు సంస్కరణలకు ప్రయోగశాలగా మార్చినప్పుడు దానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలను ఉద్యమింప జేయడంలో తన పాత్ర ముఖ్యమైనది.

1986లో కామ్రేడ్ శ్యాం శత్రువేత చిక్కి జైలు పాలయ్యాడు. రెండేళ్ల జైలు జీవితం తర్వాత వీరోచితంగా ప్రతిఘటించి జైలు నుండి తప్పించుకుని ఉద్యమంలో భాగమయ్యాడు.

ఇటువంటి విలువైన కామ్రేడ్‌ను నాటి చంద్రబాబు సర్కార్ నీచమైన కోవర్టు కుట్ర పన్ని, బెంగుళూరులో కామ్రేడ్స్ మహేష్, మురళిలతో పాటు పట్టుకొని వారితో పాటే 1999 డిసెంబర్ 2న కరీంనగర్ జిల్లా కొయ్యూరు అడవుల్లో కాల్చి చంపింది.

## అప్రకటిత యుద్ధాన్ని ప్రజా యుద్ధంతో ఓడించిన కామ్రేడ్ పులి అంజన్న (సాగర్)



కామ్రేడ్ సాగర్ (పులి అంజన్న) కామ్రేడ్ శ్యాం తర్వాత రాష్ట్ర ఉద్యమానికి నేతృత్వం వహించాడు. వీర తెలంగాణా పోరు కేంద్రమైన నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం కొండప్రోలు గ్రామంలోని మధ్యతరగతి కుటుంబంలో, 1956లో కామ్రేడ్ అంజన్న పుట్టాడు. ఎమర్జెన్సీ చీకటి కాలంలోనే ఆయనకు వెలుగుబాట పరిచయమయింది. ఆ కాలంలో డిగ్రీ (బి.కాం.) చదువుతున్న ఆయన ఆర్.ఎస్.యు.లో భాగమయ్యాడు. 1978లో కాకతీయ యూనివర్శిటీలో ఎం.కాం.లో చేరి విద్యార్థి నాయకుడై వరంగల్ నగర ఉద్యమంలో కీలకమైన పాత్ర వహించాడు. నక్సల్బరీ కాలంలో కలకత్తా ఉద్యమాలకు ఎంతలా ప్రసిద్ధి చెందిందో ఆ తర్వాత కాలంలో వరంగల్ నగరం ఉద్యమాలకు అంతలా ప్రసిద్ధి గాంచింది. వరంగల్‌ను అలా తీర్చిదిద్దడంలో కామ్రేడ్ సాగర్ పాత్ర ముఖ్యమైనది. వరంగల్ నగరంలో విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేసి జిల్లా రైతాంగ ఉద్యమానికి కావాల్సిన పునాదులు వేశారు. 1981లో వరంగల్ జిల్లా కమిటీ కార్యదర్శి బాధ్యతలు స్వీకరించాడు. ఆనాడు రాష్ట్ర కమిటీ నాయకుడిగా వున్న సత్యమూర్తి జిల్లా వుద్యమాన్ని రిట్రీట్ చేయడానికి చేసిన ప్రయత్నాలను ఎదిరించి జిల్లా ఉద్యమాన్ని ముందుకు నడిపించాడు. క్యాడర్ ఆత్మవిశ్వాసాన్ని నిలబెట్టాడు.

1985లో ఉత్తర తెలంగాణా రీజనల్ కమిటీ సభ్యుడయ్యాడు. అదే సమయంలో ఉత్తర తెలంగాణాపై నిర్బంధం తీవ్రమైంది. కేంద్ర, రాష్ట్ర కమిటీలు ఆ నిర్బంధాన్ని ఎదుర్కోవడానికి తీవ్రంగా కృషి చేయవల్సి ఉన్న సమయంలో సత్యమూర్తి, వీరాస్వాములు పార్టీలో సంక్షోభం సృష్టించారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడంలో ఎన్.టి. రీజనల్ కమిటీ ప్రధాన పాత్ర వహించింది. ఎన్.టి. కమిటీ సభ్యుడిగా అంజన్న పాత్ర కీలకమైనది.

1984లో ప్రభుత్వం తలపెట్టిన అప్రకటిత యుద్ధాన్ని ఓడించడానికి తగిన ఎత్తుగడలను రూపొందించడంలో ఆయన తన పాత్రను చక్కగా నిర్వర్తించాడు. 1987లో జరిగిన 13వ రాష్ట్ర మహాసభలో కామ్రేడ్ సాగర్ రాష్ట్ర కమిటీ సభ్యుడయ్యాడు. 1991 నుండి బి.ఎస్.ఎఫ్., ఐ.టి.బి.పి., సి.ఐ.ఎస్.ఎఫ్. పారామిలటరీ బలగాలు తెలంగాణా పల్లెల్లో కవాతు చేశాయి. అనేక మందిని కాల్చి చంపి నెత్తుటేరులను పారించాయి. ఆ సమయంలో నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూనే ఉద్యమాన్ని విస్తరింప చేయడం కోసం, కొన్ని శక్తులను ఇతర పోరాట ప్రాంతాలకు పంపే ఎత్తుగడలను రూపొందించడంలో ముఖ్యపాత్ర వహించాడు. అలా తీవ్ర నిర్బంధం నడుమ పార్టీ పట్ల ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో కీలకపాత్ర వహించాడు. 1993లో కామ్రేడ్ శ్యాం స్థానంలో కామ్రేడ్ సాగర్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి అయ్యాడు. ఆ సమయంలో నిర్బంధాన్ని తిప్పికొట్టి ఉత్తర తెలంగాణాను గెరిల్లా జోన్‌గా అభివృద్ధి చేయడంలో ప్రముఖ పాత్ర వహించాడు. క్యాడర్ సాగర్ ఉద్యమ భవిష్యత్ పట్ల సరైన అంచనా, దీర్ఘకాలిక దృష్టిని కల్గి వుండి ఉద్యమాభివృద్ధిలో కీలకమైన పాత్రను పోషించాడు.

కామ్రేడ్ సాగర్‌ను బెంగుళూరులో తన సహచరి భాగ్యలక్ష్మితో పాటు పట్టుకొని, 1993 అక్టోబర్ 26న వరంగల్ జిల్లా ధర్మసాగరం మండలం మద్దెలగూడెం వద్ద కాల్చి చంపారు.

## దొడ్డి కొమురయ్య ఒడిపిన రక్తాన్ని దోసిళ్లకెత్తుకొని

## పోరు విత్తనాలుగ జల్లిన

## కామ్రేడ్ ఎర్రంరెడ్డి సంతోష్ రెడ్డి (మహేష్)



కామ్రేడ్ అంజన్న అమరుడైన తర్వాత ఆంధ్ర రాష్ట్ర కమిటీకి తాత్కాలికంగా కామ్రేడ్ శ్యాం బాధ్యతలు వహించాడు. 1995లో రాష్ట్ర 14వ మహాసభలు జరిగాయి. ఈ మహాసభలో ఎన్.టి.ని గెరిల్లాజోన్‌గా ప్రకటించాలనే చారిత్రాత్మక నిర్ణయం జరిగింది. అలా ఎన్.టి. ఉద్యమం విడిపోయాక ఏర్పడిన ఎ.పి. రాష్ట్ర కమిటీకి కామ్రేడ్ మహేష్ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు.

వీర తెలంగాణా పోరుకు తొలి నెత్తుటిని చిందించిన కామ్రేడ్ దొడ్డి కొమురయ్య పుట్టిన వరంగల్ జిల్లా కడవెండి గ్రామంలో 1960 జూలై 17న కామ్రేడ్ మహేష్ (ఎర్రంరెడ్డి సంతోష్ రెడ్డి) ఒక ధనిక రైతు కుటుంబంలో పుట్టాడు. పోరు వారసత్వాన్ని నిలుపుకున్న ఆ గ్రామం మలి తెలంగాణా పోరుకు తిరిగి స్పందించింది. పుల్లారెడ్డి తదితరుల మితవాద రాజకీయాలను వ్యతిరేకించి గ్రామంలో పీపుల్స్‌వార్ రాజకీయాలను వ్యాపింపజేసిన తొలితరంలో కామ్రేడ్ మహేష్ ఒకరు. వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బి.ఎస్సీ చదువుతూ గ్రామ రాజకీయాల్లో భాగమయ్యాడు. డిగ్రీ పూర్తయ్యాక ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఎస్సీ.(టెక్)లో చేరాడు. అప్పటికి ఆయన లక్ష్యం శాస్త్రవేత్త కావాలనేది. కానీ సమాజం పట్ల పెరిగిన శాస్త్రీయ దృక్పథం, ఆయనను నాలుగు గోడల మధ్య ప్రయోగాలు చేసుకునే శాస్త్రవేత్తను కానివ్వకుండా సమాజాన్ని మార్చే ప్రయోగంలో భాగం చేసింది. విద్యార్థి నాయకుడై జంట నగరాల విద్యార్థి వుద్యమంలో కీలకపాత్ర వహించాడు. 1981లో ఏర్పడిన మొదటి జంట నగరాల కమిటీలో సభ్యుడయ్యాడు. 1984లో గ్రామీణ ప్రాంత ఉద్యమ నిర్మాణం కోసం ఖమ్మం జిల్లా బాధ్యుడిగా వెళ్లాడు. ఖమ్మం అటవీ ప్రాంతాన్ని సర్వే చేసి అక్కడ ఉద్యమానికి పునాదులు వేశాడు. 1985లో అరెస్టయి అయిదున్నరేళ్లు వంటరిఖైదులో మగ్గాడు. జైలును రాజకీయ పాఠశాలగా మలిచి తను రాజకీయంగా అభివృద్ధి చెంది, మిగితా కామ్రేడ్స్ అభివృద్ధికి కృషి చేసి మరింత పరిపక్వత చెందిన నాయకుడిగా 1990లో విడుదలయ్యాడు. తిరిగి ఖమ్మం జిల్లా చేరుకొని, 1991లో ఏర్పడిన మొదటి ఉత్తర తెలంగాణా ఫారెస్ట్ డివిజనల్ కమిటీకి కార్యదర్శి అయ్యాడు. రీజనల్ కమిటీలోనూ సభ్యుడయ్యాడు. 1992 చివరిలో రాష్ట్ర కమిటీ సభ్యుడయ్యాడు. దక్షిణ తెలంగాణాలో జరిగిన నాయకత్వ నష్టాల రీత్యా 1993లో దక్షిణ తెలంగాణా రీజనల్ కమిటీ బాధ్యతలను స్వీకరించి ఉద్యమాభివృద్ధికి కృషి చేశాడు. 1995లో జరిగిన 14వ రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కమిటీ కార్యదర్శి అయ్యాడు. అదే సంవత్సరం జరిగిన అఖిల భారత ప్రత్యేక కాన్ఫరెన్స్‌లో కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

1997లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రపంచబ్యాంకుకు ప్రయోగశాలగా చేశాడు. విజన్ 2020 పేరుతో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేయడానికి పూనుకున్నాడు. ఈ విధానాలను ప్రజలకు అర్థం చేయించడానికి రాష్ట్ర కమిటీ చేపట్టిన కార్యక్రమాలకు కామ్రేడ్ మహేష్ నాయకత్వం వహించాడు. పార్టీలో పెరుగుతున్న కార్మిక వర్గేతర ధోరణులను పారదోలడం కోసం 1999లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన దిద్దుబాటు ఉద్యమానికి నాయకత్వం వహించి పార్టీకి విలువైన అనుభవాన్నిచ్చాడు. ప్రజా సంఘాలను బలోపేతం చేయడానికి అవి ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి తీవ్రమైన కృషి చేశాడు. పౌరహక్కుల ఉద్యమం పరిధి, నిబద్ధత, నిమగ్నతలపై మొత్తం పార్టీకి ఒక స్పష్టతనిచ్చాడు. ఉదారవాద మేధావుల కుహనా మార్క్సిస్టు ముసుగును చించి, వారి తప్పుడు అభిప్రాయాలను ఓడించడానికి చేసిన సైద్ధాంతిక కృషిలో తన పాత్ర ప్రధానమైంది.

ప్రభుత్వం పన్నిన కోవర్టు కుట్రలో 1999 డిసెంబర్2న కామ్రేడ్స్ శ్యాం, మురళిలతో పాటు బలయ్యాడు.

## కత్తుల వంతెనపై కాలాన్ని నడిపించిన కామ్రేడ్ శీలం నరేష్ (మురళి)



1995లో 14వ రాష్ట్ర కాన్ఫరెన్స్ నిర్ణయం మేరకు ప్రత్యేక జోనల్ వుద్యమంగా ఏర్పడి ముందుకు పోతున్న ఎన్.టి. ఉద్యమానికి 1997లో కామ్రేడ్ మురళి (శీలం నరేష్) కార్యదర్శి అయ్యాడు. కామ్రేడ్ మురళి (39) కరీంనగర్ జిల్లా జగిత్యాల పట్టణంలో పుట్టాడు. సిరిసిల్లాలో పాలిటెక్నిక్ చదువుతూ ఆర్.ఎస్.యు.లో భాగమయ్యాడు.


1982లో వృత్తి విప్లవకారుడయ్యాడు. 1984లో నిజామాబాద్ జిల్లా కమిటీ సభ్యుడయ్యాడు. 1985 నుండి మొదలైన నిర్బంధ

కేంపెయిన్‌లో పోలీసు, పారా మిలటరీ మోహరింపులు, ఎన్‌కౌంటర్లు, దాడుల నడుమ చాకచక్యంగా తాను ప్రతిఘటిస్తూ తోటి కామ్రేడ్స్‌ను ప్రతిఘటింప జేస్తూ అనుభవజ్ఞుడైన సేనానిగా ఎదిగాడు. నిత్య నిర్బంధంలోనే ప్రజలను పార్టీ వెనుక సమీకృతులను చేసి అనేక పోరాటాలకు నాయకత్వం వహించాడు. 1987లో జిల్లా కార్యదర్శిగానూ, రీజనల్ కమిటీ సభ్యుడిగానూ ఎంపికయ్యాడు. తన ప్రత్యక్ష మార్గదర్శకత్వంలో నిజామాబాద్ ఉద్యమం పున్నతంగా అభివృద్ధి చెందింది. ఆ తర్వాత కరీంనగర్ జిల్లా కమిటీ కార్యదర్శిగా బాధ్యత వహించాడు. 1989లో ఉత్తర తెలంగాణా రీజనల్ కమిటీ కార్యదర్శి అయ్యాడు. ఈ కాలంలో శత్రు దాడులను తిప్పికొట్టడానికి కామ్రేడ్ మురళి చూపిన చొరవ ప్రత్యేకంగా చెప్పుకోదగినది. 90 నాటి వెసులుబాటు కాలంలో అనేక పోరాటాలకు నాయకత్వం వహించాడు. ఉవ్వెత్తున ఎగిసిన ప్రజా ప్రభంజనాన్ని ప్రభుత్వ వ్యతిరేక పోరాట దిశగా మలచడంలో తను ముఖ్యమైన పాత్ర వహించాడు.

1990లో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్లీనంలో కామ్రేడ్ మురళి రాష్ట్ర కమిటీలోకి ఎన్నికయ్యాడు. రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉత్తర తెలంగాణా పోరాట అనుభవాల వెలుగులో మిగతా ప్రాంతాల్లో వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయడానికి తగిన నిర్ణయాలు చేయడంలో మంచి పాత్రను పోషించాడు. తాను రీజనల్ కమిటీ కార్యదర్శిగా వున్న 1989-95 కాలంలో రెండవ అప్రకటిత యుద్ధం నడుమనే ఉద్యమం నిలదొక్కుకుని నష్టాలను పూరించుకొని బలంగా ముందుకు సాగి గెరిల్లా జోన్ స్థాయికి ఎదిగింది. 1995లో జరిగిన అఖిల భారత ప్రత్యేక కాన్ఫరెన్స్‌లో ప్రత్యామ్నాయ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 1997లో ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీకి కార్యదర్శి అయ్యాడు. అదే సంవత్సరం పూర్తికాలం కేంద్రకమిటీ సభ్యుడూ అయ్యాడు. 1990-96 కాలంలో తీవ్రమైన బీభత్సం నడుమనే ఉద్యమం అభివృద్ధి కావడంతో దిక్కుతోచని శత్రువు ఓటమిని అంగీకరించక మరో దాడికి సిద్ధం అయ్యాడు. ఈ కాలంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదవిని చేజిక్కించుకున్నాడు. నిర్బంధాన్ని మరింత తీవ్రం చేశాడు. ఈ నిర్బంధం మధ్యలో వుద్యమాన్ని నిలబెట్టడానికి కామ్రేడ్ మురళి తీవ్రంగా కృషి చేశాడు. జోన్‌లో కొనసాగుతున్న మిలటరీ లోపాలను సమీక్షించి ఆ లోపాలనుండి బయట పడవేయడానికి కృషి చేశాడు. నిర్బంధాన్ని ఓడించి ఉద్యమాన్ని ముందుకు నడిపించడానికి పథకాలు వేశాడు.

1999 డిసెంబర్ 2న కామ్రేడ్స్ శ్యాం, మహేష్‌లతో పాటు కామ్రేడ్ మురళి కోవర్ట్ కుట్రకు బలైపోయాడు.

## ప్రజా యుద్ధం తీర్చిదిద్దిన యుద్ధ సేనాని కామ్రేడ్ వడ్కాపూర్ చంద్రమౌళి (బి.కె.)



2000 చివర్లో జరిగిన రాష్ట్ర 15వ మహాసభ తీర్మానం మేరకు ఈస్ట్ డివిజన్, శ్రీకాకుళంలు కల్సి ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు (ఎ.ఒ.బి.) ప్రత్యేక జోన్ ఏర్పడింది. ఈ జోనల్ కమిటీకి కామ్రేడ్ బి.కె. (వడ్కాపూర్ చంద్రమౌళి) ప్రథమ కార్యదర్శి అయ్యాడు.

కామ్రేడ్ బి.కె. (44) కరీంనగర్ జిల్లా వడ్కాపూర్ గ్రామంలో ఒక మధ్య తరగతి కుటుంబంలో 1963లో పుట్టాడు. 1981 నాటికి ఇంటర్మీడియట్ చదువుతూ రాడికల్ విద్యార్థి పోరాటాల్లో భాగమయ్యాడు. 1982లో వృత్తి విప్లవకారుడయి పెద్దపల్లి ప్రాంతంలో ఆర్గనైజర్‌గా పనిచేశాడు. 1985లో అప్పటికి దండకారణ్యంలో భాగంగా వున్న ఈస్ట్ డివిజన్‌కు బదిలీ అయ్యాడు. డివిజన్ కమిటీ సభ్యుడిగా అక్కడి ఆదివాసీలను విప్లవోన్ముఖులను చేయడంలో కీలక పాత్ర వహించాడు. ఆదివాసీలు చైతన్యవంతం కావడం సహించలేని నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు దళాల మీద, ప్రజల మీద తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించాడు. పోలీసులు వందకు పైగా గ్రామాలను తగుల బెట్టారు. దళాల మీద విచ్చలవిడిగా ఎన్‌కౌంటర్లకు పాల్పడ్డారు. ప్రజలను అరెస్టు చేయడం, మహిళలను అత్యాచారాలు చేయడం నిత్యకృత్యమైపోయింది. ఈ నిర్బంధాన్ని ఎదిరించి ప్రజలను పోరాటాల వైపు నిలబెట్టడానికి కామ్రేడ్ బి.కె. తీవ్రమైన కృషిచేశాడు. ఆదివాసేతరుల, ఫారెస్ట్ అధికారుల దోపిడీకీ, పోలీసుల నిర్బంధానికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలకు న్యాయకత్వం వహించి ఆదివాసీల జీవితాలతో పెనవేసుకుపోయాడు. అలా ప్రజల విశ్వాసాన్ని చూరగొని 1987లో డివిజన్ కార్యదర్శి అయ్యాడు.

డివిజన్‌లో రివిజనిస్టుల ప్రభావం బాగా వుండేది. రివిజనిస్టు రాజకీయాల రంగును బయటపెట్టడంలో ప్రముఖ పాత్ర వహించాడు. 1993లో దండకారణ్యం ఫారెస్ట్ కమిటీకి ప్రత్యామ్నాయ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 1995లో ఈస్ట్ డివిజన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ పరిధిలోకి వచ్చిన తర్వాత కామ్రేడ్ బి.కె. రాష్ట్ర కమిటీ సభ్యుడయ్యాడు. అదే సమయంలో ఈస్ట్, శ్రీకాకుళంలను కలిపి

ఏర్పాటు చేసిన రీజనల్ కమిటీకి కార్యదర్శిగా పనిచేశాడు. 2001లో ఎ.ఒ.బి.జోన్‌కు కార్యదర్శి అవడంతోపాటు, అదే సంవత్సరం జరిగిన 9వ కాంగ్రెస్‌లో కేంద్ర కమిటీ సభ్యుడయ్యాడు.

ఆర్గనైజేషనల్‌గా చురుకైన పాత్ర వహించి, ఎ.ఒ.బి. జోన్ ఏర్పడ్డానికి కీలకపాత్ర వహించిన కామ్రేడ్ బి.కె. మిలటరీ సామర్థ్యం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. నిత్య నిర్బంధంలో పోలీసుల దాడిని తిప్పికొట్టే క్రమంలోనే ఆయన యుద్ధ నైపుణ్యాన్ని పెంపొందించుకున్నాడు. 1986లో సీలేర్ అవుట్ పోస్టుపై చేసిన దాడి మొదలుకొని 2005లో ఆర్. ఉదయగిరి పోలీస్ స్టేషన్‌పై చేసిన దాడి వరకూ ఈ ప్రాంతంలో జరిగిన అన్ని దాడులకూ అతనే నాయకత్వం వహించాడు. పార్టీ చరిత్రలోనే కలికితురాయిగా నిలిచిన, 536 తుపాకులు పి.ఎల్.జి.ఎ. స్వాధీనమైన చారిత్రాత్మక కోరాపుట్ దాడికి కామ్రేడ్ బి.కె. ప్రత్యక్షంగా నాయకత్వం వహించాడు. ఇంకా మరెన్నో ఆంబుష్‌లకు నేతృత్వం వహించి విజయవంతం చేశాడు. ఈ మిలటరీ సామర్థ్యాల వల్లే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా వున్నప్పుడు స్కోమా (సబ్ కమిటీ ఆన్ మిలటరీ అఫైర్స్)లోనూ సభ్యుడిగా వున్నాడు. 2001లో కేంద్ర కమిటీ సభ్యుడైన తర్వాత కేంద్ర మిలటరీ కమిషన్‌లోనూ సభ్యుడయ్యాడు.

2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్‌లో పాల్గొనడానికి వెళ్తున్న కామ్రేడ్ బి.కె.ను, అతని జీవిత సహచరి కామ్రేడ్ కరుణతో పాటు ఆంధ్ర ప్రదేశ్ క్రూర ఎస్.ఐ.బి. పోలీసులు పట్టుకొని, 2006 డిసెంబర్ 27న విశాఖ జిల్లా జంపర్లోవ అడవుల్లో దారుణంగా కాల్చి చంపారు.

## నిర్బంధం నిప్పుల కొలిమి మలిచిన వజ్రాయుధం

## కామ్రేడ్ సందె రాజమౌళి (ప్రసాద్)



ఉత్తర తెలంగాణా కార్యదర్శి కామ్రేడ్ మురళి అమరుడయ్యాక, ఆ స్థానంలో కామ్రేడ్ ప్రసాద్ (సందె రాజమౌళి) బాధ్యతలను స్వీకరించాడు. కామ్రేడ్ ప్రసాద్ కరీంనగర్ జిల్లా పెద్దపల్లి మండలం గూడెం గ్రామంలో 1965లో పేద రైతు కుటుంబంలో పుట్టాడు. పొత్కపల్లిలో పదవ తరగతి చదువుతూనే రాడికల్ బాట పట్టాడు. 1982లో పూర్తి కాలం కార్యకర్తగా హుస్నాబాద్ దళంలో చేరాడు. విషయాలను చురుగ్గా గ్రహించడంలో, గ్రహించిన దాన్ని ఆచరించడంలో వున్న సామర్థ్యాల రీత్యా కొద్ది కాలంలోనే కామ్రేడ్ ప్రసాద్ దళ కమాండర్ అయ్యాడు. ప్రభుత్వ సాయుధ బలగాల పదఘట్టనలతో వణికిపోతున్న పల్లెలకు అండగా నిలబడి నీళ్లలో చేపలా కలిసిపోయి ప్రజల్లో పార్టీపై విశ్వాసం పెంచాడు. ఆ నిర్బంధం మధ్యనే ప్రజలను సంఘటితం చేస్తూ పోరాటాలను చేపట్టాడు. ప్రజల విశ్వాసం చూరగొని 1988లో జిల్లా కమిటీ సభ్యుడయ్యాడు. 1995 ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ మహాసభలో స్పెషల్ జోనల్ కమిటీ (ఎస్.జడ్.సి.) సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 2000లో ఎస్.జడ్.సి. కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాడు. 2001లో కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. కేంద్ర మిలటరీ కమిషన్‌లోనూ భాగమయ్యాడు. కామ్రేడ్ ప్రసాద్ ఏ బాధ్యతలను స్వీకరించినా ఆ బాధ్యతలకు అనుగుణంగా తన్ను తాను మలచుకున్నాడు. నిత్య నిర్బంధంలో ఎందరో కామ్రేడ్స్ అమరులయి నాయకత్వ కొరత ఏర్పడ్డప్పుడల్లా ఆ కొరతను తీర్చే సంసిద్ధతను కామ్రేడ్ ప్రసాద్ కనబరిచాడు. 1990లో నిర్మితమైన చారిత్రాత్మక హుస్నాబాద్ స్థూపం అతని నేతృత్వంలోనే రూపుదిద్దుకుంది.

కామ్రేడ్ ప్రసాద్ మిలటరీ పరంగా విశేషమైన ప్రతిభా పాటవాలను కనబరిచాడు. జోన్ వుద్యమాన్ని ఉన్నత స్థాయికి అభివృద్ధి చేసే లక్ష్యానికి అనుగుణంగా సిర్పూర్(యు) పోలీస్ స్టేషన్లపై చేసిన దాడికి కామ్రేడ్ ప్రసాద్ ప్రత్యక్ష నాయకత్వం వహించాడు. కూంబింగ్‌లకు వచ్చే పోలీసులపై పలు ఆంబుష్‌లకు పథకం పన్ని విజయవంతం చేశాడు.

సుదీర్ఘకాలం ఉత్తర తెలంగాణానే తన కార్యక్షేత్రంగా చేసుకున్న కామ్రేడ్ ప్రసాద్ కేంద్ర మిలటరీ కమీషన్ సభ్యుడిగా కొన్నాళ్లు ఆంధ్రప్రదేశ్‌కూ, మరికొన్నాళ్లు ఎ.ఒ.బి.కీ బాధ్యత వహించాడు. 2005లో కర్నాటక కార్యదర్శిగా పనిచేస్తుండిన కామ్రేడ్ సాకేత్ రాజన్ అమరుడు కావడంతో కామ్రేడ్ ప్రసాద్ ఆ బాధ్యతలను స్వీకరించి కర్నాటక వెళ్లాడు. ఆనాటికి అక్కడి పార్టీలో మితవాద అవగాహన చోటుచేసుకొని పరిస్థితి సంక్లిష్టంగా వుంది. ఆ పరిస్థితిని చక్కదిద్దడానికి కామ్రేడ్ ప్రసాద్ కృషి చేసి పార్టీని సరైన పంథాలోకి నడిపించాడు. మల్నాడు అడవులను గెరిల్లాజోన్‌గా తీర్చిదిద్దడానికి పూనుకున్నాడు.

కామ్రేడ్ పద్మ (నేలకొండ రజిత) కామ్రేడ్ ప్రసాద్‌కు జీవిత సహచరి. వీళ్లద్దరి జంట ఎన్నో పోరాటాలకూ, దాడులకూ నాయకత్వం వహించి ఉత్తర తెలంగాణా ఉద్యమంలో చెరిగిపోని ముద్రను వేసుకుంది. కామ్రేడ్ ప్రసాద్‌ను ఎపి. ఎస్.ఐ.బి. కేరళ రాష్ట్రంలో పట్టుకొని 2007 జూన్ 22న అనంతపూర్ జిల్లా ధర్మవరం రైల్వేస్టేషన్ దగ్గర కాల్చిచంపింది.

## కాలం విసిరిన సవాల్‌ను స్వీకరించిన ధీశాలి

## కామ్రేడ్ బుర్రా చిన్నయ్య (మాధవ్)



2005లో కామ్రేడ్ మాధవ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి అయ్యాడు. అప్పటికి చర్చల నాటకం ముగిసి రాష్ట్రంలో నిర్బంధం నిప్పులు చెరుగుతోంది. ఆ సమయంలో ఆత్మ స్థైర్యంతో కామ్రేడ్ మాధవ్ (బుర్రా చిన్నయ్య)కార్యదర్శి బాధ్యతలను స్వీకరించాడు.

కామ్రేడ్ మాధవ్ (54) కరీంనగర్ జిల్లా మంగపేట గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు. 7వ తరగతి చదువుకొని వ్యవసాయ వృత్తి చేపట్టాడు. జగిత్యాల పోరాటాల ప్రేరణతో 1980లో రాడికల్ యువజన సంఘంలో చేరి భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో చురుకైన పాత్ర వహించాడు. 1985లో ఉద్యమాన్ని విస్తరింపజేయడంలో భాగంగా పార్టీ తనను మహబూబ్‌నగర్ జిల్లాకు పంపింది. అక్కడ ఉద్యమానికి తొలిబీజాలు వేసిన వాళ్లలో ఆయన ఒకరు.ఇది చెంచు ఆదివాసీలు అధికంగా నివసించే ప్రాంతం. ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై అభివృద్ధికి ఆమడ దూరంలో వున్న వీరిలో పోరాట చైతన్యం రగిలించడానికి కామ్రేడ్ మాధవ్ తీవ్ర కృషి చేశాడు. 90 తర్వాత నిర్బంధం తీవ్రమైంది. ఎస్పీ పరదేశినాయుడు నేతృత్వంలో పోలీసు దాడులు నిత్యకృత్యమయ్యాయి. ఈ పరిస్థితి నుండి వెసులుబాటుకోసం కామ్రేడ్ మాధవ్ నేతృత్వంలో సోమశిల వద్ద మందుపాతర పేల్చగా ఎస్.పి. పరదేశినాయుడు సహా పలువురు పోలీసులు చనిపోయారు. అలా పోరాటాల్లో చురుకైన పాత్ర వహిస్తూ 1995లో జిల్లాకమిటీ సభ్యుడయ్యాడు. అదే సంవత్సరం రీజనల్ కమిటీ సభ్యుడయ్యాడు.

ఇలా పోరాటాల్లో చురుకైన పాత్ర వహించి కామ్రేడ్ మాధవ్ ప్రభుత్వం కంట్లో నలుసుగా మారడంవల్ల అతన్ని చంపడం కోసం సోమ్లానాయక్ అనే కోవర్టును తయారుచేసింది. సోమ్లానాయక్ చేసిన దాడిలో దళ కమాండర్ సహా ముగ్గురు కామ్రేడ్స్ అమరులు కాగా ఈ దాడినుండి కామ్రేడ్ మాధవ్ త్రుటిలో తప్పుకున్నాడు.

2000లో ఆయన రాష్ట్రకమిటీలోకి కో ఆప్ట్ అయ్యాడు. చర్చలు ముగిసి 2005 ప్రారంభం నుంచి నిర్బంధం విరుచుకుపడింది. దళాలపై పోలీసు దాడులు తీవ్రమయ్యాయి. కోబ్రాలు, టైగర్ల పేరుతో ప్రజా సంఘాల కార్యకర్తలను, పార్టీ సానుభూతిపరులను ప్రభుత్వం పాశవికంగా హత్యచేసింది. శత్రు సమాచార, నిఘా వ్యవస్థలు విస్తృతంగా పెరిగాయి. రాష్ట్రమంతా ఒక భయానక వాతావరణం చోటుచేసుకుంది. దిగజారుళ్లు పెరిగిపోయాయి. పార్టీ ప్రతిఘటనలో చోటుచేసుకున్న కొన్ని అపశృతుల వల్ల పార్టీపై విమర్శలు వెల్లువెత్తి మొత్తంగా ఒక అననుకూల పరిస్థితి ఏర్పడింది. ఆ పరిస్థితిలో కామ్రేడ్ మాధవ్ 2005 సెప్టెంబర్‌లో రాష్ట్రకమిటీ కార్యదర్శిగా బాధ్యతలను స్వీకరించాడు. అననుకూల పరిస్థితిని సానుకూలంగా మార్చి, ప్రజల్లో, క్యాడర్లో విశ్వాసాన్ని పెంచడానికి తీవ్రంగా కృషి చేశాడు.

2006 జూలై 23న పకడ్బందీ సమాచారంతో, క్రూరమైన పథకంతో నల్లమల అటవీ ప్రాంతంలో దాదాపు 800మంది గ్రేహౌండ్స్ బలగాలు చేసిన మూకమ్మడి దాడిలో మరో ఏడుగురు గెరిల్లా వీరులతో పాటు కామ్రేడ్ మాధవ్ అమరుడయ్యాడు.

## నిరంతర పోరు ప్రవాహం కామ్రేడ్ వల్లూరి వెంకటరావు (మస్తాన్‌రావు)



2006లో కామ్రేడ్ మాధవ్ సహా నల్గురు రాష్ట్ర కమిటీ సభ్యులను కోల్పోయి ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమం తీవ్రంగా దెబ్బతిన్నది. 2007 ప్రారంభంలో జరిగిన 9వ (ఐక్యతా) కాంగ్రెస్, ఎ.పి. వుద్యమాన్ని క్షుణ్ణంగా చర్చించి రాష్ట్రం నుండి మెజారిటీ శక్తులను ఇతర ప్రాంతాలకు తరలించాలని నిర్ణయం తీసుకుంది. పరిమిత శక్తులతో అత్యంత జాగ్రత్తలతో ఉద్యమాన్ని కొనసాగించాలని నిర్ణయించింది. అయితే శత్రువు కొనసాగించిన క్రూర దాడిలో ఆ శక్తులను కూడా కోల్పోతూ వచ్చాం. దానితో రాష్ట్రంనుంచి సాయుధ దళాలన్నింటినీ రిట్రీట్ చేయాలనే ఎత్తుగడను కేంద్రకమిటీ తీసుకుంది. అయితే ఉద్యమ పునరుద్ధరణ లక్ష్యంతో ముగ్గురు కామ్రేడ్స్‌తో ఒక స్పెషల్ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీకి 2008లో కామ్రేడ్ మస్తాన్‌రావు (వెంకట్రావు) బాధ్యతలు స్వీకరించాడు. కామ్రేడ్ మస్తాన్ రావు (58) గుంటూరు పట్టణంలోని సంగడిగుంట నివాసి. పేదరికం వల్ల ప్రాథమిక విద్యతో సరిపెట్టుకుని, ఒక కళాశాలలో నాలుగో తరగతి ఉద్యోగిగా చేరాడు. ఎమెర్జెన్సీ కాలంలో ఆయనకు కామ్రేడ్ గురవయ్య సారు ద్వారా విప్లవోద్యమం పరిచయమైంది.

1982లో పూర్తి కాలం కార్యకర్తగా మారి సత్తెనపల్లి ప్రాంతంలో ఆర్గనైజర్‌గా పనిచేశాడు. రివిజనిస్టులకు కంచుకోటగా వుండే ఈ ప్రాంతంలో విప్లవోద్యమాన్ని పాదుకొల్పడానికి రివిజనిస్టులతో, సి.పి.ఐ. (ఎం. ఎల్) మితవాదులతో రాజీ లేని పోరాటం చేశాడు. 1990 నాటికి గుంటూరు జిల్లా కమిటీ కార్యదర్శయ్యాడు. 1995లో దక్షిణ కోస్తా-రాయలసీమ రీజనల్ కమిటీ కార్యదర్శిగాను, ఎ.పి. రాష్ట్ర కమిటీ సభ్యుడిగాను బాధ్యతలు స్వీకరించాడు. 1996లో రాయలసీమ ఉద్యమ బాధ్యతలను స్వీకరించాడు. అక్కడి పనివిధానాన్ని చక్కదిద్దడంలో తీవ్రమైన కృషిని సల్పి క్యాడర్ విశ్వాసాన్ని చూరగొన్నాడు. 2005లో కామ్రేడ్ ఎం.ఆర్., ఎ.ఒ.బి. ఉద్యమంలో భాగమయ్యాడు. కోరాపుట్ ఉద్యమాన్ని డివిజన్‌గా రూపొందించాలనే కాన్ఫరెన్స్ కర్తవ్యాన్ని స్వీకరించి భౌగోళికంగా కఠినమైన ఆ ప్రాంతానికి అనారోగ్యాన్ని లెక్కచేయకుండా వెళ్లి తీవ్రకృషి చేశాడు.

2008లో కేంద్రకమిటీ నిర్ణయం మేరకు ఎ.పి. ఉద్యమ పునరుద్ధరణ బాధ్యతను స్వీకరించాడు. నిర్బంధం నిప్పులు చెరుగుతున్న ఈ కాలంలో అడుగడుగునా శత్రు నిఘా వ్యవస్థ నడుమ, పడగవిప్పి వున్న విద్రోహాల నడుమ ఆ బాధ్యతను స్వీకరించడం ఒక పెద్ద సవాల్. ఆ సవాల్‌ను ఎటువంటి శషభిషలు లేకుండా స్వీకరించాడు.

ఆ కర్తవ్య నిర్వహణలో వున్న కామ్రేడ్ ఎం.ఆర్.ను 2008, అక్టోబర్ 27న మరో రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ రామచందర్, జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్స్ ప్రసన్న, శశిలతో పాటు ఇంటెలిజెన్స్ పోలీసులు పట్టుకున్నారు. కామ్రేడ్స్ రామచందర్, శశిలను గుంటూరు జిల్లాలో, కామ్రేడ్స్ ఎం.ఆర్., ప్రసన్నలను విజయనగరం జిల్లాలోని పార్వతీపురం మండలం రావికోన కొత్తవలస వద్ద కాల్చి చంపారు.

## విప్లవోద్యమ 'ఆరోప్రాణం'

## కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డి (సూర్యం)

రాష్ట్ర ఉద్యమం నుండి కేంద్ర కమిటీలోకి ఎదిగిన వారిలో కామ్రేడ్ సూర్యం (పటేల్ సుధాకర్ రెడ్డి) ఒకరు. కామ్రేడ్ సూర్యం(50) మహబూబ్ నగర్ జిల్లా కుర్తిరావుల చెరువు గ్రామంలో పుట్టాడు. 80వ దశకంలో గద్వాలలో బి.ఎస్సీ చదువుతూ రాడికల్ విద్యార్థి ఉద్యమంలో భాగమయ్యాడు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఎ. చదువుతూ తన ఆచరణను కొనసాగించాడు. మొదట వరంగల్ జిల్లా ఏటూరునాగారం ప్రాంతంలో ఆయన గెరిల్లా జీవితం మొదలైంది. అక్కడే దళ కమాండర్‌గా అభివృద్ధి చెంది



దండకారణ్యంలోని గడ్చిరోలికి బదిలీ అయ్యాడు. అక్కడ జిల్లా కమిటీ సభ్యుడిగా ఎదిగి ఆ వెంటనే ఆయుధాల కొనుగోలు విభాగంకు బదిలీ అయి కీలక బాధ్యతలను నిర్వర్తించాడు. ఈ క్రమంలోనే అరెస్టయి జైలు జీవితాన్ని అనుభవించాడు. ఆ సమయంలో చారిత్రాత్మక జైలు పోరాటాన్ని నడపడంలో కీలకపాత్రధారి అయ్యాడు.

జైలు నుంచి విడుదలయ్యాక దక్షిణ తెలంగాణా ఉద్యమంలో భాగమయ్యాడు. దక్షిణ తెలంగాణ ప్రాంతీయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించాడు. దక్షిణ తెలంగాణ ఉద్యమం గెరిల్లాజోన్‌గా ఎదిగిందనే సరైన అంచనాకు వచ్చాడు.

1999లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ ప్రత్యామ్నాయ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 2000లో రాష్ట్ర కమిటీ సభ్యుడయ్యాడు. ఆ తర్వాత రాష్ట్ర మిలటరీ కమీషన్‌లో భాగమయి యాక్షన్ టీంకు నేతృత్వాన్ని అందించాడు. తన నేతృత్వంలో యాక్షన్ టీం రాష్ట్రంలో సంచలన మిలటరీ ఘటనలకు పాల్పడింది. బెల్లి లలిత వంటి ప్రజాగాయనిని హత్య చేయించి, కొయ్యూరు వంటి బూటకపు ఎన్‌కౌంటర్‌లో చురుకైన పాత్ర పోషించి, విప్లవోద్యమంపై తీవ్ర అణచివేతకు పాల్పడిన అప్పటి హోం మంత్రి మాధవరెడ్డిని మట్టుపెట్టింది. అలాగే ఎస్పీ ఉమేష్ చంద్రను హైదరాబాద్ నగర నడిరోడ్డు మీద కాల్చి చంపింది. రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టి, తన ప్రజా వ్యతిరేక విధానాలకు అడ్డులేకుండా చేసుకోవడం కోసం విప్లవోద్యమంపై రికార్డ్ స్థాయిలో హింసకు పాల్పడిన పరమ ఫాసిస్టు చంద్రబాబునాయుడిని ఖతం చేయడానికి అలిపిరి వద్ద సాహసోపేత చర్యకు పాల్పడింది. అయితే ఈ ఘటనలో చావుతప్పి కన్ను లొట్టపోయి చంద్రబాబు బయటపడ్డాడు.

2004నుండి కేంద్ర మిలటరీ కమిషన్ అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తూ, 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్‌లో కేంద్ర కమిటీ సభ్యుడయ్యాడు. అమరత్వం నాటికి ఇంటలిజెన్స్ విభాగపు అధిపతిగా బాధ్యతలను నిర్వహిస్తున్న కామ్రేడ్ సూర్యంను ఆంధ్ర ఎస్.ఐ.బి. పోలీసులు వలవేసి పట్టుకొని 2009 మే 23న వరంగల్ జిల్లా లావెల్ల అడవుల్లో దారుణంగా కాల్చి చంపారు.

పైన చెప్పుకున్న వారితో పాటు రాష్ట్ర ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి ఎందరో రాష్ట్ర కమిటీ సభ్యులు తమ విలువైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. వారిలో ఎ.పి.రాష్ట్ర

కమిటీ సభ్యులైన కామ్రేడ్స్ గురవయ్య సార్, చింతల వెంకటస్వామి (సూర్యం), కిష్టప్ప (రెడ్డప్ప), ఒరుగంటి సుదర్శన్ (మహేందర్), మేకల దామోదర్ రెడ్డి (సంజీవ్), కారుమంచి ప్రసాద్ (దేవన్న), క్రిష్ణ (లింగమూర్తి), రామ్మోహన్ (సత్యం), మట్టా రవికుమార్ (మంజీరా), సామల వెంకటేశ్వర్లు (సుదర్శన్), వెలగా అప్పారావు ( రాఘవులు), తోట గంగాధర్ రావు (ఆర్.సి.); ఎస్.టి.స్పెషల్ జోన్ కమిటీ సభ్యులైన కామ్రేడ్స్ అనుపురం కొమురయ్య (సుధాకర్), పోలెం సుదర్శన్ రెడ్డి (ఆర్.కె.), దామెర కుమార స్వామి (యాదన్న), శెట్టిరాజు పాపయ్య (సోమన్న); ఎ.ఒ.బి. ఎస్.జడ్.సి. సభ్యులైన కామ్రేడ్స్ చిర్రా సదానందం (కౌముది), సుబ్బారావు (గౌతం), చొక్కోరి గంగారాం (కొమ్మ)లు వున్నారు.

## చరిత్రను పునర్లిఖిస్తున్న విప్లవ మహిళలు

వీరితో పాటు ఆకాశంలోనే కాదు అమరత్వంలోనూ మేం సగమంటూ ఉద్యమాభివృద్ధిలో ముఖ్యపాత్ర వహించిన పలువురు సీనియర్ మహిళా కామ్రేడ్స్ దేశ విముక్తి కోసం తమ వంతు త్యాగం చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించారు.

### కామ్రేడ్ పద్మ (లక్ష్మి)



కామ్రేడ్ పద్మ(30) కర్నూలు జిల్లాలోని ఆదోని పట్టణంలో పుట్టింది. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బి.ఎస్సీ. చదువుతూ ఆర్.ఎస్.యు.లో చేరింది. మహిళలను ఆర్.ఎస్.యు.లో చేర్చడానికి చురుగ్గా పనిచేసింది. ఆమెను మహిళా ఉద్యమ నిర్మాత అని చెప్పుకోవచ్చు. మహిళా వుద్యమ నిర్మాణం గురించి పార్టీలో అవగాహన పెంచడానికి విశేషమైన కృషి చేసింది. 1990 నుండి తిరుపతిలో కేంద్ర ఆర్గనైజర్‌గా పని చేస్తూ మహిళా ఉద్యమ నిర్మాణంలో ప్రత్యక్ష భాగస్వామి అయింది. రాష్ట్ర వ్యాప్త మహిళా ఉద్యమానికి పునాదులు వేసింది. స్త్రీవాద దృక్పథంలోని పరిమితులనూ, లోపాలను వివరిస్తూ శ్రామిక వర్గ దృక్పథాన్ని ఎత్తిపట్టింది. శ్రామిక మహిళా దృక్పథం పట్ల అవగాహనను పెంచడానికి రాష్ట్ర వ్యాప్త విప్లవ మహిళా పత్రికను నడిపింది, పలు రచనలను చేసింది. 92, 94లలో జరిగిన కేంద్ర ప్లీనాలలో పాల్గొని పార్టీ డాక్యుమెంట్లపై చురుగ్గా చర్చించింది.

కామ్రేడ్ పద్మ, కామ్రేడ్ క్రిష్ణ (లింగమూర్తి)కి జీవిత సహచరి. వీరిద్దరి జంట ఆదర్శవంతమైన నూతన ప్రజాస్వామిక విలువలను నెలకొల్పింది.

కామ్రేడ్ పద్మను, రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ చింతల వెంకట స్వామితో పాటు నెల్లూరు పట్టణంలో పోలీసులు పట్టుకొని, 1994 సెప్టెంబర్ 29న నెల్లూరు జిల్లా కోవూరు సమీపంలో బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చిచంపారు.

### కామ్రేడ్ నేలకొండ రజిత (పద్మ)



కామ్రేడ్ రజిత కరీంనగర్ జిల్లా తిప్పాయపల్లెలో ఒక మధ్య తరగతి కుటుంబంలో 1969లో పుట్టింది. జమ్మికుంటలో డిగ్రీ చదువుతూ 1985లో రాడికల్ విద్యార్థిని అయ్యింది. 1988లో పూర్తి కాలం కార్యకర్తగా రహస్య జీవితంలోకి వచ్చింది. 1989లో పెద్దపల్లి రైతాంగ దళ సభ్యురాలైంది. ఆనాటికి రైతాంగ దళాల్లో చేరిన అతి కొద్ది మంది మహిళా కామ్రేడ్స్‌లో కామ్రేడ్ రజిత ఒకరు. అప్రకటిత యుద్ధం మధ్య బి.ఎస్.ఎఫ్. తదితర శత్రు బలగాల దాడుల మధ్య ప్రజలను సంఘటితం చేస్తూ ఆమె అంచెలంచెలుగా ఎదిగి 2000లో కరీంనగర్ జిల్లా కార్యదర్శి బాధ్యతలు చేపట్టింది.

కామ్రేడ్ రజిత మిలటరీ జీవితం ఒక విలువైన అనుభవాల గని. అనేక శత్రు దాడులను సాహసోపేతంగా తిప్పికొట్టి సమర్థవంతమైన కమాండర్‌గా ఎదిగింది. పలు దాడుల్లో ప్రాణాలకు తెగించి పోరాడి నాయకత్వాన్ని కాపాడింది. అనేక ఆంబూష్‌లకూ, దాడులకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించి శత్రువు గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. అంతే కాదు పి.ఎల్.జి.ఎ.కు ప్రేరణగా నిలిచింది. పార్టీలో మహిళా కామ్రేడ్స్ ఎదుగుదలకు నిరంతరం తపన పడింది. ఉద్యమ అవసరాలకు అనుగుణంగా బాధ్యతలను స్వీకరిస్తూ 2000లో జరిగిన ఎస్.టి. కాన్ఫరెన్స్‌లో ఎస్.జడ్.సి.కి ప్రత్యామ్నాయ సభ్యురాలిగా ఎన్నికయింది. 2001లో ఎస్.జడ్.సి. సభ్యురాలైంది.

2002 జూలై 2న కరీంనగర్ జిల్లా సంకెళ్లబోరు వద్ద పోలీసులు చేసిన మూకమ్మడి దాడిలో హూరా హోరీగా పోరాడుతూ అమరురాలైంది.

## కామ్రేడ్ ఎల్లంకి అరుణ (లలిత)



కామ్రేడ్ లలిత (40) (ఎల్లంకి అరుణ) కరీంనగర్ జిల్లా మెట్‌పల్లి తాలూకా, బండలింగాపూర్ గ్రామంలో ఒక మధ్య తరగతి భూస్వామ్య సాంప్రదాయాలు బలంగా వేళ్లానుకున్న కుటుంబంలో పుట్టింది. కోరుట్లలో ఇంటర్ చదువుతూ ఆర్.ఎస్.యు.లో చేరింది. విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటూనే, డిగ్రీ చదివి ఉపాధ్యాయ వృత్తిలో చేరింది. 1988లో ఉద్యోగాన్ని వదిలేసి పూర్తికాలం కార్యకర్తగా అజ్ఞాత జీవితంలోకి వచ్చింది. మొదట 1989లో దండకారణ్యంలో రైతాంగ దళంలో పనిచేసింది. తర్వాత మహిళా రంగంలో పనిచేసింది. నేడు భారత దేశ మహిళా విప్లవోద్యమంలో అత్యంత స్ఫూర్తిదాయకంగా ముందు పీఠిన సాగుతున్న క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్‌కు బలమైన పునాదులు వేయడంలో ఆమె ముఖ్యమైన పాత్ర వహించింది.

1993లో ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయి రైతాంగ పోరాటాలకు నాయకత్వం వహించి, జిల్లాలోని భూస్వాములకూ, దళారీలకు సింహస్వప్నమైంది. 1996లో జిల్లా కమిటీ సభ్యురాలిగానూ, 2001లో జిల్లా కమిటీ కార్యదర్శిగానూ ఎన్నికయింది.

నిత్య నిర్బంధంలో శత్రు దాడులను ఎదుర్కొంటూనే యుద్ధ నైపుణ్యాన్ని పెంచుకొని మంచి మిలటరీ కమాండర్‌గా ఎదిగి పలు మిలటరీ ఘటనలకు నాయకత్వం వహించి, శత్రు బలగాలకు సవాల్‌గా నిలిచింది. తీవ్రమైన అనారోగ్య సమస్యలను అధిగమిస్తూనే ఆమె అత్యంత చైతన్యంతో విప్లవ ప్రస్థానాన్ని కొనసాగించింది.

2003 మే 14న సిర్‌పూర్ మండలం అగురుగూడెం గ్రామం వద్ద గ్రేహౌండ్స్ బలగాలు చేసిన మూకుమ్మడి దాడిలో వీరోచితంగా ప్రతిఘటిస్తూ అమరురాలయింది.

## కామ్రేడ్ సుగుణ (రాధక్క)

కామ్రేడ్ సుగుణ (రాధక్క) తొలి తరం మహిళా నాయకురాలు. పార్టీ చరిత్రలో మొట్ట మొదటి మహిళా కమాండర్. ఆమె కర్నూల్ జిల్లా మిత్తూర్ గ్రామంలో 1960లో పుట్టింది. మహబూబ్‌నగర్ జిల్లా గద్వాలలో 1974-76లో ఇంటర్మీడియట్ చదువుతూ రాడికల్ విద్యార్థిని అయింది. డిగ్రీ చదువుతున్న కాలంలో ఎందరో విద్యార్థుల్ని పోరుబాట పట్టించి విద్యార్థి నాయకురాలిగా మంచి గుర్తింపు పొందింది. 1985లో పూర్తికాలం కార్యకర్తగా నల్లమల అటవీ దళంలో చేరింది. చెంచు ప్రజలను సంఘటితం చేస్తూ ప్రజాదరణ పొంది 1989లో నల్లమల దళానికి కమాండర్‌గా ఎన్నికైంది. ఆ తర్వాత మెదక్ జిల్లాకు బదిలీ అయి ఇందూ ప్రియాల్ దళానికి కమాండర్‌గా పని చేసింది. 1997లో జిల్లా కమిటీ సభ్యురాలయింది. తీవ్రమైన నిర్బంధంలో అనేక ఎన్‌కౌంటర్లూ, నష్టాల నడుమ దృఢంగా నిలబడి ప్రజలను పార్టీ వెనక సమీకృతులను చేసింది. 1999లో గుంటూరు జిల్లాకు బదిలీ అయి జిల్లాలో జరిగిన పలు మిలటరీ ఘటనల్లో చురుకైన పాత్ర వహించింది. జిల్లాలో మొట్టమొదటిసారి రామిడిచెర్ల వద్ద పోలీసులపై ఆంబూష్ చేసి ఏడుగురిని మట్టుబెట్టిన ఘటనకు ఆమె నాయకత్వం వహించింది.



విప్లవోద్యమంలో ఎదురైన ఎన్నో ఒడిదుడుకులను దృఢంగా ఎదుర్కొని ముందుకు నడిచిన కామ్రేడ్ సుగుణను ఎస్.ఐ.బి. పోలీసులు ఆమె సహచరుడు కామ్రేడ్ కౌముదితో పాటు విశాఖ నగరంలో పట్టుకొని 2003 అక్టోబర్ 24న గుంటూరు జిల్లాలో కాల్చి చంపారు.

## కామ్రేడ్ పోతనాపల్లి పారమ్మ (చిట్టక్క)



కామ్రేడ్ చిట్టక్క (పోతనాపల్లి పారమ్మ) తొలి శ్రీకాకుళ పోరుతో కదం కదిపి, తిరిగి మలి శ్రీకాకుళ పోరులోనూ కదం తొక్కిన వీర వనిత. ఆమె శ్రీకాకుళం జిల్లా బొడ్డపాడు పోరుగడ్డపై పుట్టింది. కామ్రేడ్ తామాడ గణపతికి మేనకోడలు. ఆయన ప్రేరణతో తెగింపు సంఘంలో చేరింది. ఆ తర్వాత రైతాంగ దళంలో చేరి కామ్రేడ్ చాగంటి భాస్కర్ రావు, పంచాది నిర్మల తదితరులతో కల్సి పనిచేసింది. నాయకత్వం అమరులై, అరెస్టులై పోరాటం అణచివేతకు గురైనప్పటికీ ఆమె లొంగి పోకుండా ప్రజల్లో కల్సి వాళ్లలో చైతన్యం రగిలిస్తూనే వుంది. ఆ తర్వాత పైలా గ్రూప్‌ది పోరాట పార్టీ అని భ్రమ పడి అందులో

చేరింది. అయితే త్వరలోనే ఆ పార్టీ మితవాద అవకాశవాదంలో మునిగి వుందని గుర్తించి, పార్టీలో అంతర్గత పోరాటం చేసింది. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో 1995లో పీపుల్స్‌వార్ పార్టీలో చేరి సాయుధమైంది. పీపుల్స్‌వార్‌లో చేరాక ఆమె ఎంతో ఉత్సాహంగా నాటి పోరాట స్మృతులను కార్యకర్తలకు చెప్తూ, ఇన్నాళ్లకు ఆ పోరాటానికి వారసురాలైన పార్టీలో చేరాను అని సంతృప్తిని వ్యక్తం చేసేది.

దాదాపు 50 ఏళ్ల వయసులో చందనగిరి దళ కమాండర్‌గా పనిచేస్తూ ఎన్నో భూపోరాటాలకు నాయకత్వం వహించింది. నాటి పోరాటంలో ఎందరో భూస్వాములను శిక్షించిన చిట్టక్క, తిరిగి ఈ వయసులోనూ అంతే కసితో నీలిభద్ర భూస్వామి గన్నే ఎర్రయ్యను ఖతం చేసిన ఘటనలో చురుగ్గా పాల్గొంది.

నాటి పోరాటానికీ, నేటి పోరాటానికీ ఒక చైతన్యవంతమైన వారధిలా నిలిచి ప్రజల్లో, క్యాడర్లో ఆత్మీయ ముద్రను వేసుకున్న కామ్రేడ్ చిట్టక్క 1998 ఏప్రిల్ 13న గొట్ట గ్రామం వద్ద గెరిల్లా శిబిరంలో వున్న సమయంలో, ఆ శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఆ సమయంలో అనారోగ్యంతో నిరాయుధంగా వున్న కామ్రేడ్ చిట్టక్కను పట్టుకొని పోలీసులు పరమ క్రూరంగా కాల్చి చంపారు.

## కామ్రేడ్ విజయ లక్ష్మి (కరుణ)



కామ్రేడ్ కరుణ (విజయ లక్ష్మి) (38) కరీంనగర్ జిల్లా నవాబుపేటలో ఒక మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టింది. ఇంటర్ చదువుతుండగానే ఆమెకు ఉద్యమం పరిచయమై 1986లో పూర్తి కాలం కార్యకర్త అయింది. సుదీర్ఘ కాలం డెన్ బాధ్యతలను నిర్వహించిన కామ్రేడ్ కరుణ 1994లో గెరిల్లా దళంలో పనిచేయాలనే దృఢ నిశ్చయంతో శ్రీకాకుళం జిల్లాకు వెళ్లింది. 1998లో ఈస్ట్ డివిజన్‌కు బదిలీ అయి అక్కడ పలు బాధ్యతలను నిర్వహిస్తూ, ప్రజలను పోరాటోన్ముఖులను చేస్తూ 2003లో జిల్లా కమిటీ సభ్యురాలైంది.

2007 డిసెంబర్ 27న కామ్రేడ్ కరుణను తన సహచరుడు కామ్రేడ్ బి.కె.తో పాటు ఎ.పి.ఎస్.ఐ.బి.పోలీసులు పట్టుకుని విశాఖ జిల్లా జంపర్లోవ వద్ద బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చిచంపారు.

***

నూతన సమాజ ఆవిష్కరణలో భాగంగా చరిత్ర విసిరిన సవాల్‌ను ధీరోదాత్తంగా స్వీకరించి తమ అమూల్యమైన ప్రాణాలను ధారపోసిన ఈ కామ్రేడ్స్, వీరి దారిలో నడిచిన వేలాది మంది కామ్రేడ్స్ అమరులయ్యారు, చిరస్మరణీయులయ్యారు, చరిత్ర నిర్మాతలయ్యారు.ఈనాడు భారత దేశ వ్యాప్తంగా విస్తరించిన విప్లవోద్యమం వారి త్యాగాల ఫలితమే. వారిని స్మరించుకుందాం, వారు నెలకొల్పిన ఆదర్శాలను స్వీకరిద్దాం. వారు చూపిన మార్గంలో నడుద్దాం. వారి ఆశయాలను పరిపూర్తి చేద్దాం. వారి నెత్తుటి జెండాను గగన తలంలో ఎగరేద్దాం.

అలా మన ప్రియతమ కామ్రేడ్స్‌ను భౌతికంగా నిర్మూలించి తమ ఉనికిని కాపాడుకోవాలనుకుంటున్న దోపిడీ వర్గాల కుట్రలను భగ్నం చేద్దాం. సంక్షోభ సమయాన సమస్యల సుడిగుండంలో వుక్కిరిబిక్కిరవుతున్న ప్రజలను విప్లవాల బాట పట్టిద్దాం. ఫాసిస్టు నిర్బంధాన్ని ప్రతిఘటిద్దాం. ఛత్తీస్‌గఢ్, బీహార్-ఝార్ఖండ్‌లను విముక్తి చేసే కృషిలో భాగంగా ప్రజావిముక్తి సైన్యాన్ని అభివృద్ధి చేసి, మొబైల్ యుద్ధంలోకి పురోగమిద్దాం. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో గ్రామాలను విముక్తి చేస్తూ పట్టణాలను చుట్టుముట్టి ప్రజారాజ్యాధికారాన్ని సాధిద్దాం.అంతిమ విజయం సాధించి అమరుల కలలను నిజం చేద్దాం. వారు మృత్యుంజయులని చాటుదాం.

★ ★ ★

**అమరుల నెత్తుటితో తడిసిన జెండాను సమున్నతంగా ఎత్తిపడుదాం!**

**జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణా వారాన్ని విజయవంతం చేద్దాం!!**

**అమరుల స్మృతిలో గ్రామ గ్రామాన స్థూపాలను నిర్మిద్దాం!!!**

# ప్రపంచ బ్యాంకు విధానాల ఫలితమే లక్షల మంది రైతాంగం ఆత్మహత్యలు

## ఇదా రైతు ప్రభుత్వం? సిగ్గు సిగ్గు!

ప్రకృతి వైపరీత్యాల కారణంగా అసహజ మరణాలు సంభవిస్తున్నాయి. ఆర్థిక సంక్షోభాల కారణంగా దరిద్రం పెరిగి ఆకలి చావులు పెరుగుతున్నాయి. ఈ రెండూ కలిసి 1930లో బెంగాల్‌లో 30 లక్షల మంది ప్రజలు చనిపోయారు. ఇప్పుడు ప్రకృతి అనుకూలంగానే వుంది, కాబట్టే ఎంతో కొంత ప్రజలు తిండి తినగలుగుతున్నారు అనుకుంటే పొరపాటే. సామ్రాజ్యవాదుల దోపిడీ విధానాల వలన మరో పెద్ద ఆర్థిక సంక్షోభం వచ్చిందిప్పుడు. ద్రవ్యోల్బణం, ధరలు, నిరుద్యోగం పెరిగిపోయి ఆకలి చావులు సంభవిస్తున్నాయి. వీటి సంబంధంలోనే ప్రపంచ బ్యాంకు ఆర్థిక విధాన నిర్ణయాలలో భాగంగానే మార్కెట్ మాయాజాలం మరీ ముఖ్యంగా 1991 నాటి సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా ఇప్పటికి మూడు లక్షల మంది రైతాంగం ఆత్మహత్యలు చేసుకున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు, కార్పోరేట్ సంస్థలు, మన దుష్ట పాలకులు కలిసి దేశ సంపదను కొల్లగొట్టడానికి వేసిన పథకాల దెబ్బతో మధ్య తరగతి పేద ప్రజలు సర్వం కోల్పోతున్నారు. బతకలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. లెక్కల్లో ఎక్కువగా రైతాంగం ఆత్మహత్యలే కనబడుతున్నా చేనేత కార్మికులు, ఇతర రంగాల ప్రజల ఆత్మహత్యలు బాగానే వున్నాయి. సహజ మరణాల రేటు తగ్గిపోయి ఆత్మహత్యలు, అనారోగ్య మరణాలు, ఆకలి చావులు బూటకపు ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలు పెరిగాయి.

ప్రపంచ బ్యాంకు రూపొందించి నడిపిస్తున్న బడ్జెట్‌లలో వ్యవసాయానికి కేటాయింపులు క్రమంగా తగ్గిపోయాయి. మౌలిక సదుపాయాల కల్పన లేకుండా పోయింది. ఉన్న నీటి వసతి, విద్యుత్‌లను ప్రయివేట్‌పరం చేయడంతో పెరిగిన నీటి సెస్, విద్యుత్ ఛార్జీలు భరించరాకున్నాయి. అవి కూడా సకాలంలో సక్రమంగా అందక, చాలక పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వ సబ్సిడీలు 3 శాతం నుండి 1.5 శాతానికి కుదించారు. ఇదే అభివృద్ధి చెందిన దేశాలలో 50 శాతంకు మించి ఇస్తున్నారు. గతంలో 30 శాతం పంటను కొనుగోలు చేసిన భారత ఆహార సంస్థ ప్రభుత్వం నిధులు నిలిపివేయడంతో ప్రస్తుతం 15 శాతం మాత్రమే కొనుగోలు చేస్తున్నది. మార్కెట్ ఆధారిత ధరల నిర్ణయం కారణంగా మోన్‌శాంటో, కార్గిల్, మైకో లాంటి ప్రయివేట్ కార్పోరేట్ సంస్థలు బాగా లాభపడుతున్నాయి. కల్తీ విత్తనాల అమ్మకంలో 20 వేల కోట్ల రూపాయలు, కల్తీ పురుగు మందుల వ్యాపారంలో వెయ్యి కోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం రైతాంగ శ్రమను కొల్లగొడుతున్నారు. ఎగుమతులు-దిగుమతులు సరళం చేయడంతో ఐ.టి.సి., కార్గిల్ లాంటి సంస్థలు లక్షల టన్నుల వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ కారుచౌకగా కొని ఎగుమతులు చేస్తున్నారు. దిగుమతి సుంకాలు 32 శాతం తగ్గడంతో దేశీయ వుత్పత్తులను నిర్లక్ష్యం చేస్తూ విదేశీ ఉత్పత్తులు మార్కెట్‌లోకి ప్రవేశించి దేశీయ ఉత్పత్తుల ధరలు తగ్గిపోయాయి. రైతాంగానికి కనీస గిట్టుబాటు ధరలు లభించక పోవడంతో లక్షల కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. అటువంటి దుస్థితిలో రైతాంగం తమ పంటలు రోడ్ల మీద, మార్కెట్ యార్డ్‌లలోనే తగలబెడుతున్నారు. వ్యవసాయానికి ఇచ్చే రుణాల వాటా ఎల్.పి.జి. సంస్కరణల తర్వాత 49.60 శాతం నుండి 11.7 శాతానికి తగ్గిపోయింది. ప్రపంచ బ్యాంకు, ప్రభుత్వాలు, కార్పోరేట్ సంస్థలు ఉమ్మడిగా రైతును పీల్చి పిప్పి చేస్తున్నాయి. గానుగెద్దుల్లా రైతులు భూమి చుట్టూ తిరుగుతున్నారు. పంచదార మిల్లుల్లో చెరుకును వేసి పిప్పి తీసి పారవేసినట్లు రైతు శ్రమను దోచి, బక్కచిక్కిన రైతును విసిరి పారవేస్తున్నారు పాలకులు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి దేశ అవసరాలకనుగుణంగా ఆహారోత్పత్తుల లక్ష్యాన్ని సాధించడానికి, అన్నదాతకు సహకరించడానికి మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వంది ప్రధాన బాధ్యత. ఆ బాధ్యత నుండి ప్రభుత్వం వైదొలగడమే కాకుండా వారికి అందుబాటులో ఉన్న భూమినీ, నీటినీ, విద్యుత్‌నూ, ఖనిజ సంపదలను కొల్లగొట్టి కార్పోరేట్ సంస్థలకు

**పత్రికపై మీ విమర్శలూ, అభిప్రాయాలూ, సలహాలూ, సూచనలను ఎప్పటికప్పుడు తెలియజేయండి. అది పత్రిక అభివృద్ధికి దోహదపడుతుందని గుర్తించండి!**

అప్పగిస్తుంది. ఎస్.ఇ.జడ్.లు, మైనింగ్ పరిశ్రమలు, భారీ ప్రాజెక్టులు, ఓడ రేవులు, రవాణా మార్గాలు, ఇతర సదుపాయాల కోసం రైతులు కట్టిన లక్షల కోట్ల రూపాయాల పన్నులను ఖర్చు చేస్తూ, రైతుల్ని నిర్వాసితుల్ని చేస్తున్నారు. వారి బతుకుల్ని బూడిద చేస్తున్నారు. 'స్వర్ణాంధ్ర' చంద్రబాబు తొమ్మిది సంవత్సరాల నిర్లక్ష్యం నీడలు వెంటాడుతుండగా, వై.ఎస్.ఆర్. 'రైతు' ప్రభుత్వం జలయజ్ఞం ధనయజ్ఞంగా రుజువయిపోయింది. ప్రజలను మాయ చేయడంలోనూ, ప్రపంచ బ్యాంకుకు బహువినయంగా సేవలు అందించడంలో బహు నేర్పును, మహా వేగాన్ని సాధించాడు వై.ఎస్.ఆర్. రైతు పేరు చెప్పి రైతునే నిలువునా సమాధి చేసే విధానాలను గొప్పగా అమలుచేసి చూపిస్తున్నాడు. 1/70 చట్టానికి తూట్లు పొడిచి, ఆదివాసీల ఐక్యతను చీల్చి, ఆదివాసీ రైతులకు భూమి హక్కు పట్టాలిచ్చి, భూమిని సరుకుగా మార్చి, బాక్సైట్ తవ్వకు పోవాలనే పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాడు.

## నీటి సమస్య

భూ విస్తీర్ణంలో 80 శాతం భూమి వ్యవసాయ యోగ్యమయినది వున్నాగానీ, వాస్తవంలో సాగు చేస్తున్నది సగమే. అందులో నీటి వసతి ఉన్నది సగం కన్నా తక్కువే. మెజారిటీ భూమి వర్షాధారంపై పండీ పండనట్లే. ఉన్న భూమి కూడా ఎవరి చేతుల్లో ఉందో భూస్వామ్య సమాజం తేటతెల్లం చేస్తూనే వుంది. ఇక వ్యవసాయ విధానాల్లో ఆదిమ దశ నుండి ఆధునిక దశ వరకు వున్న ఉత్పత్తి పద్ధతులున్నాయి. అడవులు, మైదానాల్లో మెట్ట ప్రాంతాలంతా వర్షాధారమే. ఇక పల్లపు ప్రాంతాలు కూడా సాగునీటి నిర్మాణాలున్నది తక్కువ. 40 పెద్ద నదులు 2740 టి.ఎం.సి.ల నీటిని ప్రతి సంవత్సరం ప్రవహింపచేసినా 1900 టి.ఎం.సి.లనే వినియోగిస్తున్నాం. వేయి టి.ఎం.సి.లకు పైగా సముద్రంపాలు చేస్తున్నాం. బావులు, చెరువులు, రిజర్వాయర్లు పూడిక తీయక డెడ్ స్టోరేజిగా మారి అందులో నీరు త్వరగానే అడుగంటిపోతుంది. ఇంకుడు గుంటలు, నీరు-మీరు, వాటర్‌షెడ్ పథకాలు, బిందు, తుంపర సేద్యాల కోసం ఖర్చు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగు వేల కోట్ల రూపాయలు బూడిదలో పోసినట్లే. ఆ ప్రయోగాలకు వ్యతిరేక ఫలితాలే వచ్చాయి. నీరు నిలిచిందీలేదు. పంటలు పండిందీ లేదు. నీటి సంఘాలు, ప్రయివేట్ యాజమాన్యాలు వచ్చి నీటి తీరువా తెచ్చి పెట్టాయి. నీటి సెస్సు తలకుమించిన భారమైపోయిందిప్పుడు. అపర భగీరథుడి లక్ష కోట్ల రూపాయల జలయజ్ఞం అవినీతి గాథ మరో దశాబ్దంపాటు కొనసాగితీరాల్సిన కఠోర పాపాల కావ్య ధారే.

## విద్యుత్ సమస్య

రాష్ట్రంలో 2008 జనవరి నాటికి 17 కోట్ల 70 లక్షల యూనిట్ల విద్యుత్‌తో మన అవసరాలు తీరితే ఇప్పుడు 21 కోట్ల యూనిట్ల విద్యుత్ అవసరం వుంది. మన దగ్గర అంత పెద్ద మొత్తంలో విద్యుత్ వుత్పత్తి కాదు. వ్యవసాయానికి కోత పెట్టి రైతాంగం పొలాల్ని ఎండగట్టి వై.ఎస్.ఆర్. ఇచ్చిన హామీలను గాలికొదిలేస్తే రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. 'అనారోగ్య కారణాలతోనే చనిపోయారని' దొంగ రికార్డులు సృష్టిస్తున్నారు ప్రభుత్వాధికారులు. దీనికి నర్సింహారెడ్డి ఆత్మహత్య ఉదంతమే ప్రత్యక్ష తార్కాణంగా చూడవచ్చు. మెదక్ జిల్లా దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామంలో కొల్లూర్ నర్సింహారెడ్డి (40) రెండున్నర ఎకరాల వరి పొలం పొట్ట దశలో కరెంటు లేక బావినీరు పెట్టలేక పొలం ఎండిపోతుంటే, అప్పులు తీరుతాయన్న ఆశ అడుగంటిపోయి, పొలానికెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే రకం పోలికలున్న కథనాలు కొన్ని వేలున్నాయి. గత 18 సంవత్సరాల నుండి ఎన్నో వింటూ వున్నాం. ప్రతీ సంవత్సరం 20 వేలకు తగ్గడం లేదని నేషనల్ క్రైం బ్యూరో లెక్కలు చెబుతూనే వున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోనే ఆత్మహత్యలు అధికం అని లెక్కలు చూపిస్తున్నాయి. వై.ఎస్.ఆర్. రైతు రాజ్యంలో మరో కరెంటు (ఆత్మహత్య కాదు) కథ కరెంటులేక పంట ఎండితే గుండె మండి పంట పొలాన్ని రైతు నాగరాజు స్వయంగా తగలబెట్టిన ఈ కథ కొద్దిపాటి భిన్నత్వంతో వుంది. నర్సింహారెడ్డిది ఏప్రిల్ 28న జరిగింది, అప్పటికే ఇది జరిగిందని తెలిసి ముఖ్యమంత్రి స్పందించినదీ ఇదే రోజు. ఈ రెండు వార్తల్ని 'కన్నీటి పుటలుగా' పేపర్లు రాసాయి. నాగరాజుకు మూడు బావులున్నాయి. అందులో ఆరున్నర ఎకరాలకు నీరుంది. అసలు విషయం ఏమంటే ఏడు గంటల ప్రభుత్వ కరెంటు ఏనాడూ రాలేదు. ఇది నాగరాజు కథే కాదు. అక్కడ అందరి రైతుల పరిస్థితీ అదే. ఔరంగాబాద్‌లో నాగరాజు స్పందించి వార్తయ్యాడు. మిగిలిన రైతులు ఏమీ చేయలేక వార్తలకెక్కలేదు. నాగరాజు పొలం నీరులేక ఎండిపోయిందని ప్రభుత్వ దబాయింపు. కరెంటు లేకపోవడంతో నీరుండి పెట్టుకోలేకపోయామని ప్రజలు తమ బావులు చూపి వేడుకున్నా ఫలితం శూన్యం. పట్టించుకునే నాథుడే లేడని నాగరాజు లాంటి రైతుల ఆవేదన. రాయలసీమలో బత్తాయి తోటల్ని నరుకున్నప్పుడు, కోస్తా జిల్లాల్లో చెరుకు పంటల్ని తగలబెట్టుకున్నప్పుడు, పామాయిల్ తోటలు నరుకుతున్నప్పుడు, ధాన్యం, పత్తి, టమాటాలను రోడ్ల మీద వదిలేసినపుడు కూడా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగానే వ్యవహరించాయి. ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా రైతుల పట్ల నిర్లక్ష్యంగా వుండడం వారి విధానంగా మారిపోయింది. అందుకే ఆత్మహత్యలు పరంపరగా కొనసాగుతూనే వున్నాయి.

ఆత్మహత్యలు చేసుకున్న వారిలో అధికులు 31 నుండి 50 సంవత్సరాలలోపు వయస్సువారే. అందులో 22 శాతం తమకున్న కొద్దిపాటి భూమికి తోడు మరికొంత భూమిని కౌలుకు తీసుకున్నవారు. కాగా 77 శాతం పూర్తిగా కౌలుకు భూమి తీసుకున్నవారే. 65 శాతం వెనుకబడిన వర్గాలవారేనని, అందరూ ఎంతో కొంత చదువుకున్న వారేనని జీవనాధారం లేక, అప్పులు తీర్చలేక, భవిష్యత్ అంధకారమై బతకలేక బలవంతంగా కడతేర్చుకున్నవాళ్లు. ఇందులో ప్రభుత్వం బాధ్యతను వేలెత్తి చూపిస్తున్నారు వాళ్లు.

## రైతాంగం వేస్తున్న ప్రశ్నలు

రైతాంగం ముందుకు తెస్తున్న కొన్ని ప్రశ్నలకు ప్రభుత్వాలు సమాధానం చెప్పాల్సి వుంది. రాష్ట్రంలో లక్ష కోట్లతోను, దేశంలో 10 లక్షల కోట్లతోను పెద్ద బడ్జెట్‌లు ప్రవేశపెడుతూ కూడా వ్యవసాయానికి కేటాయింపులు ఎందుకు తగ్గిస్తున్నారు? ప్రణాళికల్లో ప్రకటించిన డబ్బులు ఎందుకు ఖర్చు చేయడం లేదు? వైద్యనాధన్ కమీషన్ (2004), స్వామినాధన్ సిఫార్సులను ఎందుకు అమలుచేయడం లేదు? మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించరు? ఎగుమతులు దిగుమతులపై ఆంక్షలు ఎందుకు ఎత్తివేశారు? కార్పోరేట్ రంగానికి మార్కెట్ అప్పగిస్తే రైతు బతుకు ఏం కావాలి? ప్రభుత్వం ఉన్నట్లా? 1951-56 మొదటి పంచవర్ష ప్రణాళిక నుండి 2007-12 నాటి 11వ ప్రణాళిక వరకు వ్యవసాయం పట్ల పాలకవర్గాలు చూపుతున్న శ్రద్ధ, ఇస్తున్న ప్రాధాన్యత, కేటాయింపులు చూస్తే అభివృద్ధి పథంలో మనం ఎక్కడున్నామో? ఎంత ఘోరమైన పరిస్థితులు ఎదుర్కోబోతున్నామో అర్థమవుతుంది. జాతీయ భద్రతా మిషన్ ఏర్పాటు చేసి ఆహార ధాన్యాల ఉత్పత్తి కోసం లక్ష్యాలు ప్రకటించి కూడా అమలు చేయలేని పరిస్థితి మనది. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీలు అమలుకాలేదు. అది రుణ సదుపాయం కావచ్చు, సబ్సిడీ కావచ్చు, మౌలిక సదుపాయాలు కావచ్చు. ఏదీ సరిగా సకాలంలో అమలుకాలేదు. భారీ రుణ మాఫీ పథకం పేదలకు ఒరగబెట్టింది శూన్యమే. దాని వలన బ్యాంకులు, భూస్వాములు, ధనిక రైతులు, అధికారులు బాగా లాభపడ్డారు. రైతాంగం నష్టపోయినా వడ్డీ కూడా మాఫీ చేయని ప్రభుత్వం. పెద్ద ఖాతాలకు మాత్రం వేల కోట్ల రూపాయల రాయితీలు ప్రకటిస్తున్నారు. కాకుల్ని కొట్టి గద్దలకు పెడుతున్నారు.

భారతదేశంలో ఆహార ధాన్యాల ధరలకు అంతర్జాతీయ ఆహార కొరతకు అసలు సంబంధం లేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో గోధుమలు 77 శాతం, బియ్యం ధరలు 16 నుండి 141 శాతం పెరిగినపుడు కూడా ఇక్కడ పెద్దగా ప్రభావం లేదు. కార్పోరేట్ చేతుల్లోకి భారత మార్కెట్ మారుతున్న క్రమంలో వ్యాపారులు, దళారీలు బాగా లాభపడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర వ్యాపారులు ఇక్కడ ఇవ్వకుండానే లక్షల టన్నులు కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. ఎగుమతి చేస్తున్నారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు కార్పోరేట్ రంగం నుంచి కొని, పంటలన్నీ వారికే అమ్మి వారిని కుబేరుల్ని చేస్తున్న రైతాంగం దైన్య స్థితికి ఈ ప్రభుత్వాలే కారణమని, వారంతా వాటాదారులనీ, ప్రపంచ బ్యాంకుకు చెప్పినట్లే చేస్తారనేది తేటతెల్లమే. ఇక్కడి రైతుల ఆత్మహత్యలను ఈ నేపథ్యం నుండికాక మరో విధంగా విశ్లేషించుకోవడం కుదరని పని.

నేటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం అన్ని రంగాల్ని ప్రభావితం చేసినట్లే వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసింది. మార్కెట్ స్పెక్యులేషన్‌కు ద్రవ్యోల్బణం కూడా తోడై ధరల్లో చాలా తేడానే వచ్చింది. ఎన్నికలకు ముందున్న ధరలు, ఫలితాలు ప్రకటించాక మారిపోయాయి అంటే పాలకవర్గాలు వ్యాపార వర్గాల మధ్య ఎంత దగ్గర సంబంధాలున్నాయో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర బడ్జెట్ ప్రకటనకు ముందే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారు. ఇప్పుడు మరల ఒక్కసారిగా 60 శాతం నుండి 80 శాతం ధరలు పెరగడంతో నిత్యావసరాలైన కందిపప్పు 90 రూపాయలు, బియ్యం 30 రూపాయలు పెరగడంతో ప్రజలు గగ్గోలుపెడుతున్నారు. ప్రభుత్వం నిద్రపోతుందా? అని ప్రజలు బహిరంగంగానే నిలదీస్తున్నారు.

అయిదు లక్షల టన్నుల వంట నూనెల కోసం (45 శాతం) దిగుమతులపై ఆధారపడుతున్నాం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం మన దేశంలో నూనె వాడాల్సిన దానిలో సగం మాత్రమే వాడుతున్నాం. ఆమేరకు ఆలోచించినా 2010 నాటికి 160 లక్షల టన్నులు కావాలి. 2015 నాటికి 210 లక్షల టన్నులు కావాలి. 10 నుండి 20 లక్షల హెక్టార్లలో పామాయిల్ పండిస్తే సమస్యను పరిష్కరించవచ్చు. తీరప్రాంత భూములు, సెజ్‌లకిచ్చే భూములు, వారికిచ్చే మౌలిక సదుపాయాలు, రాయితీలు రైతాంగానికీ, వ్యవసాయానికి ఇవ్వగలిగితే ఆహార, వంట నూనెల సమస్యలు పరిష్కరించవచ్చు. వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే ప్రపంచ బ్యాంకు విధానాల్ని వదులుకోవాలి. కార్పోరేట్‌కు సాగిలబడి మార్కెట్‌ను అప్పగించే విధానాన్ని వదులుకోవాలి. దీనికి ప్రభుత్వం బాధ్యతపడాలి. సాధ్యమా? పాలకవర్గాలను సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ బూర్జువాలతో ముఖ్యంగా భూస్వాములతో విడదీసి చూడగలమా! అందుకే ఈ రాజ్యం దోపిడీ రాజ్యం. ఈ రాజ్యాన్ని కూల్చాల్సిందే. నూతన ప్రజాస్వామిక విప్లవంతప్ప మార్గం లేదు. ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అన్ని సెక్షన్ల ప్రజలను కలుపుకుని ఉద్యమిద్దాం. ★

# పార్టీ కమిటీల

1. పార్టీ కమిటీ కార్యదర్శి ఒక మంచి “దళనాయకుడి”గా వుండాలి. ఒక పార్టీ కమిటీలో 16 నుంచి 20 మంది దాకా సభ్యులుంటారు. అది సైన్యంలోని ఒక దళం (స్క్వాడు)ను పోలి వుంటుంది. కార్యదర్శి “స్క్వాడు నాయకుడి”ని పోలి వుండాలి. ఈ స్క్వాడును బాగా నడిపించగలగటం నిజానికి ఏమంత తేలికైన పనికాదు. సెంట్రల్ కమిటీకి చెందిన ప్రతి బ్యూరో, ఉప బ్యూరోల నాయకత్వం కింద ఇపుడు విస్తారమైన ప్రాంతాలున్నాయి. అవి చాలా బరువు బాధ్యతలను మోస్తున్నాయి. నాయకత్వాన్ని అందివ్వడం అంటే, సాధారణ నిర్దిష్ట విధానాలను నిర్ణయించడం మాత్రమే కాదు, సరియైన పని పద్ధతులను కూడా రూపొందించుకోవాల్సి వుంటుంది. సరియైన సాధారణ, నిర్దిష్ట విధానాలు వున్నప్పటికీ, పని పద్ధతులను నిర్లక్ష్యం చేస్తే, ఇబ్బందులు తలెత్తే అవకాశం వుంటుంది. తన నాయకత్వ బాధ్యతను నెరవేర్చడానికి, ఒక పార్టీ కమిటీ కార్యదర్శి తన స్క్వాడు సభ్యులపై ఆధారపడాలి. ఎవరి పాత్రలను వారు పూర్తిగా నిర్వహించ గలందుకుగానూ, వారికి సహాయపడాలి. ఒక మంచి “స్క్వాడు నాయకుడి”గా వుండగలందుకుగానూ, ఆ కార్యదర్శి కష్టపడి అధ్యయనం చేయాలి. సర్వసమగ్రంగా పరిశోధన జరపాలి. ఒక కార్యదర్శి లేదా ఉపకార్యదర్శి తన స్వంత “స్క్వాడ్ సభ్యుల”లో ప్రచారాన్నీ, సంస్థాగత కార్యకలాపాల్ని నిర్వహించడం పట్ల జాగ్రత్త వహించకపోయినా, కమిటీ సభ్యులతో తన సంబంధాలను సజావుగా వుంచుకోలేకపోయినా, సమావేశాలను విజయవంతంగా నడిపించటం ఎలాగు అన్న దాన్ని గురించి అధ్యయనం చేయకపోయినా, ఆ కార్యదర్శి, లేదా ఉపకార్యదర్శి తన “స్క్వాడు”ను నిర్దేశించడంలో కష్టాల నెదుర్కుంటాడు. “స్క్వాడు సభ్యులు” కదం కలిపి నడవలేకపోతే, కోట్లాది ప్రజలను పోరాటంలోనూ, నిర్మాణ కృషిలోనూ నడిపించగలమని వారు ఎన్నడూ ఆశించలేరు. అయితే కార్యదర్శికీ, కమిటీ సభ్యులకు మధ్య వుండే సంబంధం మెజారిటికి మైనారిటీ తలవొగ్గటంపై ఆధారపడి వుంటుంది. అది స్క్వాడు నాయకుడికీ, అతని బలగానికి మధ్యన వుండే సంబంధానికి భిన్నమైనట్టిది. పోల్చి చెప్పటం కోసం మాత్రమే ఇక్కడ దాన్ని ప్రస్తావించాము.

2. సమస్యలను సమావేశంలో ప్రవేశపెట్టండి. “స్క్వాడ్ నాయకుడు” మాత్రమేకాదు, కమిటీ సభ్యులు కూడా ఈ పనిని చేయాలి. వ్యక్తుల వెనకాల మాట్లాడకండి. సమస్యలు తల ఎత్తగానే, సమావేశాన్ని పిలవండి. సమస్యలను చర్చించండి, కొన్ని నిర్ణయాలను తీసుకోండి, సమస్యలు పరిష్కరించబడతాయి. సమస్యలు వుండి, వాటిని సమావేశం ముందుకు తీసుకొని రాకపోయినట్లయితే అవి చాలా కాలం వరకు అలాగే అపరిష్కృతంగా వుండిపోతాయి, చాలా సంవత్సరాల తరబడి ఈడ్చబడవచ్చు కూడా. “స్క్వాడు నాయకుడు” మరియూ కమిటీ సభ్యులు, తమ పరస్పర సంబంధాలలో సదవగాహనను కలిగి వుండాలి. కార్యదర్శికీ, కమిటీ సభ్యులకు మధ్యన, కేంద్ర కమిటీకీ దాని బ్యూరోలకూ మధ్యన, బ్యూరోలకూ, ప్రాంతీయ పార్టీ కమిటీలకు మధ్యన పరస్పరం, అవగాహన, మద్దతు, స్నేహ భావము వుండడం కంటే ముఖ్యమైన విషయం మరోటి లేదు. గతంలో ఈ అంశంపై పెద్దగా దృష్టి సారించబడలేదు. కానీ పార్టీ ఏడవ కాంగ్రెసు తర్వాత ఈ విషయంలో మంచి పురోగతి వుంది, స్నేహ బంధాలు, ఐక్యత బాగా పటిష్టం చేయబడ్డాయి. భవిష్యత్తులో, ఈ అంశంపై మనం నిరంతరం దృష్టి కేంద్రీకరించాలి.

3. “ఒకరికొకరు సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోండి.” ఒక పార్టీ కమిటీ సభ్యులు తమ దృష్టిలోకి వచ్చిన అంశాలపై, ఒకరికొకరు తెలియజేసుకొని, భావాలను ఇచ్చిపుచ్చుకోవాలి - అని దీని అర్థం. ఒకేతీరైన అవగాహనను సాధించటంలో దీనికి చాలా ప్రాముఖ్యత వుంది. కొంత మంది అలా చేయటంలో విఫలమవుతారు. “కూతవేటు దూరంలో నివసిస్తున్నప్పటికీ, కొంత మంది యావజ్జీవిత పర్యంతమూ ఒకరికొకరు కలుసుకోరు” అని లావోట్జు పేర్కొన్నట్టి మనుషులలానే ప్రవర్తిస్తారు; దాని ఫలితంగా, వారికి ఒకే తీరైన అవగాహన వుండదు. గతంలో, ఉన్నత స్థాయికి చెందిన అనేక

# పని పద్ధతులు

*మార్చి 13, 1949*

*- కామ్రేడ్ మావో*

మంది మన కామ్రేడులు, తగినంతగా అధ్యయనం చేయకపోబట్టి, వారికి మార్క్సిజం-లెనినిజపు ప్రాథమిక సైద్ధాంతిక సమస్యలపైన కూడా కనీసం ఒకే తీరైన అవగాహన లేదు. ఈ రోజున, పార్టీలో మరింత ఉన్నతమైన ఒకే తీరైన అవగాహన వుందికానీ, ఈ సమస్య ఇంకా పూర్తిగా పరిష్కరింపబడలేదు. ఉదాహరణకు భూసంస్కరణల్లో, "మధ్యతరగతి రైతులు" మరియు "ధనిక రైతులు" అంటే అర్థమేమిటన్న దాని విషయానికి సంబంధించి, అవగాహనలో ఇంకా భేదాభిప్రాయాలు వున్నాయి.

**4.** మీకు అర్థంకానీ, లేదా మీకు తెలియని విషయాల గురించి, మీ కింద పనిచేసే వారిని అడగండి. మీ ఆమోదాన్ని గానీ లేదా తిరస్కారాన్నిగానీ తేలికగా తెలియచేయవద్దు. కొన్ని డాక్యుమెంట్లు రూపొందించబడ్డ తర్వాత కూడా వాటిలో కొన్ని ప్రశ్నలకు వివరణ కావాల్సి వుంటుంది కాబట్టి, ముందుగా కింది శ్రేణులతో సంప్రదించడం అవసరమవుతుంది. కనుకనే వాటిని కొంత కాలంపాటు పంచి పెట్టకుండా ఆపివేయటం జరిగింది. మనకు తెలియని దాన్ని గురించి, మనకు తెలిసినట్టుగా ఎన్నడూ భేషజాలకు పోరాదు. "కిందనున్న వారిని అడిగి - వారి నుండి నేర్చుకోవడానికి మనం ఎన్నడూ సిగ్గు పడకూడదు. కింది స్థాయిలోని కేడర్ల అభిప్రాయాలను మనం జాగ్రత్తగా వినాలి. ఒక అధ్యాపకుడివి కావడానికి ముందు నీవు ఒక విద్యార్థివి కావాలి. - ఆజ్ఞలను జారీచేసే ముందే, కింది స్థాయిలోని కేడర్ల నుంచి నీవు నేర్చుకోవాలి. కేంద్ర కమిటీకి చెందిన అన్ని బ్యూరోలకు, యుద్ధ రంగాలలోని పార్టీ కమిటీలకు, సమస్యలను పరిష్కరించటంలో ఇదే కార్యాచరణ పద్ధతి కావాలి. కేవలం, సైనికపరమైన అత్యవసర పరిస్థితుల్లోనూ లేదా, విషయానికి సంబంధించిన వాస్తవాలు ఇప్పటికే స్పష్టంగా వున్నప్పుడు దీనికి మినహాయింపు వుంటుంది. ఇలా చేయడం వల్ల ఎవరి గౌరవము తగ్గిపోదు సరికదా, అది మరింత ఇనుమడిస్తుంది. కింది స్థాయిలోని కేడర్ల సరియైన అభిప్రాయాలను, మన నిర్ణయాలు ప్రతిబింబిస్తాయి గనుక, వారు సహజంగానే వాటికి మద్దతునిస్తారు. కింది స్థాయిలోని కేడర్లు చెప్పేదంతా సరియైనది కావచ్చు, కాకపోవచ్చు; మనం దాన్ని విశ్లేషించాలి. సరియైన భావాలకు మనం తలవొగ్గి, వాటిని అమలుచేయాలి. విభిన్న ప్రాంతాల నుండి వచ్చే విషయాలను, నివేదికలను, సరియైన భావాలను కేంద్ర కమిటీ క్రోడీకరిస్తుంది, కాబట్టే కమిటీ నాయకత్వం, ప్రధానంగా సరియైనదిగా వుంటుంది. వివిధ ప్రాంతాలు, విషయాలను వివరించి, తమ తమ అభిప్రాయాలను అందించనట్లయితే, సరియైన ఆదేశాలను జారీ చేయటం కేంద్ర కమిటీకి కష్టమవుతుంది. కింది నుంచి వచ్చే పొరపాటు భావాలను కూడా వినండి. వాటిని అసలుకే వినక పోవడమన్నది కూడా పొరబాటే. అయితే, అటువంటి భావాలపై మనం ఆధారపడకూడదు, వాటిని విమర్శించాలి.

**5.** "పియానోను మోగించడం" నేర్చుకోండి. పియానోను మోగించేటపుడు పది వేళ్లూ కూడా కదులుతూనే వుంటాయి. కొన్ని వేళ్లనే కదిల్చి, మిగిలిన వాటిని కదల్చకుండా వుంటే, కుదరదు. కానీ, పది వేళ్లను ఒకేసారి నొక్కితే శ్రావ్యమైన సంగీతం రాదు. శ్రావ్యమైన సంగీతాన్ని సృష్టించాలంటే, పది వేళ్లను లయబద్ధంగానూ సమన్వయంతోనూ కదిలించాలి. పార్టీ కమిటీకి తన కేంద్ర కర్తవ్యంపై గట్టి పట్టూ, గ్రహింపు వుండాలి. అదే సమయంలో, కేంద్ర కర్తవ్యం చుట్టూ, ఇతర రంగాలలోని పనిని వికసింపచేయాలి. ప్రస్తుతం మనం అనేక రంగాలపై శ్రద్ధ వహించాలి. అన్ని ప్రాంతాలలోని అన్ని సాయుధ యూనిట్లలోని, డిపార్టుమెంట్లలోని పనిని గురించి మనం శ్రద్ధ పెట్టాలి. కొన్నిటిని మినహాయించి, కొన్ని సమస్యల పైననే మనం మన దృష్టిని కేంద్రీకరిస్తే సరిపోదు. ఎక్కడ సమస్య వుంటే, అక్కడ మనం దాన్ని వెంటనే చేపట్టాలి. ఈ పద్ధతిలో మనం నైపుణ్యాన్ని సాధించుకోవాలి. కొంత మంది పియానోను బాగా మోగించగలరు, కొంత మంది సరిగ్గా మోగించలేరు. వారు సృష్టించే సంగీతంలో చాలా పెద్ద తేడానే వుంటుంది. పార్టీ కమిటీ సభ్యులు "పియానో" బాగా "మోగించటాన్ని" నేర్చుకోవాలి.

**6.** "గట్టిపట్టు వుంచండి" అంటే పార్టీ కమిటీ తన ప్రధాన కర్తవ్యాలను కేవలం "చేపట్టడం" మాత్రమేగాక, వాటిపై ఖచ్చితంగా

"గట్టి పట్టు వుంచాలి''. ఏ మాత్రం సడలింపు కూడా లేకుండా, గట్టి పట్టు బిగించటం ద్వారానే, ఎవరైనా ఒక వస్తువును నిజంగా పట్టుకోగలుగుతారు, గట్టి పట్టు లేకపోవటం అంటే, అసలు పట్టు లేకపోవటమే అన్నమాట. అరచేయి తెరిచే వుంచి, ఎవరూ, ఏ వస్తువుపైన పట్టు సంపాదించలేరు. ఏదైనా పట్టుకున్నప్పుడు పిడికిలిని బిగించాలి కాని అది కూడా గట్టిగా బిగించకపోయినట్లయితే, అప్పుడు కూడా ఇంకా పట్టు నిలవదు. మన కామ్రేడ్‌లలో కొంత మందికి, ప్రధాన కర్తవ్యాలపై పట్టు వుంటుంది. కానీ వారి పట్టు గట్టిగా వుండదు. కాబట్టి వారి పని ఫలప్రదం కావడం లేదు. పట్టు లేకపోవడం అన్నదీ కుదరదు, పట్టు గట్టిగా లేకపోవడమన్నదీ కుదరదు.

7. "లెక్కల గురించి శ్రద్ధ చూపండి'' అంటే, ఒక పరిస్థితి లేక ఒక సమస్యకు చెందిన పరిమాణాత్మక కోణాన్ని కూడా మనం గమనించి, ఒక ప్రాథమికమైన పరిమాణాత్మక విశ్లేషణ చేయాలి అని. ప్రతి విషయము (ప్రతి గుణము) ఏదో ఒక నిర్దిష్ట పరిమాణంలోనే (కొలతలోనే) వ్యక్తమవుతుంది. ఏ కొలతా లేకుండా ఏ గుణమూ (విషయమూ) వుండబోదు. విషయాల పరిమాణాత్మక కోణాన్ని కూడా మనం గమనించాల్సి వుంటుందని కొంత మంది కామ్రేడులు ఈనాటికి కూడా అర్థం చేసుకోలేదు - అంటే ప్రాథమిక గణాంక వివరాల, ప్రధానమైన నిష్పత్తులు, వస్తువుల గుణాలను నిర్ణయించే పరిమాణాత్మక హద్దులు, వీటి గురించి అన్నమాట. వారు "లెక్కలు''పై దృష్టిని నిలపలేరు; తత్ఫలితంగా తప్పులు చేయకుండా వుండలేరు. ఉదాహరణకు, భూసంస్కరణలను అమలు చేసేటపుడు, జనాభాలో, భూస్వాముల, ధనిక రైతుల, మధ్య తరగతి రైతుల, పేద రైతుల నిష్పత్తు లెంతెంత వున్నాయి, ప్రతీ గ్రూపు ఎంతెంత భూమిని కలిగి వుంది అన్న లెక్కలు తెలిసి వుండటం చాలా అవసరం. ఎందుచేతనంటే, కేవలం ఈ ప్రాతిపదిక మీదనే సరియైన విధానాలను మనం రూపొందించుకోగల్గుతాము. ధనిక రైతు అని ఎవరిని అనాలి, బాగా జరుగుబాటు గల మధ్య తరగతి రైతు అని ఎవరిని అనాలి, దోపిడి ద్వారా వచ్చే ఆదాయం ఏమేరలో వుంటే ఒక వ్యక్తిని - బాగా జరుగుబాటు వున్న రైతుకంటే భిన్నంగా ధనిక రైతు అనాలి - ఈ విషయాలన్నిటిలో కూడా, పరిమాణాత్మక హద్దులను తెలుసుకోవాలి. అన్ని ప్రజా వుద్యమాలలోనూ ఆయా ఉద్యమాలకు గల క్రియాశీల మద్దతుదారులు, వ్యతిరేకులు, తటస్థుల సంఖ్యను గురించిన ప్రాథమిక దర్యాప్తును, విశ్లేషణనూ జరపాలి. స్వీయ మానసికంగానూ, ఏ ఆధారమూ లేకుండానూ సమస్యలను పరిష్కరించకూడదు.

8. "ప్రజలకు మళ్లీ హామీనిస్తూ నోటీసివ్వడం''. సమావేశాలకు ముందుగానే నోటీసు నివ్వాలి. ఇది "ప్రజలకు మళ్లీ హామీనిస్తు నోటీసివ్వడం'' వంటిదే. ఆ విధంగా ఇవ్వటం ద్వారా, దేన్ని గురించి చర్చించాలో, ఏయే సమస్యలు పరిష్కరింపబడాలో అన్న వాటిని గురించి అందరూ తెలుసుకొని, సకాలంలో సన్నాహాలు చేసుకోగల్గుతారు. కొన్ని కొన్నిచోట్ల, నివేదికలను, ముసాయిదా తీర్మానాలనూ ముందుగానే తయారు చేసుకోకుండానే, కేడర్లను సమావేశానికి పిలవడం జరుగుతోంది, తీరా సమావేశానికి అందరూ వచ్చిన తర్వాతే, ఆదరా బాదరాగా ఆపద్ధర్మపు ఏర్పాటులు చేయబడతాయి. ఇది "సేనలు, గుర్రాలు చేరుకున్నాయి కానీ, ఆహారము, దాణా ఇంకా తయారు కాలేదు'' అని అనడం లాంటిది. ఇది మంది పద్ధతి కాదు. సన్నాహాలు పూర్తి కాకపోతే, తొందరపాటుతో సమావేశాన్ని పిలవవద్దు.

9. "కొద్దిపాటివే అయినప్పటికీ, మేలైన సేనలు, సులువైన పరిపాలన''. చర్చలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, తీర్మానాలు ఇవన్నీ కూడా క్లుప్తంగానూ, సూటిగానూ వుండాలి. సమావేశాలు దీర్ఘకాలంపాటు కొనసాగకూడదు.

10. మీతో విభేదించే కామ్రేడులతో ఐక్యమయి, పని చేయటం మీద శ్రద్ధ పెట్టండి. వివిధ ప్రాంతాల్లోనూ, సైన్యంలోనూ, ఇరుతావుల్లోనూ, ఈ విషయాన్ని మనస్సులో వుంచుకోవాలి. పార్టీకి వెలుపల వుండే ప్రజానీకంతో సంబంధాల విషయంలో కూడా ఇది వర్తిస్తుంది. దేశంలోని ప్రతి మూల నుంచి వచ్చిన మనం కలసి నడిచాం. మనలాంటి భావాలు కలిగి వున్న కామ్రేడులతోనే కాక, మన అభిప్రాయాలకు, భిన్నమైన అభిప్రాయాలుకల కామ్రేడులతో కూడా మన పనిలో ఐక్యమవడంలో మనం సజావుగా వుండాలి. తీవ్రమైన పొరపాట్లు చేసిన వారు కొందరు మనలో వున్నారు. వారిపట్ల వైమనస్యాన్ని ప్రదర్శించకుండా, వారితో కలిసి పని చేయడానికి మనం తయారుగా వుండాలి.

11. తలబిరుసుతనం పట్ల అప్రమత్తులై వుండండి. నాయకత్వ స్థానంలో వున్న వారందరికీ ఇది ఒక సూత్రపరమైన ముఖ్య విషయం. ఐక్యతను నిలబెట్టుకోటానికి ఒక ముఖ్యమైన నిబంధన. తీవ్రమైన పొరబాట్లు చేయనివారు తమ పనిలో గొప్ప విజయాన్ని సాధించిన వారు కూడా తలబిరుసుతనంతో వ్యవహరించకూడదు. పార్టీ నాయకుల పుట్టిన రోజు వేడుకను జరుపుకోవటం నిషేధించబడింది. అదే విధంగా, ప్రదేశాలకుగానీ, వీధులకుగానీ, సంస్థలకుగానీ, పార్టీ నాయకుల పేర్లు పెట్టడం కూడా నిషేధించబడినది. సాదాసీదా జీవితాన్ని గడపటం, కష్టపడి పని చేయటం, అనే మన పని శైలిని మనం నిలబెట్టుకొని, ముఖస్తుతులకు, విపరీతమైన ప్రశంసలకు స్వస్తి చెప్పాలి.

12. రెండు విభజన రేఖలను గీయండి. మొదటిది, విప్లవానికీ, ప్రతీఘాత విప్లవానికీ మధ్యన, యేనాన్‌కు, సియాన్‌కు మధ్యన ఈ విభజన రేఖను గీసుకోవాలన్న విషయాన్ని కొందరు అర్థం చేసుకోరు. ఉదాహరణకు పెత్తందారీతనాన్ని వ్యతిరేకిస్తున్నపుడు వారు యేనాన్‌ను గురించి అక్కడ కూడా "ఏదీ సజావుగా లేదు'' అన్నట్లు మాట్లాడతారు. యేనాన్‌లోని పెత్తందారీతనాన్ని సియాన్‌లోని పెత్తందారీతనాన్ని పోల్చి చూడడంలోనూ, వాటి మధ్య వ్యత్యాసాన్ని చూడడంలో విఫలులౌతారు. ఇది మౌలికంగానే తప్పు. రెండవది, విప్లవ శ్రేణుల మధ్యలోనే, తప్పుఒప్పుల మధ్యా, సాధించిన కర్తవ్యాలకు, లోటుపాట్లకు మధ్యా, ఒక స్పష్టమైన వ్యత్యాసాన్ని చూసి, ఈ రెంటిలో ప్రాథమికమైనదేది, ద్వితీయమైనదేది అన్న దాన్ని స్పష్టం చేసుకోవటం అవసరం. ఉదాహరణకు, సాధించిన విజయాలు మొత్తంలో 30 శాతంగా వున్నాయా లేక 70 శాతంగా వున్నాయా? తక్కువ చేసి చెప్పటంగానీ, ఎక్కువ చేసి చెప్పటంగాని కుదరదు. ఒక వ్యక్తి యొక్క పనిని గురించి మనకొక ప్రాథమికమైన అంచనా వుండాలి; అతను సాధించిన విజయాలు 30 శాతంగానూ, అతని లోటుపాట్లు 70 శాతంగానూ వున్నాయా, లేక అట్నుంచి ఇటా అన్నది నిర్ధారించి చూపాలి. అతడు సాధించిన విజయాలు, మొత్తంలో 70 శాతంగా వుంటే అతడి పనిని మనం ప్రాథమికంగా ఒప్పుకోవాలి. సాధించిన విజయాలు ప్రాథమికంగా వున్న పనిని, తప్పులు ప్రాథమికంగా వున్న పనిగా చిత్రించి చెప్పటం పూర్తిగా పొరబాటు. సమస్యలను పరిశీలిస్తున్నపుడు, విప్లవానికీ, ప్రతీఘాత విప్లవానికీ మధ్యన, సాధించిన విజయాలకూ, లోటుపాట్లకూ మధ్యన, ఈ రెండు విభజన రేఖలను గీయటాన్ని మనం మరచిపోకూడదు. ఈ రెండు విచక్షణలను మనం మన మనస్సులో నిల్పుకొంటే, విషయాలకు సంబంధించి మనం సక్రమంగా వ్యవహరించగలుగుతాము; అలా చేయకపోతే, సమస్య స్వభావాన్ని గురించి మనం గందరగోళ పడతాం. శ్రద్ధగా అధ్యయనం చేయడం, విశ్లేషణ చేయడం అన్నవి ఈ విభజన రేఖలను చక్కగా గీయటానికి తప్పనిసరిగా అవసరమవుతాయి. ప్రతి వ్యక్తిపట్లా, ప్రతి విషయంపట్ల, మన వైఖరి విశ్లేషణ, అధ్యయనాలతో కూడినదిగా వుండాలి.

పై పద్ధతులను వినియోగించటం ద్వారా మాత్రమే పార్టీ కమిటీలు, తమ పనిని బాగా నిర్వహించగలుగుతాయని, పొలిటికల్ బ్యూరో సభ్యులు, నేను స్వయంగా కూడా భావిస్తున్నాము. అన్ని స్థాయిలలోని పార్టీ కమిటీలు, పార్టీ కాంగ్రెసులను బాగా నిర్వహించటంతోపాటుగా, తమ నాయకత్వ కర్తవ్యాన్ని కూడా బాగా నిర్వహించటం అన్నది చాలా అవసరమవుతుంది. పార్టీ కమిటీల నాయకత్వపు స్థాయిని మరింత పెంపొందించుకోడానికిగానూ, పని పద్ధతులను అధ్యయనం చేసి, వాటిని సంపూర్ణంగా పెంపొందించుకోటానికి మనం పాటుపడాలి. ★

---

*(...29వ పేజీ తరువాయి)*

అనేకసార్లు కలెక్టరేట్ ముందు అరబిందో, హెటిరో ఫార్మా సెజ్‌ల ముందు ధర్నాలు, రాస్తా రోకోలు, అసెంబ్లీని ముట్టడించే ప్రయత్నాలు చేసి లాఠీ దెబ్బలు తిని, జైళ్ల పాలయ్యారు. ఫ్యాక్టరీల్లో పని చేస్తూనే వున్నా రైతుల నుంచి కార్మికులుగా - కూలీలుగా - బానిసలుగా మారినా పోరుబాట వీడలేదు. ఈ పోరాటాల్లో, జైళ్లల్లో పోలేపల్లి స్త్రీలు పోలీసుల అసభ్య ప్రవర్తనకు, అవమానాలకు గురయ్యారు. ఈ పోరాటం దాదాపు నాలుగు సంవత్సరాలుగా నిరవధికంగా సాగుతున్నది.

ఈ సెజ్‌ల వ్యతిరేక, నిర్వాసీకరణ వ్యతిరేక పోరాటాలపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధం, అణచివేతలను ప్రయోగిస్తున్నది. క్రూరమైన రాజ్య అణచివేతకు వ్యతిరేకంగా మావోయిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలు రక్తసిక్త పోరాటం సాగిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, సింగూర్, లాల్‌గఢ్‌లో సి.పి.ఎం. ఫాసిస్టు మూకలకు వ్యతిరేకంగా, ఝార్ఖండ్‌లో నాగరిక సురక్షా దళ్‌కు వ్యతిరేకంగా, ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుంకు వ్యతిరేకంగా, ఒడిస్సాలో కళింగనగర్, కాశీపూర్, జగత్సింగ్‌పూర్‌లలో నిర్వాసీకరణకు, ఆంధ్రప్రదేశ్‌లో బాక్సైట్ తవ్వకాలు చేస్తున్న నిర్వాసీకరణకు వ్యతిరేకంగా ప్రజలు గొప్ప త్యాగాలతో పోరాడుతున్నారు. ఇవన్నీ రాబోయే రోజుల్లో బద్దలవ్వనున్న పోరాటాలకు నిదర్శనం. ప్రజలు ఒక పక్షం, సామ్రాజ్యవాద సేవలోని క్రూర రాజ్య అణచివేత యంత్రాంగం మరొక పక్షం వున్నాయి. ఈ పోరాటాల మార్గంలో దేశంలోని సెజ్‌ల వ్యతిరేక, నిర్వాసీకరణ వ్యతిరేక పోరాటాలన్నింటిని సమన్వయిస్తూ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటంగా మలిచి, నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమంలో భాగం చేయాలి. ఆ విధంగానే ఆధునిక సామ్రాజ్యవాద పారిశ్రామిక సంస్థానాలను దేశం నుంచి తరిమి వేయటం సాధ్యమవుతుంది.

బంగారు పంటలు పండే పచ్చటి భూముల్ని, జలజల పారే నదుల్ని ప్రజలకు దూరం చేసి, ప్రశాంతమైన పల్లెల్ని ఖాళీ చేయించి, నగర శివార్ల బడుగు బతుకుల్ని దూరంగా విసిరేసి నిర్మిస్తున్న సెజ్‌లన్నీ బడా బాబులకే. సంపద పోగుపడడం, పేదరికం పెరగడం అనే వైరుధ్య పరిష్కారం ప్రజాయుద్ధం ద్వారానే... కోస్తా కారిడార్, కాశీపూర్, కళింగనగర్, నందిగ్రాం, సింగూర్, లాల్‌గఢ్ మార్గంలో ముందుకు మునుముందుకు పోరు సాగాల్సిందే. ★

# అవి ప్రత్యేక ఆర్థిక మండలాలు కావు

# ప్రజా జీవితాల్ని కకావికలం చేసే నయా వలస దోపిడీ రాజ్యాలు

ఈనాడు ప్రపంచమంతటా పాలకులనూ, పాలకుల విధానాలను వీరి ఆలోచనా రీతులను శాసిస్తున్నవి, నడిపిస్తున్నవి పెట్టుబడులు, పెట్టుబడిదారీ శక్తులే. ఇప్పుడు పాలకులు 'అభివృద్ధి' మంత్రాన్ని ఎక్కువగా జపిస్తున్నారు. ఈ రోజున దేశ 'అభివృద్ధి' అన్నప్పుడల్లా పెట్టుబడిదారులకు మాత్రమే ఉపయోగపడే మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడిదారుల సరుకులనూ, సేవలను అమ్ముకోవడానికి పనికి వచ్చే మార్కెట్ల 'అభివృద్ధి' అనేది మనం గుర్తుంచుకోవాలి. నేడు మన ప్రభుత్వాల నూతన అభివృద్ధి సంస్కరణల విధానం స్పష్టంగా దీన్నే తెలియజేస్తోంది. అభివృద్ధి అంటే పచ్చని పంటలతో తులతూగే పల్లె సీమలను విస్తాపనం చేసి వాటి స్థానంలో ధగ ధగ కాంతులతో మెరిసే నక్షత్ర హొటళ్లను, ఐమాక్స్ సినిమా హాళ్లను, టౌన్ షిప్‌లను, హబ్‌లను, పబ్‌లను నిర్మించి కొంత మంది ధనికులకు ఆనంద నిలయాలను తయారు చేయడమే అభివృద్ధిగా చెప్పటం జరుగుతోంది. ఇంకా ఈనాడు దేశ అభివృద్ధి అంటేనే పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షించటం, అభివృద్ధి రేటు పెంచటంగా పాలకులు చూస్తూ, ప్రజలకు చూపిస్తున్నారు. ఇందుకు బలవంతంగా పేద, మధ్య తరగతి రైతుల భూములను లాక్కొని వీరి జీవితాలను నిర్వాసితం చేసి అభివృద్ధి ఫలాలను అందుకోండి అని చెపుతున్నారు. విదేశీ మారకద్రవ్యం కోసం దేశవ్యాప్తంగా లక్షలాది ఎకరాల విస్తీర్ణంలో విదేశీ భూ భాగాలను సృష్టించటమే అభివృద్ధిగా చెపుతున్నారు. ఈనాటి ఈ అభివృద్ధిలో మామూలు మనుషుల జీవితాలకు, అవసరాలకు మానవ విలువలకేమీ చోటు లేదు. పాలకుల, ప్రభుత్వాల ఈ నాటకమంతా అసలైన అభివృద్ధివైపు ప్రజల దృష్టి మళ్లకుండా చేసే ఒక పెద్ద కుట్ర.

ఈ కుట్రలో భాగమే నేడు యు.పి.ఎ. ప్రభుత్వం చట్టంగా ముందుకు తీసుకువచ్చి, శరవేగంగా అమలు చేస్తున్న ఎస్.ఇ.జడ్.లు [స్పెషల్ ఎకనామిక్ జోన్‌లు(సెజ్‌లు)-ప్రత్యేక ఆర్థిక మండలాలు] చైనా వంటి దేశాల్లాగా ఆర్థిక రంగంలో త్వరగా అభివృద్ధి సాధించడానికి, ఎగుమతులు విపరీతంగా పెంచుకోవడానికి చైనాను చూసి భారతదేశం కూడా ఎస్.ఇ.జడ్.లను నిర్మాణం చేస్తున్నట్లు పైకి కనిపించవచ్చుగానీ, నిజానికి 1990ల నుండి నూతన ఆర్థిక విధానాల పేరుతో ఈ దేశంలోకి తీసుకువచ్చిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల్లో భాగమే ఈ ప్రత్యేక ఆర్థిక మండలాలు. 1960ల నాటికి ప్రపంచ వ్యాప్తంగా 10 ఎస్.ఇ.జడ్.లు వుండగా, 1980 నాటికి 47 దేశాల్లో 176కు చేరి, 2000 సంవత్సరం నాటికి 116 దేశాల్లో మూడు వేలకు పై చిలుకు ఎస్.ఇ.జడ్.లు తయారయ్యాయనే విషయాన్ని చూస్తే ఈ ఎస్.ఇ.జడ్.ల విధానం ఇవ్వాల్టికివ్వాళ పుట్టుకొచ్చింది కాదని, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు ముందుకు తీసుకువస్తున్న ఒక విధానంగా అర్థం చేసుకోవచ్చు.

## ఎస్.ఇ.జడ్.లొచ్చి భూమి సమస్యను ప్రబలం చేశాయి

దేశం మొత్తం మీద ఈ సెజ్‌ల వల్ల దాదాపు ఏడు లక్షల ఎకరాల భూములు ఈ కంపెనీల ఆధీనంలోకి పోనున్నాయి. సెజ్ చట్టం ప్రకారం కంపెనీలు తమకు కేటాయించిన భూమిలో 75 శాతం ఇతర (ఉత్పత్తితో సంబంధంలేని) అవసరాల కోసం వాడుకోవచ్చు. ఇదే కంపెనీలకు ప్రధాన ఆకర్షణ అయిపోయింది. సెజ్‌ల కోసం అధికంగా అన్ని సదుపాయాలు గల ప్రధాన నగరాల చుట్టూ వున్న భూముల కోసమే బహుళజాతి కంపెనీలు, పారిశ్రామిక వేత్తలు డిమాండు చేస్తున్నారంటే కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే. సెజ్‌ల కోసం అనుమతి పొందిన వాటిలో 60 శాతం రియల్ ఎస్టేట్ కంపెనీలే. మెర్రిక్ లించ్, గోల్డెన్ ఫాక్స్, జె.పి. మోర్గాన్, వైట్ ఫ్రాంక్ లాంటి బడా విదేశీ బహుళజాతి కంపెనీలు, యూనిటెక్, పార్శ్వనాథ్ లాంటి దేశీయ బడా రియల్ ఎస్టేట్ కంపెనీలు ఇందులో వున్నాయి. ఈ కంపెనీలు భారతదేశంలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఇప్పటికే వందల, వేల కోట్ల లాభాలు సంపాదిస్తున్నాయి. సెజ్‌లకు కేటాయించిన భూముల్లో 76 శాతం అత్యధిక వ్యవసాయ భూమి కలిగి వున్న ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలదే. దేశ ఆహార అవసరాలు తీరుస్తున్న హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో కూడా సెజ్‌ల కోసం వేలాది ఎకరాల పంట భూముల్ని కేటాయించారు. గుజరాత్‌లో మోడి ప్రభుత్వం ఆదాని గ్రూప్ కంపెనీకి ముంద్రా పోర్ట్ సెజ్ కోసం చదరపు గజం యాభై పైసలకు అమ్మింది. ఈ కంపెనీ దాన్ని చదరపు గజం 1200 రూపాయల చొప్పున అమ్ముకుంది. ఈవిధంగా ఇరవై వేల కోట్ల రూపాయల ఖరీదు చేసే భూమిని కేవలం ఎనిమిది కోట్ల రూపాయలకు దక్కించుకుంది.

అడిగినచోటల్లా వందలు, వేల ఎకరాల భూములను ప్రభుత్వమే స్వయంగా సేకరించి ఈ కంపెనీలకు కట్టబెట్టి దళారీగిరి చేయడం

ఇప్పుడు మనం చూస్తున్నాం. ఈ దళారీగిరిలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అగ్రభాగంలో వుంది. ఇప్పటికే అనుమతించిన 77 సెజ్‌లుగాక మరో 12 ఎస్.ఇ.జడ్.లకు అనుమతులిచ్చి దేశంలోనే ప్రథమ స్థానానికి ఎగబాకనుంది. అనుమతించిన ఎస్.ఇ.జడ్.ల కోసం 50 వేల ఎకరాలు సేకరించే పనిలో వుంది. చిత్తూరు, నెల్లూరు, కాకినాడ, విశాఖ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సగభాగం ఇప్పుడు ఈ సెజ్‌ల పడగ నీడలో బిక్కు బిక్కుమంటున్నాయి. ఇక ఎన్నికలు దగ్గర పడటం ప్రజల నిరసన పెరగటంతో తొమ్మిది జిల్లాల సముద్రతీర ప్రాంతంలో ఏర్పాటు చేయతలపెట్టిన కోస్టల్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్‌ను రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం వెనక్కు తీసుకున్నప్పటికీ భూముల సేకరణ కొనసాగుతూనే వుంది. ఇప్పుడు ఎన్నికల్లో గెలిచిన ధైర్యంతో ఎంతకైనా తెగించి అమలు చేయటానికే ఎక్కువ అవకాశాలున్నాయి. అదే జరిగితే మరో లక్షా యాభై వేల ఎకరాలు స్వాహా అవుతాయి.

ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ చుట్టూ ఏర్పాటు అవుతున్న అనేక సెజ్‌లు ఐ.టి.కి సంబంధించినవే. కొద్దిపాటి భూమిలో ఐ.టి. కంపెనీలు ఏర్పాటు చేసే అవకాశం వుండగా, సెజ్ పేరు మీద వందల, వేల ఎకరాలు సొంతం చేసుకుంటున్నాయంటే ఇది రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కాక మరెందుకు? భువనగిరి నుంచి జడ్చర్ల దాకా నగరాన్ని పెంచి మొత్తం హైదరాబాద్ నగరాన్నే ఒక మహా సెజ్‌గా మార్చేసిన వైనం చూస్తే దీని వెనుక భూమి కోసం సాగిన కుట్రలు-కుతంత్రాలు స్పష్టంగా అర్థమవుతాయి. మొత్తం 77 సెజ్‌లలో ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే 33 సెజ్‌లకు అనుమతించడం కూడా ఇందులో భాగమే.

## ప్రజల నీటి సమస్యను పెంచిన ఎస్.ఇ.జడ్.లు

లక్షలాది ఎకరాల భూముల్ని సెజ్‌ల కోసం కేటాయించి, వాటి నీటి అవసరాలు తీర్చడమే ప్రధానంగా మారటంతో, దేశంలో వ్యవసాయానికి, అలాగే ప్రజల తాగునీటి అవసరాలకు తీరని కొరత ఏర్పడుతుంది. వ్యవసాయ భూముల అవసరాలు తీరుస్తున్న భూమిలో వున్న నీటినే కాకుండా, అనేక నదులు, రిజర్వాయర్లు సెజ్‌ల అవసరాల కోసం కేటాయించటంతో మరింత నీటి కొరత ప్రమాదం ముంచుకువస్తోంది.

విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాల వలన 19 నదులు, వాటిపై నిర్మితమైన 27 సాగు, తాగు నీటి ప్రాజెక్టులకు నష్టం కలిగే పరిస్థితి దాపురించింది. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలోని బోడవార గ్రామంలో జిందాల్ కంపెనీ ఏర్పాటు చేయబోతున్న అల్యూమినా రిఫైనరీ కోసం, రైవాడ రిజర్వాయర్ నుంచి రోజుకు 33,600 క్యూబిక్ మీటర్ల నీటిని పైపు లైను ద్వారా సరఫరా చేసేందుకు అంగీకరించారు. రైవాడ నీటిని ఆరు వేల ఎకరాల వ్యవసాయ భూములకు ఇస్తామని గతంలో వాగ్దానం చేసి, ప్రస్తుతం సాగునీటి అవసరాలతోపాటు విశాఖ నగర ప్రజల తాగునీటి అవసరాలు కూడా తీరుస్తున్న రైవాడ నుంచి జిందాల్ కంపెనీకి నీరు ఇస్తే, విశాఖనగర ప్రజలు మంచినీటి కోసం అలమటించే ప్రమాద పరిస్థితి ఎదుర్కోవాలి. విశాఖ జిల్లాలోని మాకవరపాలెంలోని రస్ అల్ ఖైమా అనే కంపెనీ ఏర్పాటు చేయనున్న మరో అల్యూమినా రిఫైనరీకి నీరు సరఫరా జరిగితే ఆ ప్రాంతానికి సాగు, తాగు నీటిని అందిస్తున్న గోస్తనీ నది అదృశ్యమైపోయే ప్రమాదం వుంది.

## సెజ్‌లకు రాయితీలు-ప్రజలకు, ఖజానాకు నష్టాలు

సెజ్‌లు పేద రైతుల పొట్టలు కొట్టి, పెట్టుబడిదారీ కంపెనీలను ప్రోత్సహిస్తున్నాయి. సెజ్‌ల నిబంధనల ప్రకారం ఈ కంపెనీలు పదేళ్లపాటు అందినమేరకు దోపిడికి పాల్పడే అవకాశం ఏర్పడింది. పన్నులు, సుంకాలు, డ్యూటీలు లేకుండా ఇక్కడి వనరులను సరుకులుగా మార్చుకుని విదేశీ విపణికి తరలించుకొని అమ్ముకోవచ్చు. చట్టాలు, శాసనాలు, నీతి నియమాల ప్రమేయం లేకుండా మానవ వనరులు, చౌకగా దొరికే కార్మికుల శ్రమ శక్తిని దోచుకొని సొమ్ము చేసుకోవచ్చు. సెజ్‌లకు వర్తక వాణిజ్యానికి వర్తించే అన్ని రకాల పన్నుల నుంచి, చట్టాల నుంచి మినహాయింపు వుంటుంది. ఉత్పత్తి, వర్తక వాణిజ్యాల నుంచి కంపెనీలు వందల వేలకోట్లు గడిస్తాయి. ఈ సంపదపై ఎలాంటి పన్నులుండవు. దీనివల్ల (కేవలం పన్నుల మినహాయింపు వల్ల) ప్రభుత్వానికీ, 2010 నాటికి దేశానికి కనీసం 1,75,000 కోట్ల రూపాయల నష్టం వాటిల్లబోతున్నదని ఆర్థికశాఖ అంచనా! ఈమేరకు సెజ్‌లు ప్రజలకు రావాల్సిన ఆదాయాన్ని తమ లాభాల ఖాతాలలో జమ చేసుకుంటున్నాయి. సామాన్య ప్రజల కనీస అవసరాలైన కిరోసిన్, డీజిల్, వంట గ్యాస్‌లపై వందల కోట్ల రూపాయలు పన్నులు వేసి వసూలు చేస్తున్న ప్రభుత్వం ఈ పెట్టుబడిదార్ల కోసం మాత్రం లక్షల కోట్లు వదులుకొంటుంది. నిజానికి ఈ పన్నులు వసూలు చేస్తే కనీసం పదేళ్ల పాటు అంతర్జాతీయ రేట్లతో సంబంధం లేకుండా దేశంలో ప్రజలందరికీ నిత్యావసర సరుకులు సగం ధరకే ఇవ్వవచ్చు. దేశంలోని ఆరు కోట్ల మంది నిరుపేదలకు కనీసం ఐదు సంవత్సరాల పాటు ఉపాధి కల్పించవచ్చు.

## గ్రామీణ జీవితం విధ్వంసం

సెజ్‌లు గ్రామీణ సమాజాన్ని విచ్ఛిన్నం చేసి ఆర్థిక వ్యవస్థను కుప్ప కూల్చే వ్యవస్థలుగా మారుతున్నాయి. భూమిలేని గ్రామాలు,

రైతులేని పల్లెలు, పనులులేని పొలాలు, తిండిలేని జనాలతో ఊరు వల్లకాడయిపోతుంటే భూముల ధరల పెరుగుదలతో పరవశు లైపోతున్న వాళ్లు, పరిహారం కోసం పరుగులెత్తుతున్న వాళ్ళూ వున్నారు. వీళ్లంతా 15 శాతంగా వున్న పెద్ద రైతులు, భూస్వాములు. 80 శాతం భూమి వీళ్ల చేతుల్లోనే వుంది. మిగిలిన 85 శాతం మంది భూమిపై ఆధారపడి రక రకాల పనుల ద్వారా తమ శ్రమతో పొలాలు పండిస్తున్న వాళ్లే. వీళ్లకు భూమిలేదు కాబట్టి పరిహారం రాదు. పైగా ఉపాధి ఊడిగిపోతున్నది. తర తరాలుగా వారు నేర్చుకున్న పనులు, నైపుణ్యం, సృష్టించిన పరికరాలు, వారు సంపాదించిన పరిజ్ఞానం, సంస్కృతి, ఆర్థిక, సాంస్కృతిక జీవనాన్ని సెజ్‌లు విచ్ఛిన్నం చేస్తున్నాయి. ఉమ్మడి జీవనానికి వేదికలైన గ్రామ సీమల్లో విధ్వంసం సృష్టిస్తున్నాయి.

సెజ్‌ల మూలంగా వేలాది గ్రామాల్లో ఈ విధ్వంసం ఈ రోజున నిర్విఘ్నంగా సాగిపోతున్నది. భూములతోపాటు చెట్లు, గుట్టలు, చెరువులు, కుంటలు, వాగులు, వంకలు అన్నిటి చుట్టూ కంచెలు మొలుస్తున్నాయి. గోడలు వెలుస్తున్నాయి. పని పాటలు లేని ఇళ్లు స్మశానంలోని సమాధుల్లా కళావిహీనమైపోతున్నాయి. గ్రామంలోని అన్ని వృత్తుల వారు పల్లె పల్లెంతా పరాయిదైపోయిన వైనానికి మౌన ప్రేక్షకులై మిగిలిపోతున్నారు. ఇక దళితుల సంగతి చెప్పలేం. వ్యవసాయ రంగ పరిణామంలో ఒక పని ముట్టుగా మారిపోయి, ప్రతి పనిలో ఇమిడిపోయి, ఆ భూమిలోనే ఇంకిపోయిన దళితుల బతుకు చిత్రాన్ని 'సెజ్'లు శాశ్వతంగా చెరిపేస్తున్నాయి. తమ చెమట చుక్కలతో భూమిని తడిపి సిరులు పండించిన ఈ భూమి పుత్రులు ఇప్పుడు సెజ్‌ల దగ్గర కాపలాకాసే సెక్యూరిటీ గార్డులుగానో, మూటలు మోసే హమాలీలుగానో పోగా మిగిలిన వాళ్లు ఇప్పుడు వలస పక్షులై పట్టణాలకు పోతున్నారు.

ఈ సెజ్‌ల విధ్వంసం, దుర్మార్గానికి రాష్ట్రంలో పోలేపల్లి, కాకినాడ, సత్యవేడు, విశాఖ, నెల్లూరు, అనంతపురం, ఇంకా హైదరాబాద్ చుట్టూ నిర్మాణమవుతున్న సెజ్‌లు, రింగు రోడ్డు కింద నలిగిపోయిన ప్రజల జీవితాలే నిదర్శనం. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల సమీపంలో హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారికి రెండు మూడు కిలోమీటర్ల దూరంలో వున్న మాదిరెడ్డిపల్లె, పోలెపల్లి, గుండ్ల గడ్డ తండాలకు సంబంధించిన 1240 ఎకరాల అసైన్డ్, పట్టాభూముల్ని సెజ్ కోసమని ప్రభుత్వం ఆక్రమించుకుని రెండు ఫార్మాస్యూటికల్ కంపెనీలకు 150 ఎకరాలు అమ్ముకుంది. ఆ ప్రాంతాల్లో ఇంకా అరవై ఫార్మా సెజ్‌లకు ప్రభుత్వం అనుమతినిచ్చింది.

ఈ కంపెనీల వల్ల భూమి కోల్పోయి బతుకుదెరువు మీద ఆశలుడిగిన కొందరు రైతులు, యువకులు ఆ ఫ్యాక్టరీల్లోనే కూలీలుగా, నౌకర్లుగా చేరారు. వీరి పరిస్థితి ఘోరంగా వుంది. వీళ్ల భూమి పోయింది. వీళ్లకు పని ఇవ్వండి అని కలెక్టర్ దగ్గర్నుంచి వర్క్ పర్మిట్ కార్డ్ తెచ్చుకోవాలి. నాలుగు కిలోమీటర్లు నడిచి వుదయం తొమ్మిది గంటలకల్లా పనిలోకి రాకపోతే, ఒక్క నిమిషం లేటైనా హెూం గార్డ్‌లతో బయటికి గెంటిస్తారు. పనిముట్లు, తాగటానికి నీళ్లు కూడా వీళ్లే తెచ్చుకోవాలి. ఈ పని కూడా కాంట్రాక్టు పద్ధతిలో ఇచ్చేదే. దీనికి కూడా స్థానికులకు పోటీగా గుంటూరు, ఒడిస్సా, కేరళ నుంచి కాంట్రాక్టు కూలీలను, కార్మికులను తీసుకువస్తున్నారు. వాళ్లను ఎందుకు తెస్తున్నారని అడిగితే, చేస్తే చేయండి లేకపోతే లేదంటూ బెదిరిస్తారు. ఎదిరించిన వారిని భయపెట్టడానికి మనిషెత్తు కుక్కల్ని కాపలా పెట్టారు.

ఇప్పుడు ఈ రెండు ఫ్యాక్టరీల్లో కార్మికులుగా మారిన రైతులు అదే కష్టాన్ని తమ స్వంత భూముల్లో చేస్తే సంవత్సరానికి సరిపడే కంటే ఎక్కువ పంటను పండించే వాళ్లమని వాపోతున్నారు. ఆరు కాలాలు తమ స్వంత పొలాల్లో ఆముదాలు, కొర్రలు, వరి, కందులు, మినుములు, పత్తిలాంటి ఆయా కాలాల పంటలు పండించుకునే రైతులను తమ భూముల్లోనే వెలసిన ఫ్యాక్టరీల్లో దినసరి కూలీలుగా మార్చేసింది ప్రభుత్వం. ఒకప్పుడు భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు చేసి రైతులు సాధించుకున్న హక్కులు, పెంచుకొన్న కూలీ రేట్లు అన్నీ కోల్పోయి ఇప్పుడు ఈ నయా ఆధునిక భూస్వాముల కాళ్ల మీద పడి ' ఒక పూట పనిప్పియ్యి బాంచెన్' అన్నకాడికే మళ్లీ పరిస్థితిని తీసుకువస్తున్నారు. పాలకులు, విధాన కర్తలు. తమ భూముల్లోనే కూలీలుగా పని చేస్తూ, వాచ్‌మెన్‌లుగా కాపలా కాస్తూ గుండెల్లో లావాలు మోస్తున్నారు పోలేపల్లి, ముదిరెడ్డిపల్లె యువకులు.

ఇక తొమ్మిది జిల్లాల సముద్ర తీర ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న కోస్టల్ ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం ప్రారంభమైతే లక్షలాది ఎకరాల పచ్చని పంట పొలాలు, కొబ్బరి తోటలు, పండ్ల తోటలు నాశనమవుతాయి. సముద్రంలో చేపలవేటపై బతుకుతున్న లక్షలాది తీరప్రాంత మత్స్యకారుల జీవితాలు నాశనమైపోతాయి. కేవలం విశాఖ జిల్లాలోనే తీర ప్రాంతంపై ఆధారపడిన మత్స్యకారులు ఎనభైవేలు వున్నారు. గంగవరం పోర్టు ఒక్కటే వేలాది మత్స్యకారుల జీవితాల్లో నిప్పులు కుమ్మరించింది.

## మహిళలపై సెజ్‌ల ప్రభావం

అది పోలేపల్లి కావచ్చు, కాకినాడ కావచ్చు, సత్యవేడు కావచ్చు ప్రాంతాలు వేరైనా మహిళల బాధలు ఒకటే. సమాజంలో ఇప్పటికే అనేక అసమానతలతో హింసకు గురవుతున్న మహిళల జీవితాలను రాజ్యం అభివృద్ధి పేరుతో అభద్రతా భావంలోకి నెట్టి వేస్తోంది.

నమ్ముకున్న భూమి కోసం మహిళలు అనుభవిస్తున్న బాధలు వర్ణనాతీతం.

మన రాష్ట్రంలో మహిళల జీవితాల్లో చీకట్లనూ, కడగండ్లను నింపి నిస్సహాయ స్థితిలో పడేసిన సెజ్ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల దగ్గర పోలేపల్లి ఎస్.ఇ.జడ్. దాదాపు నలభై కుటుంబాల యజమానులు గుండె బరువెక్కి భూములు పోయాయనే ఆవేదనతో బలవన్మరణం పాలయ్యారు. ఇక్కడి మహిళలు ఆందోళనకరమైన దుస్థితిలో వున్నారు. పోలేపల్లి సెజ్‌తో భూములు కోల్పోయిన ఒక్కొక్కరిది ఒక్కొక్క రకమయిన బాధ. అందరూ బాధితులే. అందుకే న్యాయం కావాలని మహిళలు ఉద్యమిస్తున్నారు.

ఇక విశాఖ జిల్లా అనంతగిరి మండలం, అరకులోయ తదితర ప్రాంతాల్లో బాక్సైట్ తవ్వకాలకు జిందాల్ అల్యూమినా సెజ్ కోసం భూములను అప్పగించడాన్ని వ్యతిరేకించిన ఆదివాసులను అణచడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, చివరికి వాకపల్లి ఆదివాసీ స్త్రీలపై పోలీసులు అత్యంత నీచంగా జరిపిన అత్యాచార సంఘటన రాష్ట్ర ప్రజలకు తెలుసు.

### ప్రభుత్వ పాత్ర, రాజకీయ పార్టీల మద్దతు

ఇంత విధ్వంసానికి కారణమై, ప్రజలకు ప్రత్యక్షంగా నష్టం కలిగిస్తూ, పెట్టుబడిదారులకు లాభాలు కుమ్మరిస్తోన్న ఈ సెజ్‌లను ప్రభుత్వం ఎందుకు ప్రోత్సహిస్తున్నట్లు, ఈ విధానం వల్ల అంతిమంగా ఎవరికి లాభం కలుగుతుంది అన్న విషయం పరిశీలించాలి. ఇది పూర్తిగా రాజకీయ పార్టీలు, ప్రభుత్వంలో వున్న పక్షాలు తమ స్వప్రయోజనాల కోసం విస్తరిస్తోన్న వ్యాపారమని ఇటీవలి విశ్లేషణలు బట్టి అర్థం అవుతోంది. దేశంలోని బడా పారిశ్రామిక సంస్థలు, విదేశీ వాణిజ్య కంపెనీలతో, బహుళజాతి శక్తులతో కలిసి ఈ విధానాన్ని తమకు అనుగుణంగా మార్చుకుంటున్నాయి.

ప్రతిపక్ష పార్టీలు బహిరంగంగా సమర్థించకపోయినా, రాజకీయ పార్టీలన్నింటి మద్దతుతోనే సెజ్ చట్టం మూడంటే మూడు రోజుల్లో చట్టం కాగలిగింది. సీలింగ్ భూముల చట్టాన్ని, 1/70 చట్టాన్ని తుంగలో తొక్కిన ప్రభుత్వాలు ఇప్పుడు తామే పంచిన అసైన్డ్ భూముల్ని గుంజుకోవడానికి అసైన్డ్ భూముల చట్టానికి కూడా

## విజ్ఞప్తి

ప్రియమైన కామ్రేడ్స్,

'క్రాంతి'కి పంపుతున్న అమరవీరుల చరిత్రలు చాలా అసమగ్రంగా ఉంటున్నాయి. కనుక మీరు అమరవీరుల చరిత్రలు రాసేటప్పుడు కింది అంశాలు దృష్టిలో పెట్టుకోగలరు.

అమరుల సొంత పేరు, పార్టీ పేరు; వయసు; జిల్లా, గ్రామం; గ్రామ, ప్రాంత రాజకీయ నేపథ్యం; కుటుంబ ఆర్థిక, రాజకీయ, సామాజిక నేపథ్యం; చదువు, వృత్తి; పార్టీకి పరిచయమైన, రిక్రూట్ అయిన సంవత్సరం, రిక్రూట్ అయిన రంగం; ఉద్యమంలోకి రావడానికి దోహదం చేసిన నేపథ్యం; పార్టీ సభ్యత్వం పొందిన సంవత్సరం; ఏయే సంవత్సరం, ఏయే దళాల్లో, ప్రాంతంలో, బాధ్యతల్లో, స్థాయిల్లో పని చేసినది; పోరాటాలూ, ప్రతిఘటన, ఎన్‌కౌంటర్లలో నిర్వహించిన పాత్ర; రాజకీయ రంగంలో కృషి; అధ్యయనం, బోధన వంటి అంశాల్లో వున్న సామర్థ్యాలు; కళా, సాహితీ, టెక్నికల్ వంటి రంగాల్లో అభిరుచీ, కృషి; వ్యక్తిగత జీవితం, స్వభావం; అమరత్వపు తేదీ, నెల, సంవత్సరం; అమరత్వపు ఘటన వివరాలు వంటి అంశాలు వచ్చే విధంగా క్లుప్తంగా రాయగలరు.

అమరుల చరిత్రతో పాటు ఫోటో (వుంటే) తప్పక జత చేయండి. ఫోటో వెనుక పేరు రాయాలి.

**గమనిక:** ఈ విజ్ఞప్తిని ఎల్లప్పుడూ మీ వద్ద భద్రపరుచుకోగలరు.

సవరణలు చేస్తున్నాయి. ఈ రోజున భూమి లాభాలు సంపాదించి పెట్టే వ్యాపార సరుకు. విదేశీ, స్వదేశీ బహుళజాతి కంపెనీలతో, పెట్టుబడిదారులతో కలిసి లాభాలు సంపాదించి పెట్టే ఈ భూములను కాజేయటానికి అధికార ప్రతిపక్ష పార్టీలనే తేడా లేకుండా అన్ని రాజకీయ పార్టీలు తెగబడుతున్నాయి. హైదరాబాద్ చుట్టూ వున్న వేలాది ఎకరాల భూముల్ని ఆక్రమించుకోవటంలో ఇది మనకు స్పష్టంగా అర్థం అవుతుంది. సెజ్ చట్టం అడ్డుపెట్టుకుని తమ బంధువులు, భాగస్వాములతో వ్యాపారాలు ప్రారంభించిన నేతలు సెజ్‌ల పేరుతో దరఖాస్తులు చేసుకొని నగరం చుట్టూ వున్న ప్రభుత్వ, బంజరు భూములను ఆక్రమించుకోవటంతో పాటు, రైతుల నుంచి అతి తక్కువ ధరకు భూములు సేకరించుకోగలిగారు. సత్యం, ఇందు, లాంకో వంటి కంపెనీలు ప్రారభించిన సెజ్‌లు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఈ కోవకే చెందుతాయి.

తమ ప్రాజెక్టుల అమలు కోసం కొనసాగించే భూసేకరణకు వ్యతిరేకంగా ముందుకొచ్చే ఉద్యమాలను అణచడానికి అత్యంత క్రూర అణచివేత యంత్రాంగాన్ని ఉపయోగించడానికి భారత పాలక వర్గాలు, వారి సామ్రాజ్యవాద యజమానులు నిర్ణయించుకున్నారు. ప్రభుత్వం, పోలీసులు, పారామిలిటరీ బలగాలు, స్థానిక గూండాలు, పాలకవర్గ తొత్తులు, ప్రాజెక్టుల్లో పాల్గొంటున్న ప్రయివేట్ కంపెనీలు అంతా కలిసి విభజించి-పాలించే ఎత్తుగడల ద్వారా నిర్వాసీకరణకు వ్యతిరేకంగా బద్ధలయి కొనసాగుతున్న పోరాటాలను అణచివేయ ప్రయత్నిస్తున్నారు.

## నిరర్థకమవుతున్న కార్మిక చట్టాలు, హక్కులు; కార్మికవర్గ దృక్పథంలేని కార్మిక సంఘాలు

కార్మికులు ప్రమాదంలో మరణించినా, మహిళా కార్మికులపై లైంగిక అత్యాచారం జరిగినా సరే, రాష్ట్ర ప్రభుత్వ పోలీసులు ఈ నయా విదేశీ సంస్థానాల్లో పర్మిషన్ తీసుకొని, వాళ్ల అనుమతిస్తేనే లోపలికి వెళ్లాలి. కాని కంపెనీలో కార్మికులు ఆందోళన చేస్తే అణచివేయడానికి పోలీసులను తెచ్చుకొనేటప్పుడు ఏ అనుమతులు అవసరంలేదు. మూడు రోజుల కూలి ఇవ్వలేదని అడిగినందుకు ఒడిస్సా నుంచి వలస వచ్చిన కార్మికున్ని పోలేపల్లి ఫార్మసెజ్‌లో

# విజ్ఞప్తి

ప్రియమైన కామ్రేడ్స్,

'క్రాంతి'కి పంపుతున్న పోరాట/ప్రతిఘటన/ఆందోళన/సభలూ-సమావేశాల నివేదికలు చాలా అసమగ్రంగా ఉంటున్నాయి. కనుక ఒక్కోసారి అవి ప్రచురణ సాధ్యం కావడం లేదు.

కనుక నివేదికలలో పోరాటం/ప్రతిఘటన/ఆందోళన/సభలూ-సమావేశాలు జరిగిన తేదీ, నెల, సంవత్సరం; జిల్లా, గ్రామాల పేర్లు; ఏ దళ ఆధ్వర్యంలో జరిగినదీ రాయాలి (దళ, ప్రాంతాల పేర్లు పొడి అక్షరాల్లో రాయవద్దు). ఈ పోరాటాల సందర్భంగా చేపట్టిన కరపత్రాలూ, పోస్టర్లూ, పత్రికా ప్రకటనలు వంటి ప్రచార రూపాలను కూడా పేర్కొనాలి. వీటిల్లో పాల్గొన్న ప్రజల సంఖ్యనూ, వారిలోనూ మహిళల సంఖ్యను ప్రత్యేకంగా పేర్కొనాలి. ప్రజల పాత్రను నిర్దిష్టంగా పేర్కొనాలి. ప్రజా వ్యతిరేకులపై భౌతిక చర్యలు తీసుకున్న నివేదికలు రాస్తున్నప్పుడు, ఆ చర్యలకంటే ముందు వారిపై చేసిన హెచ్చరికల వంటి పోరాట రూపాలను పేర్కొనాలి. వీటిలోనూ ప్రజల పాత్రను పేర్కొనాలి.

నివేదికలతో పాటు ఫోటోలు (వుంటే) తప్పక జత చేయగలరు. ఫోటో వెనుక వివరాలు రాయగలరు.

**గమనిక:** ఈ విజ్ఞప్తిని ఎల్లప్పుడూ మీ వద్ద భద్రపరుచుకోగలరు.

కంపెనీ యాజమాన్యం రక్తాలు కారేవరకు కొట్టిన సంఘటన, నెల్లూరు జిల్లాలోని తడ వద్ద వున్న అపాచీ సెజ్‌లో మహిళా కార్మికులపై జరుగుతున్న అకృత్యాలే సెజ్‌లలో కార్మికుల దుస్థితికి నిదర్శనం. కార్మికుల పాలిట ఎంత ఘోరంగా వున్నాయో యాజమాన్యం పాలిట అంత అనుకూలంగా వున్నాయి సెజ్ చట్టాలు.

ఇక కార్మిక సంఘ హక్కుల చట్టం నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సెజ్‌లకు ఇచ్చిన మినహాయింపు వల్ల కార్మికశాఖ ఉనికి ప్రశ్నార్థకమై పోతున్నది. వందల సంవత్సరాలుగా అంతర్జాతీయంగాను, మన దేశంలోను కార్మికవర్గం బలితర్పణం చేసి పోరాడి సాధించుకున్న సంఘటిత హక్కు, సంఘాలు పెట్టుకునే హక్కు, కనీస పని గంటలు, ఉద్యోగ ఉపాధి, వేతన హక్కులను సెజ్ చట్టం కాలరాస్తున్నది.

బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి కాళ్లూ చేతులు ఆడకుండ చేసిన భారతకార్మిక వర్గం ఈనాడు తమ కనీస హక్కులను కాలరాస్తున్న సెజ్ చట్టాన్ని వ్యతిరేకించలేని స్థితిలో వుండటానికి జాతీయ స్థాయి కార్మిక సంఘాల కార్మికవర్గేతర దృక్పధమే కారణం. ఇప్పుడు భారత పార్లమెంటు చేసిన కార్మిక వ్యతిరేక చట్టాలను ఇవి ప్రశ్నించలేని దౌర్భాగ్య స్థితిలో వున్నాయి. ఎందుకంటే ఏ.ఐ.టి.యు.సి., టి.ఎన్.టి.యు.సి., బి.ఎం.సి., సి.ఐ.టి.యు. మొదలైన జాతీయ స్థాయి ప్రధాన స్రవంతి కార్మిక సంఘాలు ఏదో ఒక పాలక పార్టీకి అనుబంధ సంఘాలే. సెజ్ చట్టాన్ని పార్లమెంటులో వ్యతిరేకించకుండా ఆమోదించి, సామ్రాజ్యవాద ప్రయోజనాలకు ఊడిగం చేస్తున్న ఈ పాలకవర్గ పార్టీలకు అనుగుణంగానే వీటి అనుబంధ జాతీయ కార్మిక సంఘాల వైఖరీ వుంటున్నది.

## సెజ్‌లకు, నిర్వాసీకరణకు వ్యతిరేకంగా ప్రజల పోరాటాలు

సెజ్‌లకు, వాటి వల్ల జరుగుతున్న నిర్వాసీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బాధితులు పోరాటాలు సాగిస్తున్నారు. తమ పంట భూముల్ని రసాయన పరిశ్రమల సెజ్‌కు అప్పగించడానికి వ్యతిరేకంగా నిలబడిన నందిగ్రామ్ ప్రజలపై పశ్చిమ బెంగాల్‌లో సి.పి.ఐ.(ఎం) సోషల్ ఫాసిస్టు ప్రభుత్వం మారణకాండ సాగించి వందలాది ప్రాణాలు బలిగొని, పది వేల మందిని నిర్వాసితుల్ని చేసింది. ఇంతటి మారణకాండను కూడా ఎదిరించి, రక్త తర్పణంతో ఈ సెజ్‌ను అడ్డుకుంటూ నందిగ్రామ్ ప్రజలు వీరోచిత పోరాటం సాగిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో సింగూరు ప్రజలు టాటా కార్ల కంపెనీని పశ్చిమ బెంగాల్ నుంచి తరిమివేశారు. నందిగ్రామ్, సింగూరు ప్రజలు సెజ్‌ల వ్యతిరేక పోరాటంలో భారత ప్రజలందరికీ మార్గదర్శకం అయ్యారు. రాజస్థాన్‌లో అల్వార్ జిల్లాలో ఆరు వేల హెక్టార్ల భూమిని ఒక మాక్సిసెజ్‌కు కేటాయించడానికి వ్యతిరేకంగా ఆ ప్రాంత ప్రజలు 'జనాధికార యాత్ర' పేరుతో నిరసన ప్రదర్శనలు, ఊరేగింపులు జరిపారు. ముంబాయి శివార్లలో రిలయన్స్ కంపెనీకి 35 వేల ఎకరాలు కేటాయించడానికి వ్యతిరేకంగా 30 వేల మంది ప్రజలు నిరసన ప్రదర్శన జరిపి 'మేం విదర్భ రైతుల్లాగా ఆత్మహత్యలు చేసుకోదలుచుకోలేదు. మేం రైతులం. భూమి కోసం ప్రాణాలైనా అర్పిస్తాం. బ్రిటీష్ సామ్రాజ్యవాదుల్ని గడగడలాడించిన చరిత్ర మాకుంది' అని హెచ్చరిస్తున్నారు. 35 వేల మంది తలా ఒక్కొక్క రూపాయి వేసుకుని 35 వేలకు చెక్ తీసుకొని కంపెనీ యాజమాన్యానికి పంపిస్తూ "మీరు మా తల్లి లాంటి భూమిని అమ్మమంటున్నారు. మేము మీ తల్లి గారినే కొనాలనుకుంటున్నాం. ఈ చెక్ తీసుకొని మీ తల్లి గారిని మాకు అమ్మండి" అని అడుగుతున్నామని, భూముల్ని ఎట్టి పరిస్థితుల్లోను వదలబోమని చెప్పారు. గోవా, కర్నాటక, ఒడిస్సాలలో ప్రజల విజయాలు మనకు తెలిసినవే.

ఇక మన రాష్ట్రంలో విశాఖ జిల్లా మాకవరపాలెంలో జిందాల్ అల్యూమినా రిఫైనరీకి 1300 ఎకరాలు కేటాయించడానికి వ్యతిరేకంగా ప్రజలు తీవ్ర పోరాటం కొనసాగిస్తున్నారు. సర్వే కోసం వచ్చిన యూనివర్సల్ టెక్నికల్ సర్వీసెస్ సిబ్బందిపై ఆదివాసీ మహిళలు దాడి చేసి, వారి యంత్ర సామగ్రిని, వాహనాల్ని ధ్వంసం చేసి నిరసన తెలిపారు. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలో బొడ్డవార గ్రామంలో జిందాల్ అల్యూమినా రిఫైనరీకి వ్యతిరేకంగా కలెక్టర్ నిర్వహించిన ప్రజాభిప్రాయ సదస్సులలో ప్రజలు ఏకకంఠంతో వ్యతిరేకత తెలియజేశారు. విశాఖ జిల్లాలో బాక్సైట్ గనుల తవ్వకానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ఆదివాసులను అణచివేసేందుకు ఆదివాసీ మహిళలపై పోలీసులు అత్యాచారాలకు పాల్పడినా వెరవక, 'మా ఊర్లలోకి అడుగు పెట్టిన పోలీసులను నరుకుతాం' అంటూ బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటం సాగిస్తున్నారు. కోస్టల్ ఇండస్ట్రియల్ కారిడార్‌కు వ్యతిరేకంగా కోస్తాంధ్ర 9 జిల్లాల ప్రజల ఐక్య సంఘటన (కోస్టల్ ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణ వ్యతిరేక పోరాట కమిటీ) జరిపిన పోరాటానికి ప్రభుత్వం ఈ ప్రతిపాదన విరమించుకుంది.

కాకినాడ సెజ్‌కు వ్యతిరేకంగా 'కాకినాడ సెజ్ వ్యతిరేక యువజన సమాఖ్య', 'కాకినాడ సెజ్ వ్యతిరేక మహిళా సంఘం' వారు సెజ్‌ల నిర్మాణాలను ధ్వంసం చేయటం వంటి కార్యక్రమాలు కొనసాగించారు. ఎస్.ఇ.జడ్‌లు సృష్టిస్తున్న ఈ దుర్మార్గానికి, విధ్వంసానికి వ్యతిరేకంగా పోలేపల్లి ప్రజలు తమ భూముల కోసం

*(మిగితాది 23వ పేజీలో...)*

# పెట్టుబడి లాభాపేక్షలో చితికిపోతున్న చేనేత బతుకులు

## ఆత్మహత్యలకు దారితీస్తోన్న పాలక విధానాలు

'మీకు బట్టకట్టడం తెలియక ముందే మా దేశంలో అగ్గిపెట్టెలో ఇమిడే వస్త్రాల్ని తయారు చేశాం' అని సినిమాలో అల్లూరి, రూథర్‌ఫర్డ్‌తో అంటుంటే మన గుండె ఉప్పొంగుతుంది. మన కళ్ళు గర్వంతో మెరుస్తాయి. ఇంతలా మనం ఉప్పొంగే నాగరికతకూ, గర్వపడే సంస్కృతికీ దారులు వేసిన చేనేతకారులను తలుచుకొని మన శిరసు వినమ్రంగా వాలుతుంది.

మన దేశ చేనేత వస్త్ర కళా నైపుణ్యాల గురించి మనం గొప్ప చెప్పుకోవడం కాదు. ఎప్పుడో ప్రపంచమే అబ్బురంగా చెప్పుకుంది. వుంగరంలో దూర్చగలిగేంత సున్నితమైన, సుందరమైన వస్త్రాలను నేయగల్గిన నేర్పరులని 9వ శతాబ్దంలోనే అరబ్బులు మన చేనేత కళనూ, చేనేత కారులనూ మెచ్చుకున్నారు. 19వ శతాబ్దంలో 'ది టెక్స్‌టైల్ మాన్యుఫాక్చరర్ అండ్ కాస్టింగ్ ఆఫ్ ది పీపుల్ ఆఫ్ ఇండియా' అనే పుస్తకంలో మిల్లు పరిశ్రమ ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ ఇంత సున్నితమైన వస్త్రాలను తయారుచేయడం సంశయాత్మకం అని వాట్సన్ రాశాడు. మన దేశీయ పత్తిని వడికి చేతి మగ్గంపై నేసిన వస్త్రాలకు అతనిచ్చిన కితాబు అది.

ఈస్ట్ ఇండియా కంపెనీ మన చేనేత వస్త్రాలను కొని విదేశాల్లో అమ్మడం ద్వారా ఎన్నో లాభాలను పొందిందంటే విదేశాల్లోనూ మన వస్త్రాలకున్న డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. మన వస్త్ర నైపుణ్యంతో పోటీ పడలేక ఇంగ్లాండ్ వర్తకులు మన దేశ వస్త్రాల దిగుమతిని నిరోధించాలని డిమాండ్ చేయడంతో ఇంగ్లాండ్ పార్లమెంట్ భారతదేశ వస్త్రాలను నిరోధించే అయిదు శాసనాలు చేసింది. మన చేనేత నైపుణ్యాన్ని చూసి సామ్రాజ్యవాదం భయపడిన తీరు అది.

చేనేత ఒక కళగా, పడుగు-పేకల అద్భుత మేళవింపుగా మనసులను రంజింప చేయడమేకాదు; ఒక సరుకుగా గతంలో భారత ఆర్థిక వ్యవస్థలో ప్రధాన భూమికను పోషించడమే కాదు; జాతీయోద్యమ కాలంలో స్వదేశీ భావనను పెంపొందింప చేయడంలోనూ చేనేత తగిన పాత్ర పోషించింది. ఆనాడు విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో భాగంగా చేనేత వస్త్రాలు ధరించడం, రాట్నంపై నూలు వడకడం అనేది ఒక పోరాట విలువగా, ఒక స్వాభిమాన ప్రకటనగా ఉండింది. రాట్నం ఆనాడు జాతీయోద్యమ చిహ్నమైంది.

అంతేకాదు చేనేత ప్రాముఖ్యత ఇంకా వుంది. వ్యవసాయం తర్వాత గ్రామీణ ప్రాంతంలో ఎక్కువగా ఉపాధి కల్పిస్తోన్న రంగం చేనేత. దేశంలో 1.24 కోట్ల మందికి, రాష్ట్రంలో 15 లక్షల మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తోంది. విశేషంగా చెప్పుకోవాల్సిన మరొక విషయమేమంటే 62.5 శాతం మహిళలు ఈ రంగంలో ఉపాధిని పొందుతున్నారు. అంటే మహిళలకు అధిక ఉపాధిని కల్పిస్తున్న ఏకైక రంగం ఇదే. ఒక అత్యాధునిక పవర్‌లూం (మర మగ్గం) ఖరీదు ఒక కోటి రూపాయలు వుంటే దీనిపైన ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇద్దరికి మాత్రమే ఉపాధి దొరుకుతుంది. ఒక రోజుకు 1500 చదరపు మీటర్ల వస్త్రం ఉత్పత్తి అవుతుంది. అదే కోటి రూపాయల పెట్టుబడితో వెయ్యి చేతి మగ్గాలు ఏర్పాటు చేయవచ్చు. ప్రత్యక్షంగా, పరోక్షంగా కనీసం మూడు వేల మందికి ఉపాధి కల్పించవచ్చు. రోజుకు ఆరు వేల చదరపు మీటర్ల వస్త్రం ఉత్పత్తి చేయవచ్చు. రాష్ట్రంలో తాజా లెక్కల ప్రకారం 77 వేల మరమగ్గాలు ఉన్నాయి. వీటి ద్వారా 30-40 వేల మంది ఉపాధి పొందుతున్నారు. అలాగే నాలుగున్నర లక్షల చేతి మగ్గాలున్నాయి. వీటిద్వారా 15 లక్షల మంది ఉపాధిని పొందుతున్నారు. ఇలా ఉపాధి కోణం నుండి చూసినపుడు చేతి మగ్గాలు ఎంత ప్రయోజనకరమో అర్థమవుతుంది. ఉత్పాదక సామర్థ్యాన్ని లెక్కలు వేసినా చేతి మగ్గాలను చిన్న చూపు చూడనవసరం లేదు. అంతేకాదు యంత్రాలు కాలుష్యాన్ని కల్గిస్తే చేతి మగ్గాలు పర్యావరణానికి ఎటువంటి హానినీ కల్గించవు. మిల్లు బట్టలతో పోలిస్తే చేనేత బట్టలు చవకగా వుండి పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో వుంటాయి. చేనేత నాణ్యత,కళాత్మకత, సృజనాత్మకతల గురించి కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆధునిక వస్త్ర పరిశ్రమతో గట్టి పోటీని ఎదుర్కుంటూ, చేనేత నిలబడి వుందంటే దానికున్న ఈ ప్రత్యేకతలే కారణం. ఈ ప్రత్యేకతలను కోరుకునే ప్రజల మక్కువే చేనేతను నిలబెడుతున్నది. మిల్లుల్లో తయారయ్యే బట్టలను చేనేతలని అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసి వ్యాపారులు లాభాలు పొందుతున్నారంటే చేనేతకు వున్న ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. చేతి మగ్గాల మీద తయారైన డిజైన్లనే మిల్లులు కాపీ కొడుతున్నాయంటే చేనేతలోని కళాత్మకతనూ,సృజనాత్మకతనూ అర్థం చేసుకోవచ్చు.

ఇంతలా దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన, దేశభక్తిని పెంపొందించిన, సామ్రాజ్యవాదులను భయపెట్టిన ముఖ్యమైన

వుపాధి రంగంగా వున్న చేనేత రంగం నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో గత పదేళ్ల నుంచీ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఆ రంగంపై ఆధారపడిన ప్రజల స్థితిగతులు రోజు రోజుకూ దిగజారిపోతున్నాయి. ఆకలి, అనారోగ్యం, అప్పులతో అల్లాడిపోతున్నారు. పొట్ట చేత పట్టుకొని వలసపోతున్నారు. అన్ని దారులు మూసుకుపోయాయని భావించినవారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతుల ఆత్మహత్యలకే కాదు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికుల ఆత్మహత్యలకూ ప్రసిద్ధి చెందింది. ఒక్క సిరిసిల్లాలోనే గత పదేళ్లుగా అయిదు వందలకు పైగా నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఇక ఆ అయిదు వందల ప్రాణాల మీద ఆధారపడిన మరెన్ని వేల ప్రాణాలు గాల్లో దీపాలైనాయో!

బ్రిటీష్ సామ్రాజ్యవాదం తన సరుకులకు మార్కెట్‌ను పెంచుకోవడం కోసం మన దేశంలో చేతి వృత్తులను ధ్వంసం చేసిందనీ, అందులో భాగంగా చేతి వృత్తికారుల చేతులను పరమ క్రూరంగా నరికి వేసిందనీ, చరిత్రను గుర్తు తెచ్చుకుంటే మన హృదయం దహించుకుపోతుంది. కానీ ప్రస్తుత 'స్వదేశీ' పాలకులూ అదే చేస్తున్నారు. సామ్రాజ్యవాదులకూ, దళారీ పెట్టుబడిదారులకూ లాభాలను సమకూర్చడంలో భాగంగా చేతి వృత్తులను ధ్వంసం చేస్తున్నారు. 1940 నాటికి దేశంలో చేతి వృత్తులపై ఆధారపడుతున్న ప్రజలు 40 శాతం ఉంటే నేడు రెండు శాతం వున్నారు.

చేనేత రంగాన్ని కూడా పాలకవర్గాలు ఇలాగే దెబ్బతీస్తున్నాయి. నాటి బ్రిటీష్ పాలకులకు వస్త్ర వ్యాపారమే ప్రధానంగా వుండేది. అందుకని వాళ్లు తయారు చేసిన వస్త్రాలను ఇక్కడ అమ్ముకోవడం కోసం ఇక్కడి చేనేత రంగాన్ని రక రకాల విధానాల ద్వారా దెబ్బ తీశారు. నేటి 'స్వదేశీ' పాలకులు సైతం సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేర్చడంలో భాగంగా మిల్లు, పవర్‌లూం రంగాలకు పెద్ద పీట వేస్తూ చేనేత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోన్నారు. ఒక్క పవర్ లూం పన్నెండు మంది చేనేత కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తుందని 1974లో శివరామన్ కమిటీ వెల్లడించింది. కానీ ప్రభుత్వాలు ఇటువంటి నిర్ధారణలనేమీ లెక్కలోకి తీసుకోవడంలేదు. ప్రభుత్వాలు చేనేతను ఉపాధి ప్రాతిపదికగా చూడకుండా ఉత్పత్తి ప్రాతిపదికగా చూస్తున్నాయి. అందుకే పవర్ లూం రంగం నుండి చేనేతను రక్షించవల్సిన ప్రభుత్వాలు చేనేతకు ఆధునిక వస్త్ర పరిశ్రమలతో అనైతిక పోటీ పెట్టి చేనేత పనికిరానిదని తేల్చేస్తున్నాయి.

చేనేత పట్ల ఈ దృక్పథాన్ని కల్గి వున్న ప్రభుత్వాలు జౌళి రంగాన్ని అభివృద్ధి చేయడానికంటూ తీసుకుంటున్న చర్యలన్నీ చేనేతకు గొడ్డలిపెట్టుగానే వుంటున్నాయి. 1985లో ప్రవేశపెట్టిన నూతన జౌళి విధానం చేనేత రంగాన్ని తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టివేసింది. ఈ విధానంలో భాగంగా పవర్‌లూమ్ ఏర్పాటుకు నిబంధనలు సడలించింది. విదేశాల నుండి నూలునూ, పత్తినీ దిగుమతి చేసుకోవడంలో ఆంక్షలను తొలగించింది. విదేశాల నుండి జౌళి యంత్రాలు అడ్డూ అదుపు లేకుండా దిగుమతి కావడం మొదలైంది. విదేశీ యంత్రాలకనుగుణంగా మన దేశీయ పత్తి, నూలు లేకపోవడంతో పత్తి, నూలు దిగుమతులు పెరిగిపోయాయి. యంత్రాలు పెరగడం వల్ల చేతి మగ్గాలు గణనీయంగా తగ్గిపోయాయి. 1985 నాటికి 48 లక్షలు వున్న మగ్గాలు 1986 నాటికి 43 లక్షలకు తగ్గిపోయాయి. అంతేకాదు పత్తి, నూలును ఏ ఆంక్షలూ లేకుండా దిగుమతి చేసుకోవడం వల్ల దేశంలో పత్తి ధరలు తగ్గిపోయి పత్తిరైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నష్టాలను తట్టుకోలేక రైతాంగం ఆందోళనా స్థాయిలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ జౌళి విధానం పట్ల వ్యతిరేకతను తగ్గించడం కోసం చేనేత రంగ ప్రయోజనాలను కాపాడ్డానికంటూ ప్రభుత్వం చేనేత ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టం-1985ను చేసింది. ఈ చట్టం ప్రకారం 22 రకాలను చేనేత రంగానికి కేటాయించింది. అంటే ఈ రకాలను మిల్లు, పవర్‌లూం రంగాల్లో తయారు చేయకూడదు. దీనితో పాటు 50 శాతం చిలపల నూలు తయారు చేయాలని కూడా చట్టం చేసింది. చిలపల నూలు చేనేత రంగంలో ఉపయోగిస్తారు. కానీ 1995లోనే చేనేతకు కేటాయించిన 22 రకాలను 11 రకాలకు కుదించారు. ఈ జౌళి విధానం వల్ల చేనేత పరిశ్రమే కాక మొత్తంగా యాంత్రీకరణ పెరిగి జౌళి పరిశ్రమల్లోని అనేక మంది కార్మికులు వీధులపాలయ్యారు.

2000లో తెచ్చిన జాతీయ జౌళి విధానం చేనేతను మరింత సంక్షోభంలో పడవేసింది. ఈ విధానం సత్యం కమిటీ ప్రతిపాదనలపై ఆధారపడి తయారైంది. సత్యం కమిటీ చేనేత రంగానికి నష్టాన్ని చేకూర్చే అనేక ప్రతిపాదనలు చేసింది. చేనేతకు అవసరమైన 50 శాతం చిలపల నూలును తయారు చేయాలనే నిబంధనను సడలించింది. దీనివల్ల పేద చేనేత కార్మికులు అధిక ధరలకు కోన్ నూలును కొనాల్సి వస్తోంది. కోన్ నూలును పెద్ద మిల్లులు తయారు చేస్తాయి. ఈ మిల్లుల ప్రయోజనాలు చేకూర్చడానికే ప్రభుత్వం ఈ నిబంధనను సడలించింది. చేనేత పరిశ్రమకు కేటాయించిన 22 రకాలను తొలగించకపోతే జౌళి రంగం అభివృద్ధి చెందదనీ పవర్ లూమ్స్‌కు, మిల్లులకు కూడా ఆ రిజర్వేషన్ రకాలు తయారు చేయడానికి అనుమతినివ్వాలని, అంతేగాక చేనేత పని వారందరినీ పవర్‌లూమ్ రంగానికి మార్చాలనీ ఈ కమీషన్ సూచన చేసింది. అంటే చేనేత రంగం ఇక పనికి రాదని తేల్చి చెప్పినట్టు. ఈ రంగంపై ఆధార పడుతున్న వారిని మిల్లు, పవర్‌లూంలకు తరలించడమంటే,

ఇళ్ల వద్ద తమ సొంత ఉత్పత్తి సాధనాలతో శ్రమ చేసే చేనేత కార్మికులు ఉత్పత్తి సాధనాలను కోల్పోయి కూలీలుగా మారాలి. అంటే కుటీర పరిశ్రమల్లో స్వతంత్రంగా పని చేసుకుంటున్న వారిని శ్రమ శక్తి అమ్ముకునే కూలీలుగా మార్చుతుంది. ఈ విధంగా ప్రభుత్వం చేనేత ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత నుండి తప్పుకుంటూ పోటీని తట్టుకోవడం పేరుతో చేనేతను దెబ్బతీస్తోంది.

ఈ విధానంలో భాగంగా పత్తి, నూలు, దుస్తులు, యంత్రాలు మొదలైన వాటి దిగుమతులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా చేయడమంటే మన దేశ జౌళి రంగాన్ని సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేయడమే. అంతేగాక టెక్నాలజీ అభివృద్ధి పేరుతో 25 వేల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఇవి అతి పేద చేనేత కార్మికులకు కూడా ఉపయోగపడుతాయని చెప్పినప్పటికీ ఈ నిధులు కేవలం బహుళజాతి కంపెనీలకూ, దళారీ పెట్టుబడిదారులకూ ఉపయోగపడ్డం కోసమే.

2004లో నేతకారుల సమస్యలపై నియమించిన ఎం.ఎల్.ఎ.ల కమిటీ కూడా మిల్లు, పవర్‌లూం రంగాల పోటీకి చేనేత తట్టుకోలేదు కాబట్టి ఈ రంగంలోని యువకులు, మహిళలను వేరే రంగాలకు మార్చాలని తెలిపింది..

ఇలా ప్రభుత్వం వేసిన కమిటీలన్నీ చేనేత ఉనికిని దెబ్బతీసే ప్రతిపాదనలు చేస్తున్నాయి. అసలు ఇలాంటి నిర్ధారణలు చేయించడానికే ప్రభుత్వాలు ఈ కమిటీలను నియమిస్తున్నాయి. ప్రస్తుతం కూడా చేనేత రంగ అధ్యయనానికి రోశయ్య అధ్యక్షతన ప్రభుత్వం ఒక మంత్రుల బృందాన్ని నియమించింది. ఇది కూడా పాత కమిటీల బాటలోనే ప్రతిపాదనలు చేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

వస్త్ర పరిశ్రమలో పెట్టుబడులు పెట్టిన బహుళజాతి కంపెనీలకూ, దళారీ పెట్టుబడిదారులకు ప్రయోజనాలను చేకూర్చడం కోసం చేనేతను దెబ్బతీయడానికి ప్రభుత్వాలు ఇంతగా ప్రయత్నిస్తున్నాయి. వస్త్ర ఉత్పత్తిలో చేనేత రంగం 22.46 శాతం వాటాను కల్గి వుంది. దేశ ఎగుమతులలోనూ దాని వాటా 15 శాతం వుంది. 145 దేశాలకు చేనేత వస్త్రాలు ఎగుమతి అవుతున్నాయి. మరి ఈ వాటాలను బహుళజాతి కంపెనీలు కైవసం చేసుకోవాలంటే చేనేతను పూర్తిగా దెబ్బతీయాల్సిందే. ప్రభుత్వాలకు కావాల్సింది పెట్టుబడిదారులకు పాదసేవ చేయడమే తప్ప చేనేతపై ఆధారపడిన ఎన్ని లక్షల జీవితాలు అతలాకుతలమయినా వాటికి చీమకుట్టదు.

కేటాయిస్తోన్న నిధులను చూసినా చేనేత పట్ల ప్రభుత్వ వైఖరి అర్థమవుతుంది. జౌళి రంగం నుండి చేనేతకు రావలసిన నిధుల వాటా 30 శాతం. కానీ ప్రభుత్వాలు గత అనేక సంవత్సరాలుగా చేనేత రంగానికి 6-7 శాతం మాత్రమే కేటాయిస్తోన్నాయి. ఇందులో ఖర్చు చేస్తున్నది 2 శాతం మాత్రమే. ప్రతీ యేటా బడ్జెట్‌లో చేనేతకు కేటాయింపు 0.1 శాతానికి మించడం లేదు. చేనేతపై ఇంతగా కక్షగట్టిన ప్రభుత్వాలు మిల్లు, పవర్ లూంలకు మాత్రం 25-75 శాతం పెట్టుబడి రాయితీ కల్పిస్తున్నాయి. భూమిని, నీరును వుచితంగా అందిస్తున్నాయి. విద్యుత్‌లో 50 శాతం రాయితీ కల్పిస్తున్నాయి. మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాయి. ఎగుమతులను ప్రోత్సహిస్తున్నాయి. చేనేతకు అవసరమైన చిలపల నూలు ఉత్పత్తికి కోతలు విధిస్తూ, మిల్లులకు అవసరమైన కోను నూలుపై ఎక్సైజ్ సుంకం ఎత్తివేస్తున్నాయి. అంతేకాదు చేనేతకు రిజర్వ్ చేసిన రకాలను కూడా మిల్లులు తయారు చేస్తూ చట్టాలను అతిక్రమిస్తోంటే ప్రభుత్వాలు ఏ చర్యలూ తీసుకోవడం లేదు.

ఇలా చేనేతను దెబ్బతీస్తున్న ప్రభుత్వాలు తమ ఓట్ల రాజకీయాల్లో భాగంగా కొన్ని కంటి తుడుపు చర్యలను ప్రకటిస్తున్నాయి. వీటిల్లో టెక్స్‌టైల్ పార్కులు ఒకటి. రాష్ట్రంలో అక్కడక్కడా ఏర్పాటు చేస్తోన్న ఈ టెక్స్‌టైల్ పార్కుల్లో చేనేతకారులకు ఉపాధి కల్పిస్తామని ఊదరగొడుతున్నాయి. కానీ ఈ హైటెక్ నేత పార్కుల్లో లభించే ఉపాధి నామమాత్రం కాగా, బహుళజాతి కంపెనీలకు ఈ పార్కులు కనక వర్షం కురిపిస్తాయి.

చేనేతను ఆదుకోవడం కోసం అంటూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కో, చేనేత సహకార సంఘాలు కూడా అవినీతి రాజకీయాల్లో కూరుకుపోయి చేనేతకు నష్టాన్నే చేశాయి.

చేనేత పట్ల అన్ని పార్టీల వైఖరి ఒక్కతీరుగానే ఉంది. చేనేత వునికికి తీవ్ర విఘాతంగా మారిన జౌళి విధానం -1985 ను రాజీవ్‌గాంధీ ప్రభుత్వం తీసుకువస్తే, మరింత వినాశకరమైన జౌళి విధానం - 2000 ను ఎన్.డి.ఎ. ప్రభుత్వం తీసుకువచ్చింది. రాష్ట్రంలో కూడా ఈ ఎన్నికల సందర్భంగా చేనేత గురించి వాపోయిన తెలుగుదేశం పార్టీ తన పాలనలో దాన్ని దెబ్బతీసే చర్యలెన్నింటినో తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ అదే దారిలో నడుస్తోంది. ఈ ఎన్నికల సందర్భంగా బాగా చర్చకు వచ్చినందువల్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రంగంపై అధ్యయనం కోసమంటూ మంత్రులతో ఒక కమిటీని నియమించినప్పటికీ మొత్తంగా ఈ రంగంపై దాని వైఖరి ఏం మారలేదని ఈ బడ్జెట్‌లో చేనేతకు కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుంది.

➡

# బహుముఖ ప్రజ్ఞాశాలి, జిజ్ఞాసాపరుడు

# కామ్రేడ్ సంజీవ్‌కు జోహార్లు!

కామ్రేడ్ సంజీవ్‌ది అనంతపురం జిల్లా. దాదాపు 40 సంవత్సరాల వయసుంటుంది. 1990 తర్వాత పార్టీలో వచ్చిన సంక్షోభ సమయంలో కె.ఎస్.-బండయ్యలు కుట్ర పూరితంగా పార్టీని చీల్చుతున్నారన్న వాస్తవం తనకు అర్థం కావడానికి సమయం తీసుకుంది. అసలు విషయం అర్థమయిన తర్వాత మాత్రం కామ్రేడ్ సంజీవ్ విప్లవోద్యమం పట్ల సైద్ధాంతిక నిబద్ధత కలిగి, నిర్మాణ క్రమశిక్షణతో మొక్కవోని దీక్షతో అవిశ్రాంతంగా కృషి చేశాడు. అనంతపురం నుండి బదిలీ అయి, ఒక దశాబ్ద కాలం నల్లమల ప్రాంతంలో దళసభ్యుడిగా, కమాండర్‌గా మహానంది ఏరియాలో పనిచేసి అక్కడే డివిజనల్ కమిటీ సభ్యుడుగా ఎదిగాడు.

శ్రీశైలంకు సమీపంలో వుండే మహానంది ఏరియాలో భూస్వామ్య, రాయలసీమ (కర్నూలు) ఫ్యాక్షన్ వ్యతిరేక పోరాటాలను నడిపాడు. భూ పోరాటాలు, కూలీరేట్ల పోరాటాలతో పాటు అడవిలో జీవిస్తున్న చెంచు ఆదివాసీల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేపట్టాడు. ప్రభుత్వం తలపెట్టిన టైగర్ ప్రాజెక్ట్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలను సంఘటితం చేసి ప్రదర్శనలు, ఆందోళనలు నిర్వహించాడు. తునికాకు, వెదురుకూలీ రేట్ల పెరుగుదల కోసం ప్రజలతో పోరాటాలు చేయించాడు. ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగాను నంద్యాల ప్రాంత ప్రజల వివిధ రకాల సమస్యల పరిష్కారంలోను మంచి కృషి చేశాడు. నల్లమల డివిజన్‌లో జరిగిన అనేక దాడుల్లో, మిలిటెంట్ చర్యల్లో చురుగ్గా పాల్గొన్నాడు.

చాలా సంవత్సరాలుగా ప్రజా సంఘాల, ఐక్యవేదికల కార్యకలాపాల మీద దృష్టి పెట్టి రాష్ట్రంలో విప్లవ కార్మికోద్యమ నిర్మాణానికి ప్రత్యేకంగా కేంద్రీకరించి పనిచేశాడు. తనకున్న చొరవ, కలుపుగోలుతనం, రాజకీయ పరిణితి ఆ రంగంలో మంచి ఫలితాలను తెచ్చింది. రాష్ట్రంలో వై.ఎస్.ఆర్. ప్రభుత్వం అమలు చేస్తున్న పాశవిక హత్యాకాండలో నాయకత్వం అమరులు కావడం, ఉద్యమం నష్టాలు పొందడంతో కామ్రేడ్ సంజీవ్ మరింత పట్టుదలతో తన పనిని అత్యంత రహస్యంగా కొనసాగించాడు. కొత్తగా ఏర్పడిన స్పెషల్ కమిటీ గైడెన్స్‌లో పని చేస్తున్న కామ్రేడ్ సంజీవ్‌ను 2009 జనవరి 15వ తేదీన ఎ.పి.ఎస్.ఐ.బి. పోలీసులు పట్టుకొని చిత్ర హింసలు పెట్టి హత్య చేశారు.

కామ్రేడ్ సంజీవ్‌ను హత్యచేసి, ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలంలో జరిగిన ఎదురుకాల్పుల్లో చనిపోయినట్టుగా కట్టు కథ అల్లడంతో పాటు కామ్రేడ్ అశోక్ అని పేరు మార్చి ప్రజలను ఏమార్చారు. కామ్రేడ్ సంజీవ్ సహచరి సరెండర్ అయినపుడు ఈ బూటకపు ఎన్‌కౌంటర్ కథను బయటపెట్టింది. విప్లవకారులను హత్యచేసి తప్పుడు ప్రకటనలు ఇవ్వడం పోలీసులకు మామూలు విషయమయింది.

కామ్రేడ్ సంజీవ్ నిత్యం నవ్వుతూ, స్నేహ భావంతో అందరితో కలిసి పోయే మృదు స్వభావి. జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలను బాగా చదవడమే కాకుండా నిరంతరం చర్చిస్తూ ఉండేవాడు. పార్టీ అంతర్గత చర్చల్లో చురుగ్గా పాల్గొనే సంజీవ్ తపన, పట్టుదల కర్తవ్య నిర్వహణ అకుంఠిత దీక్ష మనకు ఆదర్శం కావాలి. అనంతపురం నుండి నల్లమల మీదుగా ఆంధ్ర రాష్ట్ర కార్మికోద్యమ ప్రస్థానాన్ని రెండు దశాబ్దాల కాలం నడిపిన కామ్రేడ్ సంజీవ్ మనకు మార్గదర్శి.

★

---

➡


ఈ ప్రభుత్వ వినాశకర విధానాల నుండి చేనేతను కాపాడుకోవాలి. చేనేతను కాపాడుకోవడమంటే దానితో పెనవేసుకుపోయిన లక్షలాది జీవితాలను కాపాడుకోవడం. మన దేశ సంస్కృతి, నాగరికతలను తీర్చి దిద్దడంలో ముఖ్య భూమికను పోషించిన ఒక అమూల్యనిధిని కాపాడుకోవడం. కళనూ, సృజనాత్మకతనూ వాటి పట్ల ప్రజలకుండే అభిరుచినీ కాపాడుకోవడం. సామాన్య ప్రజల వస్త్ర అవసరాలను తీర్చే ఒక వనరును కాపాడుకోవడం.

దీన్ని కాపాడుకోవాలంటే నిరాశా, నిస్పృహలకు గురవుతున్న, చివరకు ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్న చేనేతకారులు పోరుబాట పట్టాలి. సామ్రాజ్యవాద మార్కెట్‌కూ బహుళ జాతి కంపెనీలూ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకూ, వాటికి కొమ్ముగాస్తున్న ప్రభుత్వాలకూ వ్యతిరేకంగా పోరాడాలి. ఈ పోరాటం ఒక్క చేనేతకారులదే కాకూడదు, దేశ సార్వభౌమత్వాన్నీ, స్వావలంబననూ ప్రజల సంస్కృతిని కోరుకునే వారందరిదీ కావాలి.

★

పుస్తక పరిచయం

# లాటిన్ అమెరికా ప్రజల స్వేచ్ఛా గీతిక "చే గెవారా"




గెరిల్లా యుద్ధ చరిత్రలో చే గెవారాకు ఒక ప్రత్యేకమైన స్థానం వుంది. ఆయన అవలంభించిన పంథాలో లోపాలుండవచ్చు కానీ ఆయనలోని సామ్రాజ్యవాద వ్యతిరేకత, అంతర్జాతీయత, పోరాట పటిమ, కష్ట సహిష్ణత, దృఢనిశ్చయం, సేవాతత్పరత, నిరాడంబరత, వర్గ దృక్పథం, మానవీయత, ప్రేమస్పద స్వభావం ఎన్నదగినవి. పోరాటకారులందరికీ శిరోధార్యమైనవి. కాత్యాయని రాసిన 'ప్రవహించే ఉత్తేజం చేగెవారా' అనే పుస్తకం ఆయన వ్యక్తిత్వంలోని అనేక పార్శ్వాలను కళ్లకు కడుతుంది. ఈ పుస్తకాన్ని 2006లో హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురించింది.

లాటిన్ అమెరికా దేశమైన అర్జెంటీనాలోని రోజారియో పట్టణంలో 1928 జూన్ 14న చే గెవారా పుట్టాడు. ఆయన అసలు పేరు ఎర్నెస్తో గెవారా ద లాసెర్నా. ఆయన తల్లి సెలియా ద లాసెర్నాది విశిష్టమైన వ్యక్తిత్వం. స్వేచ్ఛా భావాలు కల్గినది. మహిళా హక్కుల ఉద్యమాల్లో పాల్గొన్నది. ఆ రోజుల్లో అబ్బాయిల్లాగా జుట్టు కత్తిరించుకుని, వీధుల్లో స్వయంగా కారు నడుపుకుంటూ వెళ్లగలిగిన మొదటి అర్జెంటినా మహిళ ఆమె. అలా ఆనాటి ఉన్నత వర్గాల్లో ఆవిడొక కొరకరాని కొయ్య. చే గెవారా తండ్రి ఎర్నెస్తో గెవారా లించ్‌కు మాత్రం సెలియా స్వేచ్ఛా ప్రవృత్తి అంటే గొప్ప ఆరాధన. వాళ్లిద్దరి మొదటి సంతానం చే గెవారా వ్యక్తిత్వంపై తల్లి ప్రభావం బలంగా పడింది.

చే గెవారాకు చిన్నప్పటి నుండీ తీవ్రమైన అస్తమా వుండేది. ఆ వ్యాధి అతన్ని అనేక సందర్భాల్లో మృత్యు ముఖంలోకి తీసికెళ్లింది. ఆ వ్యాధి వల్ల ఎక్కువగా మంచం మీదే ఉండాల్సి రావడంతో పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకున్నాడు. పుస్తకాలు అతనిలోని జిజ్ఞాసను మేల్కొల్పాయి. పదకొండేళ్లకే సిగ్మండ్ ఫ్రాయిడ్ పుస్తకాలను చదివి వ్యాఖ్యానిస్తూ పలువురిని ఆశ్చర్యంలో ముంచెత్తేవాడు. ఆరోగ్యం బాగా వున్న సమయాల్లో ఆటల్లోనూ చురుగ్గా పాల్గొనేవాడు. చదరంగం, ఫుట్‌బాల్ అతనికి ఇష్టమైన ఆటలు.

చిన్నప్పుడు స్పెయిన్ అంతర్యుద్ధం గురించి తండ్రి చెప్పిన మాటలు అతనిలో హత్తుకుపోయాయి. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో అర్జెంటీనాలో నాజీ వ్యతిరేక కూటమికి సంఘీభావంగా ఏర్పడిన 'యాక్షన్ అర్జెంటీనా' అనే సంఘంలో తండ్రి పని చేయడాన్ని చే గెవారా అందరికీ గర్వంగా చెప్పుకునేవాడు. లాటిన్ అమెరికా దేశాల్లోని నియంతల పాలన చిన్నతనం నుంచీ తనలో అశాంతిని రేకెత్తించేది.

మంచి డాక్టరై ప్రజలకు సేవ చెయ్యాలనే ఉద్దేశ్యంతో మెడిసిన్‌లో చేరాడు. ఆ రోజుల్లోనే ఆయనకు సైకిల్ ప్రయాణమంటే సరదా మొదలైంది. సైకిల్ మీద దేశాలు పర్యటించాలనే కోరికతో మరో మిత్రుడితో కల్సి ఎనిమిది నెలల పాటు చిలీ, పెరూ, కొలంబియా, వెనిజుయెలా, మియామిల్లో పర్యటించాడు. ఆ సమయంలో ఆ దేశాల్లోని పీడిత ప్రజల దుర్భర పరిస్థితులనూ, నియంతల నిరంకుశ పాలనను మరింత స్పష్టంగా అర్థం చేసుకొని కదిలిపోయాడు. ఈ పర్యటనలోనే ఆయన విప్లవకారుడిగా మారడానికి పునాదులు పడ్డాయి. ఈ పర్యటనలో ఉన్నప్పుడే "నేనెప్పుడూ ఈ ప్రజల పక్షానే ఉండాలని నిశ్చయించుకున్నాను'' అని డైరీలో రాసుకున్నాడు. బొలీవియా రాజకీయ చరిత్రను ఆసక్తితో అధ్యయనం చేశాడు. పర్యటన తర్వాత తిరిగి చదువు మీద శ్రద్ధ పెట్టి మెడిసిన్ పూర్తి చేశాడు. ఆ తర్వాత బొలీవియాకు వెళ్లాడు. అప్పటికి బొలీవియాలో నేషనల్ రివల్యూషనరీ మూవ్‌మెంట్ అనే సంస్థ చేసిన తిరుగుబాటు విజయవంతమై ఆ సంస్థ ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వం ఏర్పడింది. ఆ ప్రభుత్వం కొన్ని ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టింది. చేగెవారా ఆ దేశానికి తన వంతు సహాయాన్ని అందించే ఉద్దేశంతో అక్కడికి వెళ్లాడు. కానీ కొత్త ప్రభుత్వం తీరు తెన్నులను చూస్తే అతని ఆశలు సన్నగిల్లాయి. సామ్రాజ్యవాదులను ఎదిరించి ఒక ప్రగతిశీల వ్యవస్థను స్థాపించే సమర్థతలు ఆ ప్రభుత్వానికి లేవని అర్థం చేసుకున్నాడు. దానితో అతను కోస్తారికా అనే దేశానికి వెళ్లాడు. అక్కడ అతనికి క్యూబన్ విప్లవకారులు పరిచయమయ్యారు. వారి ద్వారా ఆయన క్యూబన్ విప్లవం గురించి వివరంగా తెల్సుకున్నాడు. ఆ తర్వాత మెక్సికో వెళ్లిన చేకు ఫిడెల్ క్యాస్ట్రో, రాహుల్ క్యాస్ట్రోలు పరిచయమయ్యారు. అప్పటికి వాళ్లు క్యూబాలో నిరంకుశ బతిస్తా పాలనకు వ్యతిరేకంగా విప్లవోద్యమ నిర్మాణానికి కృషి చేస్తున్నారు. చే గెవారా వాళ్లతో కల్సాడు. మెక్సికోలోనే వాళ్లంతా మిలటరీ శిక్షణను పొందారు. కొన్ని ఆయుధాలనూ, డబ్బులనూ సేకరించుకున్నారు. ఈ మిలటరీ శిక్షణలోనే ఎర్నెస్తో గెవారా చే గెవారాగా మారాడు.

అర్జెంటీనా భాషలో చే అనేది పలకరింపు మాట. తను ఎవరితో మాట్లాడినా చే అని మొదలుపెట్టడం వల్ల క్యూబన్లంతా ఆయనను చే గెవారా అని పిలిచేవారు.

1956 నవంబర్ 25న మెక్సికో నుండి ఎనభై రెండు మంది ఒక నావలో తుపాకులు తదితర సామాగ్రితో క్యూబాకు బయల్దేరారు. వారిలో చే ఒక్కడే విదేశీయుడు. అప్పటికి చేకు పెళ్లయింది. ఏడు నెలల కూతురు కూడా వుంది. వాళ్లను వదిలి చే తన లక్ష్య సాధనలో ముందుకు సాగాడు. క్యూబా తీరాన అడుగుపెట్టగానే వాళ్ల మీద కాల్పులు మొదలయ్యాయి. విమానాల నుండి బాంబుల దాడి మొదలైంది. చేకు తీవ్రమైన అస్తమా ఎటాక్ వచ్చింది. అయినప్పటికీ శత్రువును ప్రతిఘటిస్తూ, నష్టాలకు వెరవకుండా ముందుకు సాగారు.




మొదట్లో చే దళంలో డాక్టర్‌గా సేవలందించాడు. ఫిదెల్‌కు సలహాదారుగా వున్నాడు. ఫిదెల్ తీసుకునే ప్రతి నిర్ణయంలో చేకు పాత్ర వుంది. గాయపడిన గెరిల్లాకే కాక గాయపడ్డ శత్రు సైనికులకూ వైద్యం చేసేవాడు. ప్రజలకు వైద్యం చేస్తూ వారి ఆదరాభిమానాలను విశేషంగా చూరగొని ఉద్యమానికి ప్రజా పునాదిని కూడగట్టడంలో విశేషమైన పాత్రను పోషించాడు.

బతిస్తా సేనను దెబ్బతీస్తూ, విజయాలు సాధిస్తూ, ఆయుధాలనూ సమకూర్చుకుంటూ ఫిదెల్ నాయకత్వంలోని విప్లవసేన పెరిగింది. కొద్ది రోజులకు 75 మంది సమర్థవంతులైన గెరిల్లాలను ఎంపిక చేసి 2వ నెంబర్ దళాన్ని ఏర్పాటు చేశారు. దానికి చే నాయకుడయ్యాడు. మొదట్లో ఒకసారి చేకు నాయకత్వ బాధ్యతలు ఇవ్వడం గురించిన ప్రస్తావన వచ్చినపుడు ఆయన విదేశీయత చర్చ వచ్చింది. కానీ ఇప్పుడిక చే విదేశీయత గురించి ఎవరూ పట్టించుకోలేదు. అందరూ ఆనందంగా ఆయన నాయకత్వాన్ని ఆమోదించారు. అంతగా ఆయనను క్యూబన్‌లు సొంతం చేసుకున్నారు.

తన దళాన్ని సాహసోపేతంగా ముందుకు నడిపిస్తూ శత్రువుపై దాడులు చేస్తూ, శత్రు దాడులను తిప్పికొడుతూ, విజయాలు సాధిస్తూ, నష్టాలను భరిస్తూ చే దళం ప్రస్థానం కొనసాగించింది. చే దళ సభ్యులందరితోనూ ప్రేమాస్పదంగా ఉండేవాడు. వాళ్ల అవసరాలను శ్రద్ధగా పట్టించుకునేవాడు. వాళ్లకు చదువు చెప్పడం, రాజకీయంగా అభివృద్ధి చేయడంపై శ్రద్ధ పెట్టేవాడు. అదే సమయంలో క్రమశిక్షణను అమలు చేయడంలో చాలా కఠినంగా ఉండేవాడు.

యుద్ధ రంగంలో తలమునకలవుతూనే స్టెన్సిల్‌తో ఒక పత్రికను నడిపేవాడు. ఆ పత్రిక కోసం ఎన్నో విశ్లేషణాత్మక వ్యాసాలు రాసేవాడు. ఎంతో శ్రమకోర్చి రేడియో స్టేషన్‌ను ఏర్పాటు చేశాడు. ఆయన చొరవతో ఆయుధాల తయారీ కేంద్రం కూడా ఏర్పాటైంది. పలు మిలటరీ రచనలు చేశాడు. గెరిల్లా వార్‌ఫేర్ మాన్యువల్‌ను రాశాడు.

ఎంత అనారోగ్యంగా వున్నా ఆయన ప్రత్యేకతలు కోరుకునే వాడుకాదు. నాయకులకూ, సభ్యులకు మధ్య తేడాలు ఉండడాన్ని ఇష్టపడేవాడు కాదు.

ఇలా క్యాడర్‌కూ, ప్రజలకూ అభిమానపాత్రుడైన చే ను పచ్చి నెత్తురు తాగేవాడిగా అభివర్ణిస్తూ బతిస్తా ప్రభుత్వం దుష్ప్రచారం చేసేది.

మిలటరీ పరంగా సమర్థతలు నిరూపించుకున్న చే రాజకీయంగా కూడా స్పష్టతను కల్గి వుండేవాడు. పత్రికను నడిపే క్రమంలో ఆయన మార్క్సిజాన్ని అధ్యయనం చేశాడు. కమ్యూనిస్టు వ్యవస్థ మాత్రమే పీడిత ప్రజల సమస్యలను పరిష్కరిస్తుందని నిర్ధారణకు వచ్చాడు. ఆయన ఫిదెల్‌ను కూడా బూర్జువా వామపక్ష నాయకుడిగానే గుర్తిస్తున్నానన్నాడు. క్యూబాలోని వివిధ ప్రగతిశీల ఉద్యమాల మధ్య ఒక ఐక్యతను తీసుకురావడానికి విశేష కృషి చేశాడు. అదే సమయంలో ఆ వుద్యమాల్లోని బలహీనతలను నిశితంగా విమర్శించేవాడు. మొత్తంగా విప్లవోద్యమ కృషి వల్ల క్యూబాలో విప్లవం విజయవంతమైంది. ఫిదెల్ నాయకత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వంలో చే కీలక పాత్ర పోషించాడు. దేశాన్ని పునర్నిర్మించడానికి తన శక్తి యుక్తులను పూర్తిగా అంకితం చేశాడు. దేశంలో వ్యవసాయ విప్లవాన్ని విజయవంతం చేయాలని నొక్కి చెప్పాడు. ప్రభుత్వంలో పలు బాధ్యతలను నిర్వహించిన ఆయన రాయబారిగానూ వున్నాడు. ఆ సమయంలో క్యూబా పునర్నిర్మాణానికి సహాయం కోరడానికి పలు దేశాల్లో పర్యటించాడు. అందులో భాగంగా సోవియట్ యూనియన్‌కు వెళ్లిన చే ఆ దేశం తిరోగమనంలో ప్రయాణిస్తోందని గుర్తించాడు. బహిరంగంగానే

విమర్శించాడు. ఈ విషయంలో ఫిదెల్‌తో కూడా ఘర్షణకు దిగాడు. మావో నాయకత్వంలోని చైనా సరైన పంథాలో ప్రయాణిస్తోందని అవగతం చేసుకున్నాడు. భారతదేశానికి వచ్చినపుడు నెహ్రూ 'సోషలిజాన్ని' కూడా విమర్శించాడు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వివిధ లాటిన్ అమెరికన్ ఉద్యమ సంస్థల మధ్య ఐక్యతను తీసుకురావడానికి ప్రయత్నించాడు. ప్రభుత్వంలో ప్రధాన పాత్ర వహిస్తున్నప్పటికీ చే ఎంతో నిరాడంబరంగా వుండేవాడు. బయటకు వెళ్లినప్పుడు ఆయన జేబులో కాఫీకి డబ్బులు కూడా వుండకపోవడం పలువురిని ఆశ్చర్యపరిచేది.

పునర్నిర్మితమవుతున్న క్యూబాను లొంగదీసుకోవడానికి అమెరికా దాడి చేసింది. ఆ దాడిని తిప్పికొట్టడానికి ప్రభుత్వ నిర్వహణలో తలమునకలవుతున్న చే మరోసారి తుపాకీ పట్టి మేజర్‌గా తన సేనను యుద్ధ రంగంలోకి నడిపించాడు. ఈ పోరాటంలో తీవ్రంగా గాయపడ్డాడు. శస్త్ర చికిత్స చేయించుకుని పూర్తిగా కోలుకోకుండానే మళ్లీ యుద్ధ రంగంలోకి వెళ్లి అమెరికాను ఓడించి విజయాన్ని సాధించడంలో ముఖ్యపాత్ర పోషించాడు.


విప్లవం విజయవంతం అయిన తర్వాత తన భార్యతో విడాకులు తీసుకున్నాడు. ఆమె ఆయన దారిలో నడవడానికి సిద్ధపడలేదు. అందుకని ఇద్దరూ స్నేహితులుగానే విడిపోయారు. ఆ తర్వాత తనతోపాటు పని చేసిన అలైదా అనే పోరాటకారిణిని పెళ్లి చేసుకున్నాడు. వాళ్లకు నల్గురు పిల్లలు పుట్టారు.

1965 ఫిబ్రవరి 24న అల్జీరియాలో 'ఆఫ్రో-ఏషియన్ సాలిడారిటీ' అనే సంస్థ నిర్వహించిన సమావేశంలో చే ప్రసంగించాడు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న జాతి విముక్తి పోరాటాలన్నింటికీ సహకరించమని సోషలిస్టు దేశాలకు విజ్ఞప్తి చేశాడు. ఈ సందర్భంలో సోవియట్ యూనియన్‌ను ఘాటుగా విమర్శించాడు. తిరిగొచ్చిన చే పై ఫిదెల్ మండిపడ్డాడు, అలా మాట్లాడినందుకు. అయినా చే తన అభిప్రాయంపై దృఢంగా నిలబడ్డాడు.

ఆ తర్వాత కాంగోకు వెళ్లాడు. అక్కడ విప్లవోద్యమం నిర్మించడానికి కృషి చేసి విఫలమై బొలీవియాకు వెళ్లాడు. అక్కడ కూడా విప్లవోద్యమాన్ని నిర్మించే కృషి చేశాడు. ఒక సాయుధ నిర్మాణాన్ని ఏర్పాటు చేశాడు. దుర్భర పరిస్థితుల నడుమ మొక్కవోని దీక్షతో తన కృషిని కొనసాగించాడు. ఈ కృషిలో వుండగానే ప్రభుత్వ సేనలకు చిక్కాడు. 1967 అక్టోబర్ 9న ప్రభుత్వం అతన్ని క్రూరంగా కాల్చి చంపింది.

చే భౌతికంగా మరణించినా లాటిన్ అమెరికా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

కాంగోలో కానీ బొలీవియాలో కానీ విప్లవం విజయవంతం కావడానికి పరిస్థితులు అనుకూలంగా లేవని ఇతరులు వారించినా చే పెడచెవిని పెట్టాడు. ఏ దేశంలో విప్లవం విజయవంతం కావాలన్నా ఆ దేశ భౌతిక పరిస్థితులే కీలకపాత్ర వహిస్తాయనే విషయాన్ని చే పట్టించుకోలేదు. బయటి నుంచి వెళ్లి విప్లవ వెల్లువను సృష్టించగలమనే తప్పుడు అవగాహనకు లోనయ్యాడు. తన అవగాహనలో ఈ లోపాలున్నప్పటికీ చే నుండి నేర్చుకోవాల్సిన విషయాలు ఎన్నో వున్నాయి. ముఖ్యంగా గెరిల్లా పోరాటంలో కొనసాగాలంటే మానసికంగా, శారీరకంగా ఎంత దృఢత్వం, అంకితభావం, కష్ట సహిష్ణత వుండాలో అవగాహన చేసుకోవడానికి ఈ పుస్తకం చక్కగా దోహదపడుతుంది. కనుక చే గెవారాను తప్పక చదువుదాం. ★




**ఆంధ్రప్రదేశ్ స్పెషల్ కమిటీ అమరుల జీవిత చరిత్రల పుస్తకం వెలువడింది.**

**చదవండి!**

# పి. ఎల్. జి. ఎ. ప్రతిఘటనా పరంపర

ఝార్ఖండ్ రాష్ట్రంలో జూన్ 12న పి.ఎల్.జి.ఎ. చేసిన ఒక ఆంబుష్‌లో 10 మంది పోలీసులు చనిపోగా, 9 మంది పోలీసులు గాయపడ్డారు. జూన్ 23న పలాము జిల్లాలో ఒక పంచాయితీ ఆఫీసును పేల్చివేశారు. బీహార్‌లో నలుగురు కామ్రేడ్స్‌ను వాయిదా కోసం కోర్టుకు తీసికెళ్లిన సమయంలో, ఎస్కార్ట్ పోలీసుల మీద పి.ఎల్.జి.ఎ. సభ్యులు దాడి చేసి నల్గురు కామ్రేడ్స్‌నూ విడిపించుకున్నారు.

ఎ.ఒ.బి.లో కోరాపుట్ జిల్లాలోని సాలూరు ప్రాంతంలో జూన్ 18న పి.ఎల్.జి.ఎ. దళం ఒక పోలీసు వాహనాన్ని పేల్చివేయగా అందులో వున్న 10 మంది పోలీసులూ ప్రాణాలు కోల్పోయారు. జూన్ 23న ఇదే జిల్లాలో ఒక ఫారెస్ట్ బిల్డింగ్‌ను పేల్చివేసి రికార్డులను ఎత్తుకెళ్లారు. సునాబెడాలో ఇదే రోజున నల్గురు పోలీసులను పి.ఎల్.జి.ఎ. అరెస్టు చేసి ఆ తర్వాత వదిలేసింది. జూలై 17న ఒరిస్సాలోని సుందర్‌గఢ్ జిల్లాలో పేలుడు పదార్థాలతో ప్రయాణిస్తోన్న ఒక వాహనాన్ని పి.ఎల్.జి.ఎ. స్వాధీనం చేసుకుంది. దానికి ఎస్కార్ట్‌గా వెళ్తున్న వారిలో ఒక ఎస్.ఐ.ని కిడ్నాప్ చేసింది. ఆ తర్వాత కూంబింగ్‌కు వచ్చిన సి.ఆర్.పి.ఎఫ్. పోలీసులపై చేసిన ఆంబుష్‌లో ఒక కానిస్టేబుల్ చనిపోయాడు. ఆ తర్వాత కిడ్నాప్ చేసిన ఎస్.ఐ.ని కూడా పి.ఎల్.జి.ఎ. ఖతం చేసింది.

డీకేలో మే 17న దక్షిణ బస్తర్ కిష్టారం ఏరియా పాలోడు-కరిగూడెం గ్రామాలకు కూంబింగ్‌కు వచ్చిన 150 మంది పోలీసులపై పి.ఎల్.జి.ఎ. బలగాలు చేసిన దాడిలో ముగ్గురు కోయ కమాండోలు చనిపోయారు. ఒక ఎస్.ఎల్.ఆర్. ఎల్.ఎం.జి., ఒక ఎ.కె.-47, ఒక ఎస్.ఎల్.ఆర్. పి.ఎల్.జి.ఎ. స్వాధీనమయ్యాయి. జూన్ 19న లోహండిగూడలో ఒక కాంగ్రెస్ నాయకున్ని పి.ఎల్.జి.ఎ. బలగాలు కాల్చి చంపాయి. ఇదే రోజు బీజాపూర్ జిల్లాలో కిడ్నాప్ చేసిన ఇద్దరు పోలీసులను చంపేశారు. జూన్ 20న దర్భా డివిజన్‌లోని కోక్కవడగావ్ వద్ద పోలీసు వాహనాన్ని పేల్చివేయగా 11 మంది పోలీసులు చనిపోయారు. ఎనిమిది మంది పోలీసులు గాయపడ్డారు. ఈ ఘటనకు ప్రతీకారంగా ఏడు మంది అమాయక ప్రజలను చంపి పోలీసుల ప్రతిఘటనలో నక్సలైట్లు చనిపోయారని కట్టు కథలల్లారు. జూన్ 12న రాజ్‌నంద్‌గావ్ జిల్లాలోని మాన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని మదన్‌వాడ గ్రామ సమీపంలో పి.ఎల్.జి.ఎ. ఒకే రోజున చేసిన మూడు సాహసోపేత ఆంబుష్‌లలో 29 మంది పోలీసులు చనిపోయారు. 12 మందికి పైగా పోలీసులు గాయపడ్డారు. చనిపోయిన వారిలో క్రూరుడిగా పేరుగాంచిన జిల్లా ఎస్.పి. వినోద్ కుమార్ చౌబే కూడా ఉన్నాడు. ఇంకా మరో ఇద్దరు సి.ఐ.లు, ఇద్దరు ఎ.ఎస్.ఐ.లు ఉన్నారు. డీకే ప్రతిఘటనా చరిత్రలో ఎస్పీ చనిపోయిన మొట్టమొదటి ఘటనగా ఈ ఆంబుష్‌కు ప్రాధాన్యత వుంది. వీరోచితంగా పోరాడి ఈ ఆంబుష్‌లను విజయవంతం చేసిన పి.ఎల్.జి.ఎ.కు విప్లవాభినందనలు తెల్పుదాం.

## కోరాపుట్ డివిజన్

### బి.జె.డి. నేత జొన్నా ఖతం

కోరాపుట్ జిల్లాలోని బందుగాం బ్లాక్ సోరుపల్లి గ్రామానికి చెందిన జొన్నా పెద్ద రౌడీ, గూండా, కాంట్రాక్టర్, దోపిడీ దొంగ, రేపిస్టు. జొన్నా అంటే బ్లాక్‌లోని ప్రజలంతా భయపడుతారు. లక్షల రూపాయల కాంట్రాక్టులు చేస్తూ ప్రజా ధనాన్ని మింగేవాడు, ఆదివాసీ మహిళలపై అత్యాచారాలకు పాల్పడేవాడు. అంతేకాక ఒక దొంగల ముఠాను ఏర్పాటు చేసి దొంగతనాలు కూడా చేయించేవాడు. స్థానిక పోలీసుల, ప్రభుత్వ అండదండలతోనే జొన్నా ఈ అఘాయిత్యాలకు పాల్పడేవాడు. ఇలా అక్రమంగా కోట్లు సంపాదించి బి.జె.డి. పార్టీలో చేరి బ్లాక్ స్థాయి నాయకుడయ్యాడు. అలాగే ఇన్ఫార్మర్‌గా తయారై పోలీసులకు సమాచారం ఇవ్వడం, వారితోపాటు కూంబింగ్‌లకు తిరగడం, ఇన్ఫార్మర్లను తయారు చేయడం పనిగా పెట్టుకున్నాడు. అలాగే మావోవాది పార్టీ ఆధ్వర్యంలో జరిగిన భూపోరాటాలను అణచడం కోసం సి.ఆర్.పి.ఎఫ్.ను తెచ్చి బందుగాం ఏరియాలో క్యాంపులు పెట్టించాడు. ఆ గూండా ఆగడాలు రోజు రోజుకూ పెరిగిపోవడంతో ప్రజల నిర్ణయం మేరకు రైతాంగ గెరిల్లా దళం అతన్ని ఖతం చేసింది. పీడ విరగడయిందని ప్రజలు సంతోషపడ్డారు.

**పత్రికకు మీ ప్రాంతంలోని పోరాట, ప్రతిఘటన, నిర్బంధ, సభలూ - సమావేశాల నివేదికలు, అమరుల చరిత్రలను ఎప్పటికప్పుడు పంపుతూ వుండండి.**

*( 40వ పేజీ తరువాయి...)*

పురుషులను అరెస్టు చేశారు. అయితే ప్రజలు పెద్ద ఎత్తున ప్రభుత్వ దమనకాండను ప్రతిఘటించారు. ఈ పోరాటం మూడు దశలుగా నడిచింది. 2008 నవంబర్ 5 నుండి డిసెంబర్ 5 వరకూ నడిచిన మొదటి దశలో ప్రజలు పెద్ద ఎత్తున కదిలి రోడ్లను తవ్వేసారు. చెట్లను కూల్చి, రోడ్లపై ఆటంకాలను కల్పించి ఒక్క పోలీసునుకానీ, సి.పి.ఎం. గూండాలను కానీ అడుగుపెట్టనీయలేదు. లాల్‌గఢ్ పోలీస్ స్టేషన్‌పై సాంప్రదాయక ఆయుధాలతో దాడి చేశారు, వాహనాలను తగులబెట్టారు. ఈ ప్రాంతంలోని నాలుగు వందల గ్రామాలతో బయట ప్రపంచానికి గల సంబంధాన్ని తెంచేశారు. క్రమంగా ఈ పోరాటం పురూలియా, బంకూర, పశ్చిమ్ సింగ్‌భూమ్ జిల్లాలలోని 18 బ్లాకులకు వ్యాపించింది. డిసెంబర్ 5 నుంచి 25 వరకూ నడిచిన రెండవ దశ పోరాటంలో శత్రు దాడి తీవ్రతరం అయింది. సి.పి.ఎం. ప్రభుత్వం సల్వాజుడుం తరహాలో దాడులను ప్రారంభించింది. జనప్రతిరోధ్ అనే పేరుతో ఒక సంస్థను సృష్టించి మాంజీ మడ్రాడా అనే జె.ఎం.ఎం. నాయకుడిని ముందుపెట్టి దాడులు చేయించింది. ఇంకా అనేక కొత్త సంస్థలను పుట్టించి దాడులకు పాల్పడింది. మరోవైపు కుట్రపూరితంగా ఆదివాసీ సాంప్రదాయక నాయకులతో సంప్రదింపులు జరిపి వాళ్లను లోబర్చుకుని, వారిచేత పోరాటాన్ని విరమింపచేయాలని మోసపూరిత ప్రకటనలు ఇప్పించింది. అనేక సభలూ, ర్యాలీలు జరిపి ఆ పోరాటంపై ప్రజావ్యతిరేకతను కూడగట్టాలని చూసింది. కానీ ప్రజల న్యాయమైన పోరాటం ముందు ప్రభుత్వ కుటిల ఎత్తుగడలేవీ సఫలం కాలేకపోయాయి. ఆ తర్వాత మూడవ దశలో సి.పి.ఎం. ప్రభుత్వం హరమద్ వాహిని అనే తన ప్రయివేట్ గూండా సేనతో దాడులు చేయించింది.

అయినప్పటికీ, లాల్‌గఢ్ మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డ సి.పి.ఎం. గూండాలనూ, పోలీసులను శిక్షించాలనీ, పోలీసుల కూంబింగ్‌లను నిలిపివేయాలనీ పశ్చిమ మిద్నాపూర్, పురూలియా, బంకూరా జిల్లాల్లో ఆదివాసీల మీద పదేళ్లుగా పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలనీ, మావోయిస్టు కేసులను బనాయించి జైళ్లల్లో పెట్టిన ప్రజలను విడుదల చేయాలనీ, పోలీసు క్యాంపులను ఎత్తివేయాలనీ, కనీస వసతులు కల్పించాలనీ, ఈ ప్రాంతపు వెనుకబాటుతనానికి సి.పి.ఎం. బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ లాల్‌గఢ్ పోరాటం నేటికీ అప్రతిహతంగా కొనసాగుతోంది.

ప్రస్తుతం జరుగుతున్న ఈ పోరాటం నాల్గవ దశ అని చెప్పుకోవాలి. దీన్ని అణచడానికి బలగాలను పంపమని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. తమ మధ్య ఎన్ని వైరుధ్యాలున్నా ప్రజా ఉద్యమాలను అణచడంలో దోపిడీవర్గాలు, పార్టీలు ఏకమవుతాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం కోరిందే తడవుగా కేంద్ర ప్రభుత్వం అయిదు కంపెనీల సి.ఆర్.పి.ఎఫ్.ను, బి.ఎస్.ఎఫ్.ను జూన్ 18న పంపింది. మా పార్టీపై తెలంగాణా తర్వాత మళ్లీ ఇక్కడే బి.ఎస్.ఎఫ్‌ను వినియోగిస్తున్నది. మావోయిస్టు పార్టీ అణచివేతకోసమే ఏర్పాటు చేసిన కోబ్రా బెటాలియన్‌ను కూడా పంపింది. ఈ బలగాలు మొదటి రోజున ప్రతిఘటిస్తోన్న ప్రజలపై విచక్షణా రహితమైన లాఠీచార్జికీ, భాష్ప వాయు ప్రయోగాలకు పాల్పడ్డాయనీ, తరువాత రోజున ప్రజలపై కాల్పులు జరిపాయని తెలుస్తోంది. జూన్ 20న ముగ్గుర్ని చంపి అనేక మందిని గాయపరిచారు. ఇంకా ఈ దారుణాలు మరింతగా పెరిగే ప్రమాదం వుంది. మరిన్ని బలగాల కోసం బుద్ధదేవ్ మన్మోహన్‌ను కోరాడు. జమ్మూ-కాశ్మీర్ తర్వాత బి.ఎస్.ఎఫ్.ను ఉపయోగించడం ఇదే మొదటిసారి.

ఇంత పెద్ద ఎత్తున బలగాలు తరలి వస్తోన్నా ప్రజలు- స్త్రీలూ, పురుషులూ, వృద్ధులూ, పిల్లలు - అందరూ కలిసి మానవహారాలుగా ఏర్పడి బలగాలను ఎదిరిస్తున్నారు. సాంప్రదాయక ఆయుధాలతో ప్రతిఘటిస్తున్నారు పోలీసు అత్యాచారాల వ్యతిరేక పోరాట కమిటీగా ఏర్పడి నిలదీస్తున్నారు. ఇలా చరిత్ర పుటలపై వీరోచిత అధ్యయనాన్ని రచిస్తున్నారు. భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవ పోరాటాన్ని ముందుకు తీసుకుపోతున్నారు. మా పార్టీ ఈ పోరాటానికి నాయకత్వం వహిస్తోంది.

ఇన్నాళ్లు ప్రభుత్వ చిన్న చూపుకు గురయి అభివృద్ధికి దూరంగా వున్న ఈ ఆదివాసీ ప్రజలను ఇప్పుడు ప్రభుత్వం అభివృద్ధి పేరుతో నిర్వాసితులను చేస్తోంది. వాళ్ల భూమినీ, అడవినీ, ప్రకృతి సంపదలను దోచుకోవడానికీ, సామ్రాజ్యవాదానికి దోచిపెట్టడానికి పథకాలు వేస్తోంది. ఈ దోపిడీని వ్యతిరేకిస్తున్నందుకే ప్రజలను ఊచకోత కోయడానికి సిద్ధపడుతోంది. ఈ ఊచకోతకు సాధికారతను కల్పించుకోవడం కోసం ప్రజలు పెద్ద ఎత్తున సాయుధంగా తిరగబడుతున్నారనీ, మావోయిస్టులు దీన్ని విముక్తి ప్రాంతంగా ప్రకటించారని ప్రచారానికి పాల్పడుతోంది. కానీ ప్రజలు సాంప్రదాయక ఆయుధాలతో మాత్రమే పోరాడుతున్నారు. చాలా మంది ప్రజలు నిరాయుధంగానే పోరాడుతున్నారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో పెద్ద ఎత్తున

సాయుధ బలగాలను మోహరించి ఆదివాసీ ప్రజలను తమ అడవుల నుంచీ, తమ భూముల నుంచీ పారదోలే దుష్టపన్నాగం యిది.

ప్రస్తుతం సి.పి.ఎం. మా పార్టీని నిషేధించాలని ఆలోచిస్తోంది. ఇన్నాళ్లూ అధికారికంగా నిషేధించకపోయినా అదెప్పుడూ మా పార్టీని నిషేధిత పార్టీగానే చూసింది. నక్సల్బరీ కాలం నుండి నేటి వరకూ తీవ్రమైన అణచివేతనే ప్రయోగిస్తోంది. ఇప్పుడు అధికారికంగా కూడా నిషేధించి పేరుకైనా వామపక్షం అని చెప్పుకునే అర్హతను అది కోల్పోతుంది. అంతేగానీ నిషేధాలూ, నిర్బంధాలు ప్రజా పోరాటాలను ఆపలేవు.

ప్రస్తుత ప్రభుత్వ అణచివేతలో తృణమూల్ కాంగ్రెస్ (టి.ఎం.సి.)కి కూడా భాగస్వామ్యం వుంది. నందిగ్రాం, సింగూరు వంటి పోరాటాల్లో ప్రజల పక్షపాతిగా నటించిన టి.ఎం.సి.నీ, దాని అధినేత్రి మమతా బెనర్జీని ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గెలిపించారు. మమతా బెనర్జీ తదితర టి.ఎం.సి. నాయకులు మంత్రులు కావడానికీ, యు.పి.ఎ.లో దానికి చెప్పుకోదగిన స్థానం లభించడానికి ప్రజాపోరాటాల పట్ల ఆ పార్టీ ఇన్నాళ్లూ తీసుకున్న వైఖరే కారణం. సి.పి.ఎం.పై, అది అమలుచేస్తున్న అనుకూల విధానాలపై ప్రజల్లో వున్న తీవ్రమైన వ్యతిరేకతను తనకు అనుకూలంగా మలుచుకోవడంలో టి.ఎం.సి. విజయం సాధించింది. కానీ నేడది ఏరు దాటి తెప్ప తగిలేసింది. 2008 నవంబర్‌లో మొదలైన లాల్‌గఢ్ పోరాటాన్ని ఎన్నికల ముందువరకూ సమర్థించిన, ఆందోళనల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న మమతా బెనర్జీ నేడు కేబినెట్ మంత్రి కాగానే అదే పోరాటాన్ని అణచడానికి పెద్ద ఎత్తున బలగాలను పంపడంలో సూత్రధారి అయ్యింది. నందిగ్రాం, సింగూర్‌లలో పోలీసు బలగాల మోహరింపును వ్యతిరేకించిన ఆమె, నేడు మరింత పెద్ద స్థాయిలో బలగాల మోహరింపులో భాగస్వామురాలయింది. అంతేకాదు మా పార్టీని నిషేధించాలని మాట్లాడుతూ తన వర్గ స్వభావాన్ని స్పష్టంగా బయటపెట్టుకుంది. తన 'ప్రేమ' ప్రజలపైన కాదనీ, అధికారం పైనేనని చాటుకుంది. ప్రజలు ఇటువంటి కుటిల నాయకులను ఎన్నటికీ క్షమించలేరు. తమ పోరాటాలనుంచే ప్రజలు నాయకులను సృష్టించుకుంటారు. ఆ నాయకులు వెన్నుపోటుకు ప్రయత్నిస్తే వారిని చరిత్ర పెంట కుప్పపై విసిరేసి సరైన, నూతన నాయకులను సృష్టించుకుంటారు.

నేడు లాల్‌గఢ్ ప్రజలు చేస్తున్న పోరాటం ఈ ప్రాంతానికి మాత్రమే సంబంధించిన పోరాటం కాదు. దేశ సార్వభౌమత్వాన్నీ, సాధికారతనూ, స్వావలంబనను సామ్రాజ్యవాదులకు తాకట్టు పెడుతోన్న దోపిడీ భారత పాలకవర్గాలకు, భారత పాలకవర్గాలను కీలు బొమ్మలుగా ఆడిస్తున్న సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా లాల్‌గఢ్ ప్రజలు మహోన్నతమైన చైతన్యంతో చారిత్రక కర్తవ్యాన్ని స్వీకరించి ముందుకు తీసుకెళ్తున్నారు. కాబట్టి ఈ పోరాటం పీడిత ప్రజలది, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులది, ప్రజాస్వామికవాదులది.

ఈ పోరాటాన్ని అణచడానికి రివిజనిస్టులూ, సామ్రాజ్యవాద తొత్తులు పాల్పడుతున్న దమనకాండను దేశవ్యాప్తంగా ప్రజలూ, ప్రజాస్వామికవాదులూ, మేధావులు ఖండించాలని మేం విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ పోరాటాన్ని బలపరచాలనీ, ఈ పోరాటానికి మద్దతుగా దేశవ్యాప్తంగా విస్తృతమైన ప్రజా ఉద్యమాలను చేపట్టాలని పిలుపునిస్తున్నాం. లాల్‌గఢ్‌ను ఒక నమూనాగా స్వీకరించి దేశవ్యాప్తంగా గెరిల్లా జోన్ ప్రాంతాల్లో పోరాటాలను తీవ్రతరం చేయాలనీ, ఆదివాసీ ప్రాంతంలో సాగుతున్న ఈ పోరాటాన్ని మైదాన ప్రాంతాలకూ, పట్టణాలకు వ్యాపింప చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిస్తున్నాం.

తమ పార్టీ నిజస్వరూపాన్ని గుర్తించవలసిందిగా సి.పి.ఐ., సి.పి.ఎం. సాధారణ కార్యకర్తలకు మేము విజ్ఞప్తి చేస్తున్నాం. సామ్రాజ్యవాదుల, భారత దోపిడీ వర్గాల పక్షాన చేరిన రివిజనిస్టు పార్టీలను ఛీ కొట్టి, ప్రజల పక్షాన నిలబడి పోరాడవలసిందిగా కోరుతున్నాం.

ప్రతాప్

తేది: 21-06-2009

(ప్రతాప్)

ప్రతినిధి

పత్రికా ప్రకటన

## వీరోచితమైన లాల్‌గఢ్ పోరాటానికి దేశవ్యాప్తంగా సంఘీభావాన్ని ప్రకటించండి!

## లాల్‌గఢ్ పోరాటంపై ఊచకోతకు పాల్పడుతున్న సోషల్ ఫాసిస్టులనూ, కేంద్ర ప్రభుత్వాన్ని ఎండగట్టండి!!

చారిత్రాత్మక నక్సల్బరీ వసంతమేఘ గర్జనతో భారతదేశ విప్లవానికి నూతన ప్రజాస్వామిక వెలుగును చూపించిన పశ్చిమ బెంగాల్ మరోసారి విప్లవ వెల్లువై చారిత్రక రంగం మీదికి వచ్చింది. ఈ సారి ఈ విప్లవ వెల్లువకు లాల్‌గఢ్ చిరునామా అయింది. నక్సల్బరీకి సగర్వమైన కొనసాగింపయింది. 'నక్సల్బరీ'ని పాశవికంగా అణచివేసిన రివిజనిస్టు, సోషల్ ఫాసిస్ట్ సి.పి.ఎం. ఇప్పుడు లాల్‌గఢ్ పోరాటాన్ని అణచివేయడానికి పూనుకుంది. కేంద్ర ప్రభుత్వ సహాయంతో సి.ఆర్.పి.ఎఫ్., కోబ్రా బెటాలియన్లను మోహరిస్తూ రక్తపుటేరులు పారించడానికి దుష్ట పథకాలు రచిస్తోంది.

పశ్చిమ బెంగాల్‌లో గత 40 ఏళ్లుగా రాజ్యమేలుతున్న రివిజనిస్టులు ప్రజలపై నిరంకుశ అధికారాన్ని చెలాయిస్తూ సోషల్ ఫాసిస్టులుగా తయారయ్యారు. ఒక వైపు సోషలిజం కబుర్లు చెప్తూ, మరోవైపు రాష్ట్రాన్ని దోపిడీ వర్గాలకు దోచిపెడ్తున్నారు. తాము అధికారంలో లేని రాష్ట్రాల్లో సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనాను వ్యతిరేకిస్తున్నట్టుగా నటిస్తూ, తాము అధికారంలో వున్నచోట అదే అభివృద్ధి నమూనాను మరింత దూకుడుగా అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే సింగూర్లో కార్ల ఫ్యాక్టరీ ఏర్పాటుకు టాటాకు వేల ఎకరాల భూములను కట్టబెట్టడానికి చూసారు. నందిగ్రాంలో డౌ కెమికల్ హబ్‌ను ఏర్పాటు చేయడం కోసం వేల ఎకరాల భూములను లాక్కునే ప్రయత్నం చేశారు. కానీ తెభాగ, నక్సల్బరీలకు వారసులైన ప్రజలు వీరోచితంగా పోరాడి తీవ్రమైన దమనకాండను ఓడించి టాటాను తరిమి కొట్టారు. నందిగ్రాంలో సెజ్‌ను అడ్డుకున్నారు. ఇలా తమ పోరాటం ద్వారా ప్రపంచీకరణలో భాగంగా నిర్వాసితమవుతున్న దేశ ప్రజలందరికీ ఒక అనుసరణీయమైన మార్గాన్ని చూపించారు. ఇది సామ్రాజ్యవాదులకూ, దళారీ నిరంకుశ బూర్జువాలకూ, ఈ వర్గాలకు నిస్సిగ్గుగా పాదసేవ చేస్తోన్న రివిజనిస్టు సి.పి.ఎం.కూ కంటగింపైంది.

తాను అనుసరిస్తున్న విధానాలను ప్రజలు ఇంతగా వ్యతిరేకిస్తున్నారనీ, తిరగబడ్తున్నారనీ స్పష్టంగా అర్థమవుతున్నా బుద్ధి తెచ్చుకోని బుద్ధదేవ్ దోపిడీ వర్గాల పాదసేవలో మరింత సాగిలా పడ్తూ పశ్చిమ మిడ్నాపూర్ జిల్లాలోని సల్బనీ ప్రాంతంలో 35 వేల కోట్ల పెట్టుబడితో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించడానికి జిందాల్‌కు అనుమతినిచ్చాడు. 2008, నవంబర్ 2న అట్టహాసంగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవాన్ని ముగించుకొని వస్తున్న బుద్ధదేవ్, రాం విలాస్ పాశ్వాన్‌ల కాన్వాయ్‌పై ప్రజల ఆగ్రహం మందుపాతరై పేలింది. ప్రజల ప్రగాఢమైన ఆకాంక్ష మేరకు పి.ఎల్.జి.ఎ. లాల్‌గఢ్‌కు సమీపంలో ఈ చర్యకు పాల్పడింది. కానీ బుద్ధదేవ్ తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. ఆ తర్వాత ప్రతీకారంతో రగిలిపోతూ లాల్‌గఢ్ ప్రాంత ప్రజలపై విరుచుకుపడ్డాడు. ఇండ్లను తగులబెట్టి పెద్దఎత్తున విధ్వంసం సృష్టించారు. మహిళలపై అత్యాచారాలు చేశారు, కొందరు

*(మిగితాది 38వ పేజీలో...)*

**సి.పి.ఐ. (మావోయిస్టు)ను ఉగ్రవాద సంస్థగా పేర్కొంటూ 2009 జూన్ 22న నిషేధించడాన్ని ఖండించండి!**

**బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించడం ద్వారా నిషేధానికి వ్యతిరేకంగా పోరాడండి!!**